ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్ : fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 133 పేజీలు: 8+16 వెల: 6.50


నేటినుంచి ప్రధాని విదేశ పర్యటన 5లో

రేవంత్‌కే ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీ ఏమిటి?: కెటిఆర్ 7లో

## డీల్ కుదిరిందని అమెరికా.. తుది డీల్ ఖరారు కాలేదన్న ఇరాన్!



**న్యూయార్క్,జూన్ 12:** ఇరాన్‌పై దాడుల్ని నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటిస్తే ఇరాన్ మాత్రం అదేమీ లేదని ఖండిస్తోంది.అమెరికాతో తుది ఒప్పందం ఇప్పటికీ ఖరారుకాలేదని వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనను ఇరాన్ ఖండించింది. అమెరికాతో ఎటువంటి తుది నిర్ణయం జరగలేదని ఇరాన్ పేర్కొన్నది. ఒప్పందానికి చెందిన డాక్యుమెంట్లపై తుది సంతకాలు మరికొన్ని రోజుల్లో జరగనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో డీల్ చివరి దశలో ఉందని, లేదంటే భారీ దాడులు చేస్తామని ట్రంప్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఖతార్ మీడియేటర్లు, ఇరాన్ ప్రతినిధుల మధ్య చర్చలు సాగుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. అయితే వారి మధ్య డీల్ కుదిరినట్లు తెలిసిందన్నారు. ఇరానీ నేతలతో జరిగిన చర్చలు కొలిక్కి వచ్చాయని, దీంతో ప్రతిపాదిత దాడులను రద్దు చేస్తున్నట్లు ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ప్రకటించారు. చర్చల్లో అన్ని అంశాలపై అంగీకారం కుదిరిందని, అన్నిపార్టీలు అప్రూవ్ చేశాయని, అమెరికా, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, టర్కీ, పాకిస్థాన్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఈజిప్టుతో పాటు ఇతర దేశాలు కూడా ఆ ఒప్పందాలకు అంగీకరించినట్లు ట్రంప్ తెలిపారు. అయితే ఇరానీ షిప్పింగ్‌పై మాత్రం పూర్తి స్థాయిలో ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పీస్ డీల్‌పై సంతకాల గురించి టైం, స్థలాన్ని త్వరలో ప్రకటిస్తామని ట్రంప్ తెలిపారు. ట్రంప్ చేసిన డీల్ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ రియాక్ట్ అయ్యింది. తుది డీల్ ఫైనలైజ్ అయిన అంశం తమకు తెలియదని ఇజ్రాయెల్ చెప్పింది. ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాగేహి మాట్లాడుతూ శాంతి ఒప్పందంపై సంతకాలకు సంబంధించిన అంశం తమకు తెలియదన్నారు. డీల్‌పై ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. చర్చలకు చెందిన అంశాల్లో చాలా వరకు డీల్ ఓకే చేసుకున్నా అమెరికా మాత్రం ప్రతి చర్చల్లోనూ తన అభిప్రాయాలను మార్చుకుంటోందని ఇస్మాయిల్ బాగేహి ఆరోపించారు. యూరోప్‌లో జరిగే సంతకాల కార్యక్రమానికి జేడీ వాన్స్, స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్ హాజరుకానున్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన మేధావుల సమ్మేళనంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్న దృశ్యం. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచంద్రరావు, ఈటల తదితరులు

## 2047కు వికసిత్ భారత్ సాధనే లక్ష్యం

### పన్నెండేళ్ల ప్రధాని మోడీ పాలన చరిత్రాత్మకం

### మేధావుల సమ్మేళనంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్12:** గడిచిన 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తిరుగులేని గౌరవాన్ని, శక్తివంతమైన గుర్తింపును సాధించిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన 'మేధావుల సమ్మేళనం'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. '12 ఏళ్ల సుపరిపాలన అభివృద్ధి ప్రజా సంక్షేమం' అనే అంశంపై జరిగిన ఈసదస్సులో ఆయనమాట్లాడుతూ.. దేశంలో, అంతర్జాతీయంగా భారతదేశం సాధించిన అపూర్వ ప్రగతిని వివరించారు. ఈవేదికపై మేధావులను ఉద్దేశించి మాట్లా >>2

## పవన్‌ను ఎవరు కాదన్నారు?



శుక్రవారం న్యూఢిల్లీలో రాహుల్‌గాంధీతో సీఎం రేవంత్

- ఆయన తెలంగాణకు రావొచ్చు, వెళ్లొచ్చు, పోటీ చేయొచ్చు
- ఓటు చోరీనుంచి బిజెపి సీటు చోరీకి వచ్చింది
- మీనాక్షి నటరాజన్ వ్యవహారంలో బిజెపి కార్యకర్తలా మారిన ఆర్‌ఒ
- హిట్లర్ ఆదర్శమని ఎప్పుడూ అనలేదే!
- ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్12:** తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ తెలంగాణ రాజకీయాల్లోకి రావడం లేదా ఎన్నికల్లో పోటీ చేయడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. పవన్‌కు సంబంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరికైనా ఎక్కడైనా పోటీ చేసే హక్కు ఉందని, తెలంగాణలో కూడా ఎంతో మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఎన్నికల్లో పోటీ చేశారని, అలాంటి పరిస్థితుల్లో పవన్ కల్యాణ్‌ను ఎందుకు అడ్డుకుంటామని ప్రశ్నించారు. 'రావచ్చు... పోవచ్చు... పోటీ చేసుకోవచ్చు' అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలకు,తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే ప్రభుత్వం లేదా ప్రజాప్రతినిధులు సమాధానం ఇవ్వాల్సి వస్తుందని, ప్రజలకు వ్యతిరేకంగా >>2



### మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంలో చుక్కెదురు

ఆమె కేసు ఇసియే పరిష్కరించాలని వెల్లడి 2లో

ఫామ్ 26లో అడిగిన వివరాలు ఇచ్చా: మీనాక్షి నటరాజన్

### సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం 2లో

### ఐ సెట్‌లో 91.22 శాతం అర్హత

బాలురు 90%, బాలికలు 91% 2లో






శుక్రవారం హైదరాబాద్‌లో ఐసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

# ఐ సెట్‌లో 91.22 శాతం అర్హత

## బాలురు 90%, బాలికలు 91%

### 165 మార్కులతో ఐశ్వర్య రెడ్డి మొదటి ర్యాంక్

### ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 12:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐ సెట్-2026 పరీక్షలో 91.22 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. బాలికల్లో 91.62 శాతం అర్హత సాధించగా, బాలురు 90.74 శాతం అర్హత సాధించినట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. ఐ సెట్-2026 ఫలితాలను శుక్రవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదలచేశారు. ఈకార్యక్రమంలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్ కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ఐ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ అలువాల రవి పాల్గొన్నారు. ఐ సెట్‌లో 165.68 మార్కులతో అనుగు ఐశ్వర్య రెడ్డి మొదటి ర్యాంకును సొంతం చేసుకుంది. 157.38 మార్కులతో కొప్పొల్ లిఖిత రెండో ర్యాంకు, 152 మార్కులతో శ్రీవరణిరెడ్డి మన్నె 3వ ర్యాంకు, 151.93 మార్కులతో గోనుగుంట రోహిత్ కుమార్ 4వ ర్యాంకు, 151.70 మార్కులతో మర్రి శ్రేయాన్ 5వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఐ సెట్ పరీక్షలను మే 13, 14 తేదీల్లో నిర్వహించారు. ఐసెట్‌కు 56,206 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 51,146 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 46,654 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 91.22 శాతం మంది అర్హత సాధించారు. పరీక్షకు 30,299 మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా వారిలో 27,793 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 25,463 మంది(91.62శాతం) అర్హత సాధించారు. 25,907 మంది పురుషులు దరఖాస్తు చేసుకోగా వారిలో 23,353 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 21,191 మంది(90.74శాతం) అర్హత సాధించారు. తెలంగాణ వ్యాప్తంగా 16 రీజినల్ సెంటర్లలో, 69 పరీక్ష కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించారు. రాష్ట్రంలో 287 ఎంబిఏ కాలేజీలు ఉండగా వాటిలో 40,601 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 35,141 సీట్లు భర్తీ అయ్యాయి. 80 ఎంసిఏ కాలేజీలు ఉండగా వాటిల్లో 9360 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో 5420 సీట్లు భర్తీ అయ్యాయని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఏసీటీఈ అనుబంధ గుర్తింపు ప్రక్రియ పూర్తయిన తరువాత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

# రాహుల్‌గాంధీని కలిసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్12:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీతో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేస్తూ పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అగ్రనేత రాహుల్ గాంధీతో తాను కేబినెట్ విస్తరణ అంశంపై ఎలాంటి చర్చలు జరపలేదని స్పష్టం చేశారు. పార్టీనేతలు, ఎమ్మెల్యేలు ఎవరైనా అధిష్ఠానాన్ని కలుసుకునే పూర్తి స్వేచ్ఛ ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన 66 మంది ఎమ్మెల్యేలు మంత్రి పదవికి అర్హులేనని, అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం కేబినెట్‌లో కేవలం 17మందికే అవకాశం ఉంటుందని సిఎం గుర్తు చేశారు. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు, సీనియారిటీ,పార్టీ విధేయత వంటి రకరకాల కారణాలతో లోతుగా పరిశీలించిన తర్వాతే మంత్రులుగా ఎంపిక ఉంటుందని ఆయన వివరించారు.

# 'నీట్'కు మరో 15 నిమిషాలు

## మధ్యాహ్నం2 గం. నుంచి 5.15 దాకా పరీక్ష

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 12:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్షలో మార్పులను చేసినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) ప్రకటించింది. నీట్ పరీక్షకు అదనంగా 15 నిమిషాలు కేటాయించింది. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా సమయాన్ని మరో 15 నిమిషాలు పొడిగించిన నేపథ్యంలో ఈ నెల 21న జరిగే పరీక్షను మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల 15 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు ఎన్‌టిఏ ప్రకటించింది. ఇకపై నీట్ పరీక్ష 195 నిమిషాల పాటు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియ కోసం పెంచిన సమయం ఉపయోగపడుతుందని ఎన్‌టిఏ తెలిపింది. అభ్యర్థుల నుంచి గత కొన్నేళ్లుగా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న నేపథ్యంలో ఈ మార్పులు చేసినట్లు ఎన్‌టిఏ ప్రకటించింది. అలాగే రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వెల్లడించింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ కోసం ఇప్పటివరకూ రెండు పేజీలు ఇస్తుండగా.. ఈసారి 4 పేజీలు ఇవ్వనున్నట్లు ఎన్‌టిఏ పేర్కొంది. ఎడమవైపే వాటం ఉన్న విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రశ్నపత్రం మొదట్లో, చివరిలో రెండేసి రఫ్ పేజీలను ఏర్పాటు చేసినట్లు వివరించింది. గతంలో రఫ్ వర్క్ పేజీలు కేవలం ప్రశ్నపత్రం బుక్‌లెట్ చివరలో మాత్రమే ఉండేవని, సవరించిన విధానం ప్రకారం సూచనల పేజీ తర్వాత వెంటనే రెండు రఫ్ వర్క్ పేజీలు ఉంటాయి, మరో రెండు పేజీలు బుక్‌లెట్ చివరలో ఉంటాయని తెలిపింది. ఈ కొత్త విధానం ప్రశ్నపత్రం ఇంగ్లీష్, ప్రాంతీయ భాషా వెర్షన్లు రెండింటిలోనూ ప్రవేశపెట్టారు. పరీక్ష ప్రారంభం, ముగింపులో ఉండే ఇన్విజిలేషన్ ప్రక్రియలోని సంతకాలు చేయడం వాటికి మూలంగా తమ అసలు సమయాన్ని తగ్గిస్తున్నాయని అభ్యర్థులు గతంలో భావించేవారు. ఆ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేలా సమయ వ్యవధిని రూపొందించామని ఎన్‌టిఏ పేర్కొంది. ఈ ప్రక్రియతో మొత్తం సమయాన్ని 195 నిమిషాలుగా నిర్ణయించామని, అభ్యర్థుల లెక్కలు, విశ్లేషణలు చేసుకోవడానికి వీలుగా ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్‌వర్క్ కోసం కేటాయించిన పేజీల సంఖ్యను రెండు పేజీల నుంచి నాలుగు పేజీలకు పెంచాం. ఇప్పుడు బుక్‌లెట్‌లో ముందు, వెనుక భాగాల్లో రఫ్‌వర్క్ పేజీలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ప్రతి అభ్యర్థి సౌకర్యవంతంగా పరీక్ష రాయవచ్చని ఎన్‌టిఏ తెలిపింది. నీట్(యుజి)-2026 పరీక్షను పారదర్శకంగా, సురక్షి తంగా అభ్యర్థులకు అనుకూలమైన రీతిలో నిర్వహించడానికి, పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా విధానాన్ని నిరంతరం మెరుగుపరచడానికి తమకున్న నిబద్ధతను ఎన్‌టిఏ పునరుద్ఘాటించింది.

# పవన్‌ను ఎవరు కాదన్నారు?

>> మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. పవన్ కల్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. పవన్ నిర్వహించాలనుకున్న సభకు అనుమతి నిరాకరించిన అంశంపై సిఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందనే కారణంతోనే పోలీసులు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని,భద్రతా పరమైన అంశాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని వివరించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రతిపక్ష నేతల సభలు, ర్యాలీలకు కొన్ని సందర్భాలలో అనుమతులు నిరాకరించిన ఘటనలు ఉన్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభలు,ర్యాలీలకు కూడా కొన్ని సందర్భాలలో అనుమతులు లభించలేదని గుర్తు చేశారు. అయితే పవన్ కల్యాణ్‌కు దేశ రాజ్యాంగం కల్పించిన అన్ని ప్రజాస్వామ్య హక్కులు ఉన్నాయని,ఆయనకు ఎక్కడైనా వెళ్లే స్వేచ్ఛ ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం కూడా ఆయన హక్కేనని పేర్కొన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సిఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సిఎం రేవంత్ ఆరోపించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల రాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సిఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. ఎవరి వద్ద తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే తనకు చెప్పారని రేవంత్ అన్నారు. పోలవరం కోసం 4 మండలాలను ఎపిలో కలిపారని,అదే రీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా అని ప్రశ్నించారు. మహారాష్ట్రను ఒప్పించే వరకు కేబినెట్ సమావేశాలకు రానని కిషన్‌రెడ్డి చెప్పలేరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిజెపికి ఉన్న 8 మంది ఎంపీలంతా గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులువస్తాయి కదా అని రేవంత్‌రెడ్డి అన్నారు. బిజెపి ఇప్పటిదాకా గాడ్సేను ఆదర్శంగా తీసుకుందని అనుకున్నామని, అయితే ఇప్పుడు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను కూడా ఆదర్శంగా తీసుకుందంటూ సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కిమ్ జాంగ్ లాగనే బిజెపి నేతలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని,కానీ ఫలితాలు మాత్రం అధ్యక్షుడు కిమ్ చెప్పిన విధంగా వస్తాయన్నారు.ఇప్పటి వరకు బిజెపి ఓటు చోరీ మాత్రమే చేసిందని, ఇప్పుడు సీట్ చోరీ కూడా మొదలు పెట్టిందని, బిజెపికి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బిజెపి దుర్బుద్ధి బయటపడిందన్నారు. మధ్యప్రదేశ్‌లో బిజెపికి నంబర్ లేకపోయినా పోటీలో ఎందుకు నిల్చున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమని, రిటర్నింగ్ అధికారి కమలం పార్టీ కార్యకర్తలతా వ్యవహరించారని ఆరోపించారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. ఈ ఘటనతో అటు ప్రజాస్వామ్య వ్యతిరేకిగా ఇటు మహిళా వ్యతిరేకి బిజెపి నిలబడిందని అని సిఎం రేవంత్ విమర్శించారు. ఈ వివాదం నుంచి బయటపడేందుకు ఆ పార్టీ తమపై నేర పూరిత దాడికి దిగిందన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షంతో సిఎం విమానం బెంగళూరుకు మళ్లింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్12:** హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లించాల్సి వచ్చింది. ఢిల్లీ నుంచి శంషాబాద్ వస్తున్న విమానాన్ని హైదరాబాద్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా బెంగళూరుకు డైవర్ట్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 6.30 గంటలకు ఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో బయలుదేరారు. హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడింది. దీంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుసింది. చందానగర్, జేఎన్టీయూ, జీడిమెట్ల, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, నాంపల్లి, అబిడ్స్, బషీర్‌బాగ్, మియాపూర్, కెపిహెచ్‌బి, సనత్‌నగర్, బోరబండ, పంజాగుట్ట, కోఠి, మలక్‌పేట, సరూర్‌నగర్, చంపాపేట, నారాయణగూడ ప్రాంతాల్లో వర్షం కురుసింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తున్నాయి. వర్షం కారణంగా అనేక చోట్ల ప్రధాన రహదారిపైకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.




లక్నోలో శుక్రవారం కాక్రోచ్ జనతాపార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన జరిపిన దృశ్యం

# మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంలో చుక్కెదురు

## ఆమె కేసు ఇసియే పరిష్కరించాలని వెల్లడి

### ప్రజాప్రతినిధుల కోర్టులో తేల్చుకోండి: పిటిషనర్‌కు నాంపల్లి కోర్టు సూచన

### ఫామ్ 26లో అడిగిన వివరాలు ఇచ్చా: మీనాక్షి నటరాజన్

**హైదరబాద్,జూన్12,ప్రభాతవార్త:** రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం వేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ అభ్యర్ మీనాక్షి నటరాజన్‌కు శుక్రవారం చుక్కెదురైంది. తెలంగాణలో నమోదైన శ్రీలత కేసు పిటిషన్ వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే కారణంతో ఆమె నామినేషన్‌ను రద్దుచేసిన ఇసి నిర్ణయంలో జోక్యం చేసుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ఎఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం సదరు పిటిషన్‌ను కొట్టివేసింది. తిరస్కరించిన నామినేషన్ పరిష్కరించాల్సి బాధ్యత ఎలక్షన్ కమీషన్‌దే అని ఒక్కసారి నామినేషన్ తిరస్కరణకు గురైతే, దాని పరిష్కారం కోసం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాల్సిందే అని సుప్రీంకోర్టు చెప్పింది. ఏమైనా అభ్యంతరాలుంటే మళ్లీ ఎన్నికల సంఘాన్నే ఆశ్రయించాల్సిందేనని పేర్కొంది.ప్రస్తుత దశలో తాము నేరుగా జోక్యం చేసుకునే అవకాశం లేదని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేత మీనాక్షీ నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ కేసును శుక్రవారం సుప్రీంకోర్టు విచారించింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె వేసిన నామినేషన్‌ను లీగల్ కేసు ఉన్న నేపథ్యంలో ఫామ్26 పొందుపరచలేదని మీనాక్షీ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. అయితే అత్యవసర పిటీషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు స్పందిస్తూ గతంలో నామినేషన్ల పత్రాలను తిరస్కరించినకేసుల్లో ఎప్పుడైనా కోర్టుజోక్యం చేసుకున్న తీర్పులు ఉన్నాయా అని సుప్రీంకోర్టు మీనాక్షీ లాయర్‌ను ప్రశ్నించింది. ఆమె లాయర్ అభిషేక్ సింఘ్వీని మాట్లాడుతూ ఏదైనా క్రిమినల్ కేసులో రెండేళ్ల శిక్ష పడితేనే అప్పుడు సమాచారాన్ని వెల్లడించాలని, కానీ ప్రస్తుత కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ చేశారని కోర్టుకు తెలిపారు. తప్పుడు పద్ధతిలో మధ్యప్రదేశ్ రిట్నరింగ్ అధికారి రాజ్యసభ నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్లు సింఘ్వీ వాదించారు. మీనాక్షీ నటరాజన్ అసంపూర్ణ పత్రాలను సమర్పించినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ పేర్కొన్నారు. ఫామ్ 26లో కోర్టు ఫిర్యాదు గురించి వెల్లడించలేదని ఆర్వో చెప్పారు. తెలంగాణలో రిజిస్టర్ అయిన కేసును మీనాక్షీ తన అఫిడవిట్‌లో పొందుపరచలేదని మీనాక్షీ రిట్ పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ప్రకారం ఆ పిటీషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. నామినేషన్ తిరస్కరణ అంశంలో ఆర్టికల్ 32 ప్రకారం చర్యలు తీసుకోవాలని మీనాక్షీ తరపున న్యాయవాది కోర్టును కోరారు. ఈ కేసులో ఎన్నికల పిటీషన్ దాఖలు చేసుకోవాలని సుప్రీం సూచించింది. ఈ కేసులో ఎటువంటి మెరిట్స్ లేవని ధర్మాసనం పేర్కొన్నది. ఇదిలా ఉండగా శుక్రవారం శ్రీలత అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు విచారించింది. నారాయణపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కంభం శివకుమార్ రెడ్డి తనపై వేధింపులకు పాల్పడి చంపుతానని బెదిరించినా ఆయనపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొంది. ఆ పిటిషన్ పై కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మీనాక్షి నటరాజన్ సహా పిటిషన్ లో పేర్కొన్నవారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ కేసు తమ పరిధిలోకి రాదని పేర్కొంది. పిటిషన్‌ను శ్రీలతకు రిటర్న్ చేసి ప్రజా ప్రతినిధుల కోర్టులో తేల్చుకోవాలని సూచించింది. మీనాక్షి నటరాజన్‌పై ఏలాంటి కేసులులేవని సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ తెలిపారు. ఆమెకు జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిందని, ఈ పిటిషన్ ను ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ చేస్తున్నామని తెలిపారు.

**ఎన్నికల అధికారులు రాజీపడ్డారని ముందు నుంచీ చెబుతున్నా: మీనాక్షి**

ఎన్నికల అధికారులు రాజీపడ్డారని ముందు నుంచి చెబుతున్నానని కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. సుప్రీంకోర్టులో పిటిషన్ రిజెక్ట్ అవ్వడంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రజాస్వామ్యానికే ఎదురుదెబ్బగా అభివర్ణించారు. ప్రభుత్వంతో ఎన్నికల అధికారులు కుమ్మక్కయ్యారని తాను మొదటి నుంచీ చెప్తున్నానని, ఎవరూ దానిని పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల అధికారులను కలిసేందుకు యత్నిస్తే జవాబు ఇవ్వలేదన్నారు. ఎన్నికల సంఘంనుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదని, అధికారులు రాజీపడినట్లు స్పష్టమవుతోందని విమర్శించారు. నేను ఎక్కడ గోప్యత ప్రదర్శించలేదని తన సమస్య మొత్తం ఫామ్ 26 చుట్టు తిరుగుతోందని, ఫామ్ 26లో కొన్ని విషయాలు దాచిపెట్టినట్లు తనపై ఆరోపణలు వచ్చాయని ఎఐసిసి తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ నేను దాచింది ఏదీలేదని ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో ఉందని కానీ ఫామ్ 26లో ఆ విషయాలను వెల్లడించే కాలమ్ ఏదీ లేదని ఆమె అన్నారు. తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ కావడానికి ఫామ్ 26 ప్రధాన కారణమని, పెండింగ్ కేసులకు చెందిన సమాచారాన్ని వెల్లడించలేదని ఆరోపణలు ఉన్నాయని, కానీ ఇది తనకు వర్తించదని చెప్పారు. తనకు కేవలం లీగల్ నోటీసులు మాత్రమే ఇచ్చారని అన్నారు. ఇసికి సమర్పించిన మెమోరండంలో ఆ లీగల్ వివరాలను వెల్లడించినట్లు చెప్పారు. సుప్రీంకోర్టు లోనూ ఆ నిజాలను సమర్పించినట్లు ఆమె తెలిపారు.గతంలో తనకు కేవలం లీగల్ నోటీసు మాత్రమే వచ్చిందని, కానీ ఆ కేసులో కోర్టు కనీసం తన అభిప్రాయాన్ని కూడా తీసుకోలేదన్నారు. అయితే ఫామ్ 26లో ఎక్కడా లేని అంశాన్ని ఎలా పొందుపరుస్తారని ఆమె అన్నారు. ప్రైవేటు ఫిర్యాదులపై సమాచారాన్ని వెల్లడించేందుకు ఫామ్ 26లో ఎటువంటి కాలమ్ లేదని ఆమె తెలిపారు. ఒకవేళ అలాంటి కాలమ్ ఏదైనా ఉంటే, కచ్చితంగా ఆ సమాచారాన్ని వెల్లడించే దాన్ని అనీ ఆమె వివరించారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం



చత్తీస్‌గడ్ సిఎం విష్ణుదేవ్ సాయితో భేటీ అయిన మంత్రి ఉత్తమ్

## చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ

### 4.4 లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ

### సర్వేకోసం రూ.9.883 కోట్లు విడుదల

**హైదరాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క-సారక్క బ్యారేజ్ /సమ్మక్క సాగర్ ప్రాజెక్టు అనుమతుల సాధనలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు పడింది. సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు నిరభ్యంతర ధృవీకరణ పత్రం జారీకి చత్తీస్‌ఘడ్ సిఎం విష్ణుదేవ్ సాయి అంగీకరించారు. సమ్మక్క-సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టిఎంసిల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరణకు అదనంగా రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించడానికి తోడ్పడుతోంది. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి గురువారం రాత్రి హైదరాబాద్ రాగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయనతో సమావేశమైనారు. సమ్మక్క సాగర్ డిపిఆర్ కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన నిరభ్యంతర ధృవీకరణ పత్రం జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక విజ్ఞాపన పత్రాన్ని ఛత్తీస్‌గఢ్ సిఎంకి సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమ్మక్క బ్యారేజికి కేంద్రజలసంఘం అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని మంత్రి తెలిపారు. మరింత ఖచ్చితమైన సర్వేకోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందన్నారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారెస్పీ స్టేజ్-2 ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడిందన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జిఓఎంఎస్ నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డిపిఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినతర్వాత నీటిపారుదల రంగ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రాజెక్టును పునఃరూపకల్పన చేశారని మంత్రి తెలిపారు. సాంకేతిక అధ్యయనాల అనంతరం బ్యారేజ్‌ను ములుగు జిల్లాలోని తూపాకుల గూడెం వద్ద నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా మరింత ప్రయోజనకరమని తేలిందన్నారు. ఈ మార్పుతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందని వివరించారు.

సమ్మక్క-సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టిఎంసిల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. అదనంగా రామప్ప-పాకాల లింక్ కాలువద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు.ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 96,494 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 85,774 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 22,422 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,111 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనం కలుగు తుందని ఆయన తెలిపారు. రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా ములుగు జిల్లాలో 8,000 ఎకరాలు, వరంగల్ నర్సంపేట ప్రాంతంలో 22,000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతుండటం, తెలంగాణ ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేయడం, ముంపు ప్రభావితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ముందుకు రావడం, రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వాతావరణం నెలకొనడం వల్ల ఎన్ఓసి త్వరలోనే లభించే అవకాశాలు మెరుగయ్యాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎన్ఓసీ జారీ చేసిన వెంటనే కేంద్ర జల సంఘం అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ డిపిఆర్ తుది పరిశీలన పూర్తి చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దీంతో సమ్మక్క-సారక్క బ్యారేజ్ అమలుకు ఉన్న చివరి ప్రధాన పరిపాలనా అడ్డంకి కూడా తొలగిపోయే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

13-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
త్రయోదశి సా.4.04
కృత్తిక రా.1.15
వర్జ్యం : మ.2.40-సా.4.04
దు.తె.5.34 - 7.14
శుభసమయం : ఉ.6.00-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30


## వార్తాఫలం

- **మేషం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పాతమిత్రులను కలసి ఆనందంగా గడుపుతారు.
- **వృషభం:** జీవిత భాగస్వామితో విభేదాలు రాకుండా సామరస్యంగా ఉండేటట్లుగా మెలగడం చెప్పదగినది.
- **మిథునం:** ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులు ఉండవు.ఆత్మ విమర్శ చేసుకుంటారు.
- **కర్కాటకం:** పెట్టుబడులకు తగిన ఫలితం దక్కుతుంది. కళారంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. వస్త్రలాభం.
- **సింహం:** ఋణాలు తీరి ఊరట చెందుతారు. కొన్ని అవకాశాలు అను కోకుండా లాభిస్తాయి. క్రయ విక్రయాలలో లాభాలు.
- **కన్య :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వ్యాపారంలో రోటేషన్ బాగుంటుంది. వాహనసౌఖ్యం.
- **తుల :** ఆర్థికంగా లాభం కూర్చే వ్యవహారాలు అనుకూలిస్తాయి. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.
- **వృశ్చికం:** కాంట్రాక్టులు కొత్తవి వస్తాయి. చేస్తున్న వాటి పురోగతి బాగుంటుంది. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.
- **ధనుస్సు:** కళాసాహిత్య రంగాలలోని వారికి నూతన అవకాశాలు పేరు, ప్రఖ్యాతి కలుగుతాయి. వివాహ యత్నాలు.
- **మకరం :** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేస్తారు. ఇంటా బయట మీదే పై చేయిగా నిలుస్తుంది. వస్త్రలాభం.
- **కుంభం:** చెప్పుడు మాటలు విని మంచి స్నేహితులను దూరం చేసుకునే అవకాశం వుంది. జాగ్రత్త వహించండి.
- **మీనం:** అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి. అయితే మాట తీరు వలన నష్టపోయే అవకాశాలు ఉంటాయి.కొత్త మిత్రులు పరిచయమవుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వికసిత్ భారత్ సాధనే లక్ష్యం

>> డటం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజలచే ఎన్నికై, అత్యంత సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారని, ఇది సామాన్యమైన విజయం కాదని, ప్రజల అచంచల విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. అంతర్జాతీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా మోడీ గుర్తింపు పొందారని పేర్కొంటూ, మోడీ నేతృత్వంలోని గడిచిన 12 సంవత్సరాల కాలం దేశ ప్రగతిలో, సంస్కరణల పరంగా చారిత్రాత్మకమైనవని, 2047 నాటికి భారతదేశం ఖచ్చితంగా వికసిత భారత్‌గా మారి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.రాజకీయాల్లో నాయకుడికి లేదా పార్టీకి అతిపెద్ద పెట్టుబడి విశ్వసనీయత (క్రెడిబిలిటీ) అని, చెప్పేదానికి చేసేదానికి తేడా ఉన్నప్పుడు విశ్వసనీయత సంక్షోభం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఈ సంక్షోభం ఉండేదని, కానీ బిజెపి ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి అక్కడి ప్రజలు బుద్ధి చెప్పారని, అక్కడ బిజెపి స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విజయవంతమైందని గుర్తుచేశారు. ఒక నమ్మకమైన నాయకుడికి ఉండాల్సిన నాలుగు గుణాలు పారదర్శకత (ఇంటిగ్రిటీ), నిజాయితీ, పని చేసే సామర్థ్యం, ఇచ్చిన హామీలను ఫలితాలుగా మార్చే నైపుణ్యం ప్రధాని మోదీలో సంపూర్ణంగా ఉన్నాయని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రక్షణ బడ్జెట్‌ను రూ. 2.5 లక్షల కోట్ల నుండి దాదాపు రూ. 8 లక్షల కోట్లకు పెంచామని, రక్షణ రంగానికి కేటాయించే ప్రతి పైసా అత్యంత పారదర్శకంగా, దేశ భద్రత కోసమే ఖర్చువుతోందని రక్షణ మంత్రిగా హామీ ఇచ్చారు. బిజెపి వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరం భవిష్యత్తు కోసం ఆలోచిస్తుందన్నారు. తాము ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నామని పేర్కొంటూ, అయోధ్య గడ్డపైనే భవ్య రామమందిరాన్ని నిర్మిస్తామని చెప్పి చేసి చూపించామన్నారు. దేశంలోకి వచ్చే అక్రమ చొరబాటుదారులను సరిహద్దుల వెలుపలికి పంపుతామని చెప్పామని, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, పశ్చిమ బెంగాల్‌లో కూడా చొరబాటుదారులను బయటకు పంపే పని వేగవంతమైందని తెలిపారు. కొత్త పార్లమెంట్ భవనంలో చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక బిల్లును తీసుకువచ్చామని, మహిళలకు పూర్తి భాగస్వామ్యం, హక్కులు దక్కే వరకు తాము విశ్రమించబోమని, ఇది మోడీ ప్రభుత్వ గ్యారెంటీ అని స్పష్టం చేశారు. దేశంలో సమయం, వృథా ఖర్చులను తగ్గించడానికి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలన్నదే (వన్ నేషన్ వన్ ఎలక్షన్) మా ఆలోచన అని, అందరినీ విశ్వాసంలోకి తీసుకుని ఈ పనిని ఖచ్చితంగా చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గతంలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని చూసినా, అవతలి పక్షం విననప్పుడు బలం ఉపయోగించి సంస్థానాలను విలీనం చేసిన సర్దార్ పటేల్ విధానాన్నే తమ ప్రభుత్వం అనుసరిస్తోందని, మనపై దాడి చేసే వారికి వారి భాషలోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా బుద్ధి చెప్పామని, అలాగే ఆపరేషన్ సింధూర్ ద్వారా శత్రువులకు గట్టి సందేశం ఇచ్చామని పేర్కొంటూ, మానవత్వానికి శత్రువులైన వారికి సింధు నది నీటిని ఇచ్చే ప్రసక్తే లేదని, పాకిస్తాన్ వైఖరి మారనంత వరకు కఠినంగానే ఉంటామని స్పష్టం చేశారు ప్రధాని మోడీ పనితీరును, దేశంపట్ల ఆయనకున్న ప్రేమను వివరిస్తూ, 2022లో మోడీ మాతృమూర్తి స్వర్గస్తులైనప్పుడు, ఆ రోజున కూడా ఆయన తనతల్లి అంత్యక్రియలు ముగించుకున్న వెంటనే దేశసేవలో నిమగ్నమయ్యారని గుర్తుచేశారు. మన భద్రతా దళాలతో, సామాన్య ప్రజలతో రక్తపాతాన్ని సృష్టించిన నక్సలిజాన్ని భారతదేశ గడ్డపై నుండి దాదాపు తుడిచిపెట్టేశామని రక్షణ మంత్రి సగర్వంగా ప్రకటించారు.



# ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి

**కాన్పూర్, జూన్ 12:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. సంఘటన వివరాల ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న స్వర్ణ శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌పై గురువారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. రైలు కదులుతుండగా జరిగిన ఈ దాడిలో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఒక కిటికీ అద్దం దెబ్బతింది. ఇదే కోచ్‌లో మోహన్‌భగవత్ ప్రయాణిస్తున్నారని, అయితే కిటికీకి వేరేవైపు ఆయన కూర్చోవడంతో ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, స్థానిక పోలీసులు విచారణ ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ముగ్గురు వ్యక్తులు రాళ్లు రువ్వినట్టు గుర్తించారు. వీరిలో ఇద్దరిని అరెస్టు చేశారు. రైలుపై దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందా, రైల్వే ట్రాక్ సమీపంలో దుండగులు చేసిన పనా అనే దానిపై భద్రతా సంస్థలు ఆరా తీస్తున్నాయి.

# యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో ప్రైవేట్లు

## ఎస్టిమేషన్ కాంట్రాక్టు విలువ రూ. 250 కోట్లు

## స్టేజ్-1, 2 యూనిట్లలో పలు పనులకు జెన్కో టెండర్లు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** విద్యుత్తు సమస్యతో సతమతమవుతున్న తెలంగాణను మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటైన యాదాద్రి పవర్‌ప్లాంట్ (వైటీపీఎస్)ను ప్రైవేట్‌పరం చేసేందుకు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్కో) మొగ్గుచూపింది. కొన్ని యూనిట్లను ప్రైవేట్‌పరం చేసే యోచనలో వివిధ విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్లాంట్‌లోని స్టేజ్1, స్టేజ్2 యూనిట్లకు చెందిన కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్ల ఆపరేషన్, మెయింటెనెన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులకు 3 సంవత్సరాలకు గాను టీజీ జెన్కో తాజాగా టెండర్లను పిలిచింది. ఎస్టిమేషన్ కాంట్రాక్టు విలువ రూ.250 కోట్లుగా పేర్కొన్నది. టెండర్లు వేసేందుకు ఈ నెల 12 నుంచి 29 వరకు గడువు ఇచ్చింది. ఇక ఈ పవర్ ప్లాంట్‌లోని నాలుగు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనప్పటికీ అందుకు అవసరమయ్యే ఉద్యోగులను ఇప్పటి వరకూ నియమించనే లేదు. 2020లో పాల్వంచ నుంచి 400 మంది, రామగుండం నుంచి 70 మందిని ఇక్కడ పనిచేసేందుకు బదిలీపై రప్పించారు. వీరితోపాటు స్థానికులైన 445 మందిని ఉద్యోగాల్లోకి తీసుకొన్నారు. అయితే వీరికి అదనంగా మరో 800 మంది ఉద్యోగుల అవసరం ఉన్నది. ఉద్యోగుల కొరత కారణంగా యాష్, కోల్ ప్లాంట్లను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు జెన్‌కో టెండర్లు పిలిచింది.

కాగా యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని వివిధ విభాగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు టెండర్లు పిలవడంతో స్థానికులు ప్లాంట్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. యాష్, కోల్ ప్లాంట్లతో మొదలై చివరకు మొత్తం ప్లాంట్‌నే ప్రైవేట్‌పరం చేసే కుట్ర జరుగుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. అలాగే యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించొద్దని డిమాండ్ చేస్తూ పాల్వంచ కేటీపీఎస్‌లో ఇంజినీరింగ్ సంఘాల ఆధ్వర్యంలో 5, 6, 7 దశల కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు నిరసన తెలిపారు. తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో యాదాద్రి ప్లాంట్‌లో మూడేండ్లపాటు కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడానికి టెండర్లు ఆహ్వానించడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే టెండర్ల నోటిఫికేషన్లను రద్దు చేయాలని, లేదంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# మేటి షూటర్ జస్పాల్‌రాణా ఆకస్మిక మృతి

**న్యూఢిల్లీ, జూన్ 12:** భారత దిగ్గజ షూటర్ జస్పాల్ రాణా (49) ఆకస్మికంగా కన్నుమూసారు. ఆసియా క్రీడల్లో ఆయన గతంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. భారతీయ పిస్తోల్ షూటర్లకు కోచ్‌గా కొనసాగుతున్న జస్పాల్ రాణా అనూహ్య రీతిలో తుదిశ్వాస విడిచారు. గురువారం రాత్రి ఆయన ప్రాణాలు విడిచినట్లు సమీప మిత్రులు, బంధువులు తెలిపారు. జర్మనీలోని మునిచ్ ఇటీవల జరిగిన షూటింగ్ ఈవెంట్‌కు జస్పాల్ రాణా హాజరయ్యారు. అయితే అక్కడ ఆయన అస్వస్థతకు గురయ్యాడు. ఆ ఈవెంట్‌లో భారత షూటర్లు రాణించారు. రెండు గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. జర్మనీ నుంచి వస్తున్న సమయంలో జస్పాల్ రాణా విమానంలోనే తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. అయితే ఢిల్లీలో దిగగానే ఆయన్ను నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆయనకు స్టెంట్ వేశారు. కానీ షూటర్ రాణా ఆ చికిత్స నుంచి కోలుకోలేకపోయారు. జస్పాల్ రాణా మృతి భారత షూటర్లకు తీవ్ర నిరాశను మిగిల్చింది. మేటి షూటర్‌గా రాణించడంతో పాటు ఉత్తమ కోచ్‌గా ఆయన అనేక ఆటగాళ్లకు మెంటర్‌గా చేశారు. స్పాల్ రాణా తన కెరీర్‌లో అత్యుత్తమ షూటర్‌గా నిలిచారు. ఆసియా క్రీడల్లో ఆయన గోల్డ్ మెడల్ సాధించారు. ఎన్నో అంతర్జాతీయ టోర్నీల్లోనూ సక్సెస్ అయ్యారు. ఆ తర్వాత కోచ్‌గా కూడా యువతను ఎంతో ప్రోత్సహించారు. 2012లో ఆయన జాతీయ జూనియర్ పిస్తోల్ జట్టుకు కోచ్‌గా నియమితుడయ్యారు. భారత మేటి షూటర్లు అయిన సౌరభ్ చౌదరీ, అనిశ్ భన్వాలా, చింకి యాదవ్‌లకు ఆయనే శిక్షణ ఇచ్చారు. మేటి షూటర్ మనూ భాకర్‌ను కూడా ఆయనే తీర్చిదిద్దారు. ఇక 2025 ఫిబ్రవరిలో ఎన్ఆర్ఏఐ రాణాను హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా నియమించింది. 25 మీటర్ల పిస్తోల్ ఈవెంట్‌కు స్పెషలిస్టు కోచ్‌గా చేశారు. ప్రపంచ స్థాయి ఉత్తమ షూటర్లను తీర్చిదిద్దే క్రమంలో ఆయన ప్రాణాలను అర్పించారు. 2020లో షూటర్ జస్పాల్‌రాణాకు ద్రోణాచార్య అవార్డును ఇచ్చి ప్రభుత్వం సత్కరించింది.



### జస్పాల్ రాణా మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 12:** భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతమైన షూటర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో జస్పాల్ రాణా సాధించిన విశిష్ట విజయాలు, అలాగే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం దేశానికి ఎనలేని గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిస్టల్ విభాగంలో భారత అత్యున్నత ప్రతిభ కనబరిచిన కోచ్‌గా ఆయన యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో, దేశ షూటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. జస్పాల్ రాణా మరణంతో భారతదేశం ఒక గొప్ప క్రీడాకారుడిని మాత్రమే కాకుండా, తన ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాసేవతో తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే ఓ మార్గదర్శకుడిని కోల్పోయింది అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ విషాద సమయంలో జస్పాల్ రాణా కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిష్యులు, క్రీడా రంగానికి చెందిన వారందరికీ ముఖ్యమంత్రి తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఇద్దరు చిన్నారులు సహా నిజాంసాగర్‌లో దూకి తండ్రి ఆత్మహత్య

**నిజాంపేట, జూన్ 12, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ వద్ద హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కుటుంబకలహాలు, వ్యక్తిగత సమస్యలతో మనస్తాపా నికి గురైన ఓ వ్యక్తి ఇద్దరు చిన్నారులతో కలిసి నిజాం సాగర్ బ్యాక్ వాటర్‌లో దూకి ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజాంపేట మండలంలో తీవ్ర విషా దాన్ని నింపింది. గ్రామ స్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన గుల కృష్ణ (34) భార్య సవిత (32), కుమారుడు రక్షిత్(9), కూతురు అనన్య (5)తో కలిసి హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో నివాసం ఉంటున్నాడు. గురువారం ఇద్దరు పిల్లలను తీసుకుని బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పి స్వగ్రామమైన నిజాంపేటకు వచ్చాడు. నిజాంపేటలో కొంతసేపు గడిపిన అనంతరం పిల్లలకు ఇష్టమైన ఆహారం కొనుగోలు చేసి నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ పిల్లలతో కలిసి భోజనంచేసి, కొంతసేపు చెరువు ఒడ్డున సరదాగా గడిపాడు. పిల్లలతో కలిసి సెల్ఫీలు కూడా దిగినట్లు తెలిసింది. అనంతరం నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ నీటిపై తిరిగే తెప్పను తీసుకుని ఇద్దరు చిన్నారులను ఎక్కించుకుని చెరువు మధ్యలోకి వెళ్లాడు. అక్కడి నుంచి తన బావమరిదికి పిల్లలతో దిగిన సెల్ఫీ ఫొటోలను పంపిస్తూ, 'మిమ్మల్ని విడిచి వెళ్లిపోతు న్నాను' అనే సందేశాన్ని పంపినట్లు సమాచారం. ఈ సందేశం చూసి అనుమానం వచ్చిన బావమరిది వెంటనే నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ వద్దకు చేరుకున్నాడు. అయితే అక్కడ కృష్ణ బైకు, చిన్నారుల దుస్తులు మాత్రమే కనిపించడంతో వెంటనే పోలీసులకు సమా చారం అందించాడు. పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా, నిజాం సాగర్ బ్యాక్‌వాటర్‌లో కృష్ణతోపాటు రక్షిత్, అనన్య మృతదేహాలను వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.



# ఉత్తమ వైద్యం అందిస్తాం

## చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 12:** స్పైనల్ మస్కులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ) టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన యేడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జూలై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధు లపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థి స్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

# గంజాయి కూపంలో అందాల మోడల్!

## బ్యాంకాక్ నుంచి తరలిస్తూ ముంబయిలో పట్టుబడిన వైనం

## గంజాయి విలువ రూ. 11 కోట్లపైనే



ముంబయిలో ఒజి గంజాయితో కస్టమ్స్ అధికారులకు పట్టుబడిన కేరళ మోడల్ హర్షసన్నీ.

**హైదరాబాద్ జూన్ 12, ప్రభాతవార్త:** మోడలింగ్‌లో రాణిస్తూ, కేరళ అందాల పోటీల్లో కిరీటం అందుకున్న ఓ యువతి గంజాయి స్మగ్లింగ్ బ్యాచ్ తో చేతులు కలిపి బ్యాంకాక్ నుంచి 11.82 కోట్ల విలువ చేసే నాణ్యమైన ఓజి గంజాయి తరలిస్తూ ముంబయి విమానాశ్ర యంలో కస్టమ్స్ అధి కారులకు దొరికిపోయింది. ఈ ఘటన కేరళలో సంచలనం రేపింది. వివరాలు ఇలావున్నాయి. బ్యాంకాక్‌లో భారత్‌కు చెందిన కొందరు బడా స్మ గ్లరు ఏకంగా ఓజిను సాగుచేస్తున్న విషయాన్ని ఈగల్ పోలీసులు రట్టు చేసి దీనిపై ఎన్‌సిఆర్‌బికి సమాచారం ఇచ్చారు. ఈ స్మగ్లర్ల ముఠాలో కే రళకు చెందిన ఓ స్మగ్లర్ హైద రాబాద్‌కు చెందిన మహిళా జూనియర్ ఆర్టి స్టు సూరికళతో ఓజిని తరలించగా శంషాబాద్ విమానాశ్రయంలో దొ రికిపోవడం తెలిసిందే. ఈ ముఠాలో మరి కొందరు వున్నట్లు అందిన సమాచారంపై విమానాశ్రయాల్లో కస్టమ్స్ అధికారులు నిఘా వుంచారు. ఈ క్రమంలో కేరళకు చెందిన హర్ష సన్నీ (28) శుక్రవారం ఉదయం ముంబాయి విమా నాశ్రయంలో ఓజి తరలిస్తూ పట్టుబడింది. కేరళలో జరిగిన అనేక అందాల పోటీల్లో పాల్గొని బహుమతులు కూడా అందుకుని. మిసెస్ కేరళ పోటీలో కూడా సన్నీ పాల్గొంది. కాగా ఇటీవల బ్యాంకాక్ వెళ్లిన సన్నీ అక్కడ గంజాయి బ్యాచ్‌తో చేతులు కలిపిందని సమాచారం రాగా ఆమెపై నిఘా వుంచారు. శుక్రవారం ఉదయం ముంబ యిలోని ఛత్రపతి శివాజి మహారాజ్ అంత ర్జాతీయ విమానాశ్రయంలో సన్నీ దిగింది. అయితే లగేజి క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తనపై కస్టమ్స్ అ ధికారులకు అనుమానం వచ్చింది. దీంతో కస్టమ్స్ అధికారులు ఆమెను పక్కకు పిలిచి ఆమె వద్ద వున్న ట్రావెల్ బ్యాగ్‌తో పాటు ఇతర లగేజిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఒక బ్యాగులో చిన్నపాటి 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి. వాటిలో పచ్చటి పదార్థం వుంది. దీంతో కస్టమ్స్ అధి కారులకు అనుమానం వచ్చి ఎన్‌డిపిఎస్ కిట్‌తో వాటిని పరీక్షించగా అత్యంత ఖరీదైన నాణ్యమైన హైడ్రోపోనిక్ మారిజువానా (ఓజి)గా తేలింది. ఈ ఓజి గంజాయి 11 కిలోలు బరువు వుంది. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్లో 11.82 కోట్ల రూపాయలుగా తేలింది. దీంతో కస్టమ్స్ అధి కారులు సన్నీని అరెస్టు చేసి ఆమెపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలిం చారు. సన్నీ అరెస్టు విషయాన్ని కస్టమ్స్ అధికా రులు తెలంగాణ ఈగల్ పోలీసులతోపాటు కేంద్ర ఎన్‌డిపిఎస్‌కు సమాచారం అందించారు. కాగా సన్నీని మరింతగా విచారించేందుకు కస్టమ్స్ అధికారులు కస్టడీలోకి తీసుకునే వీలుంది.

# బాలిక ఆత్మహత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**హైదరాబాద్ (సైదాబాద్), జూన్ 12, ప్రభాతవార్త:** సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 28వ తేదీ చోటు చేసుకున్న మైనర్ బాలిక ఆత్మహత్య కేసులో ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితురాలు పరారీలో ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. సింగరేణి కాలనీలో నివాసం ఉండే మైనర్ బాలిక (17) గత నెల 28వ తేదీన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మైనర్ బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మైనర్ బాలికను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు ప్రధాన నిందితులు నారాయణ, వాల్ సింగ్‌లను గత నెల 30వ తేదీనే అరెస్టు చేసినట్లు పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా సంఘటనా స్థలంలో బాలిక రాసిన ఆత్మహత్య లేఖ, ఇతర రాత ప్రతులను స్వాధీనం చేసుకుని పరిశీలన కోసం సిఎఫ్ఎస్ఎల్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి ఫోన్‌తో పాటు నిందితుల సెల్‌ఫోన్లను కూడా పోలీసులు సిఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. పరారీలో ఉన్న మరో నిందితురాలు సుజాత కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

## 31,542 మంది దరఖాస్తు.. 17,768 మంది హాజరు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 5 నుంచి ప్రారంభమైన 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కె లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 31,542 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోగా వారిలో 17,768 మంది పరీక్షలకు హాజరయ్యారు. 13,774 మంది పరీక్షలకు హాజరు కాలేదని ప్రకటనలో తెలిపారు. 5న ప్రారంభమైన పరీక్షలు ఈ 12 వరకు కొనసాగాయి. అడ్వాన్స్‌డ్ సప్లిమెం టరీ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 93 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి నట్టు తెలిపారు. పరీక్షలను ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వ హించారు. శనివారం నుంచి మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభం కానుంది.

# డీజిల్ పొదుపుపై ఉద్యోగుల్లో సామాజిక బాధ్యత పెరగాలి


## ఆదా కోసం సాంకేతిక పద్ధతులతో మైలేజీ పెంపు

## ఆర్టీసీ ఎండి వై.నాగిరెడ్డి

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం, నిరంతరం పెరుగుతున్న డీజిల్ ధరల నేపథ్యంలో సంస్థపై పడుతున్న భారీ నిర్వహణ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీజీఎస్ ఆర్టీసీ వీసీ,ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీజిల్ నిర్వహణ - అవగాహన సదస్సులో ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇది రవాణా రంగంపై, ప్రధానంగా ఆర్టీసీపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఈ ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా అధిగమించాలంటే డీజిల్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, ప్రతి లీటరు ఇంధనాన్ని పొదుపుగా వాడుతూ వృథాను అరికట్టడం ఒక్కటే సరైన మార్గమని స్పష్టం చేశారు. ఇందుకోసం డిపోల స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా ఉపయోగించుకోవాలని, వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఉత్తమ నిర్వహణ పద్ధతులను నిరంతరం అలవర్చుకోవాలని అధికారులకు, సాంకేతిక సిబ్బందికి నాగిరెడ్డి సూచించారు. ప్రతి ఉద్యోగికి ఇంధన పొదుపుపై ఒక సామాజిక బాధ్యత ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డీజిల్‌ను ఆదా చేయడం ద్వారా సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా మన వంతు సహకారం అందించిన వారమవుతామని అన్నారు. సదస్సులో ఈడీ సిహెచ్.వెంకన్న, ఫైనాన్సి యల్ అడ్వైజర్ విజయపుష్ప, బీపీసీఎల్ తెలంగాణ హెడ్ లక్ష్మీ ్మ లాల్ చౌహన్ , మార్కెటింగ్ మేనేజర్ రఘునాథరావ్, ఆర్టీసీ సీసీఎస్ ప్రభులత పాల్గొన్నారు.

# ఈగల్ పోలీసులకు పట్టుబడిన అంతర్జాతీయ సింథటిక్ డ్రగ్స్ స్మగ్లర్లు

## రూ.50 లక్షల మెపెడ్రోన్ పట్టివేత



నిందితుల వద్ద పట్టుబడిన మెపెడ్రోన్. ఈగల్ పోలీసులకు పట్టుబడిన అంతర్జాతీయ సింథటిక్ డ్రగ్స్ స్మగ్లర్లు.

**హైదరాబాద్ జూన్ 12, ప్రభాతవార్త:** ఈగల్ పోలీసులకు మరో ఇద్దరు అంతర్జాతీయ సింథటిక్ డ్రగ్ స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వీ రి వద్ద నుంచి 50 లక్షల రూపాయల ఖరీదు చేసే 750 గ్రాముల మెపెడ్రోన్ డ్రగ్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డై రక్టర్ సందీప్ శాండిల్యా శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సూర్యాపేట్ జిల్లాకు చెందిన మత్స్యగిరి కేసరి (38), భువనగిరి జిల్లా మోత్కూ రుకు చెందిన నిమ్మల నరేష్ (38)లు 2015 నుంచి సింథటిక్ డ్రగ్స్‌ను దేశ వ్యాప్తంగా అనేక నగరాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు. వీరి ముఠాలో గుజరాత్‌కు చెందిన సంతోష్ సింగ్, విజయ్, అశ్విని పాఠక్, ఫయాజ్ అనే స్మగ్లర్లు వున్నారు. తమ వ్యాపారం కోసం కేసరి 2015లో అబ్దుల్లా పూర్‌మెట్‌లోని బాచారంలో సాయి కెమికల్స్ అనే కంపెనీలో కెమిస్ట్‌గా చేరి ఏడాది పాటు పనిచేసి సింథటిక్ డ్రగ్స్ తయారీలో ప్రావిణ్యం సం పాదించాడు. ఈ సమయంలోనే గుజరాత్‌కు చెందిన సంతోష్ సింగ్, విజయ్, అశ్విని పాఠక్, ఫయాజ్‌లు కేసరితో చేతులు కలిపి మెపెడ్రోన్ డ్ర గ్ తయారు చేయడంపై పరిజ్ఞానం సంపా దించాడు. కాగా 2017లో విజయ్, సంతోష్‌లు మధ్యప్రదేశ్‌లో అరెస్టవగా బెయిలుపై వచ్చి మళ్లీ డ్రగ్స్ తయారు చేయసాగారు. దీని తరువాత పలు రాష్ట్రాల్లో ఈ ముఠా సభ్యులు పట్టుబడ్డారు.


తాజాగా కేసరి, నిమ్మల నరేష్‌లు అబ్దుల్లాపూర్ మెట్ వద్ద సొంతంగా ఒక కెమికల్ ఫ్యాక్టరీని స్థాపించి మెపెడ్రోన్‌ను తయారు చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులుశుక్రవారం ఉదయం దాడిచేశారు. ఈ సందర్భంగా కేసరి, నరేష్ పట్టుబడగా వారి వద్ద 750 గ్రాముల మెపెడ్రోన్‌తో వుండగా జప్తు చేశారు. అ నంతరం వీరు ఏర్పాటు చేసిన కెమికల్ ఫ్యాక్టరీని ధ్వంసం చేసి అందులోని వస్తువులను, ఒక కారును, మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. కా గా మాదకద్రవ్యాల విషయంలో సర్కారు కఠినంగా వుందని, స్మగ్లర్ల భరతం పడతామని ఆయన హెచ్చరించారు.

డ్రగ్స్ సంబంధించి ఎటువం టి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు సమాచారం అందించా లని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.

# న్యాయవాది ఖాజామొయిజుద్దీన్ హత్య కేసులో ఇద్దరు నిందితులకు కస్టడీ

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** నాంపల్లిలో హైకోర్టు న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్‌ను కారుతో ఢీకొట్టి హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్నారు. గత నెల 23వ తేదీన ఉదయం శాంతినగర్‌లో న్యాయవాది ఇంటి వద్ద జరిగిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపగా, ఈ కేసులో నిందితులందరిని పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. ఈ కేసులో కీలకంగా వున్న ఆలం ఖాన్, ముజహీద్‌ను మరింత విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి పోలీసులు కోర్టును కోరగా రెండు రోజుల కస్ట డీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు నిందితులను నాంపల్లి పోలీసులు ఉదయం పది గంటల సమయంలో చంచల్‌గూడ జైలు నుంచి తమ కస్టడీలోకి తీసుకు న్నారు. వీరిని శనివారం సాయంత్రం తిరిగి జైలుకు తరలించనున్నారు.

# శ్రీవారి సేవలో ముఖేశ్ అంబానీ



**తిరుమల, జూన్ 12 ప్రభాత వార్త ప్రతినిధి:** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ కుటుంబంతో కలసి శుక్రవారం వేకువ జామున తిరుమల శ్రీవారిని దర్శించు కున్నారు. అంబానీ కుటుంబం తిరుమలేశునికి అత్యంత భక్తివిశ్వాసం కలిగి ఉన్నారు. శుక్రవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో ముఖేష్ అంబానీ, కుమారుడు అనంత్ అంబానీ, కోడలు రాధికతో కలిసి ఆయన శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబానీ కుటుంబం తిరుమల ఆలయం వద్దకు చేరుకోగానే టిటిడి అధికారులు స్వాగతం పలికారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్వయంగా ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం చెప్పి, శ్రీవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంబానీ కుటుంబం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ మార్గం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదిస్తూ వేద మంత్రో చ్చారణల మధ్య అంబానీ కుటుంబానికి ప్రత్యేక ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

# బిసిలో 51 కులాలను డిఎన్‌టిలుగా గుర్తింపు

## డీనోటిఫైడ్, సంచార, అర్థసంచార జాతులుగా ప్రకటన

## బిసి-ఎలో 49, బిసి-ఇలో రెండు కులాలకు చోటు

## ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 51 బిసి కులాలను డిఎన్‌టిలుగా గుర్తిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 51 కులాలను గుర్తించి వాటిని డిఎన్‌టిలుగా నిర్ధారిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిఒఎంఎస్ నంబర్ 10ని బిసి సంక్షేమ శాఖ శుక్రవారం జారీ చేసింది. రాష్ట్రంలో 51 కులాలను డీనో టిఫైడ్, సంచార, అర్ధసంచార జాతులుగా నోటిఫై చేస్తూ ఆమోదించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల (ఎస్ఈబీసీ) జాబితాను మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం రూపొందించి, వాటిని ఏ, బీ, సీ, డీ, ఈ అనే 5 గ్రూపులుగా వర్గీకరించారు. తెలంగాణ ఏర్పడిన తరువాత అదే ఎస్ఈబీసీ జాబితాను తెలంగాణ రాష్ట్రా నికి కూడా వర్తింపజేశారు. తరువాత కాలంలో ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమి షన్, వ్యక్తుల నుండి తపాలా ద్వారా వ్యక్తుల నుండి, కుల సంస్థల నుండి అందిన అనేక వినతిపత్రాలను వివ రంగా పరిశీలించిన తెలంగాణ బీసీ కమిషన్, రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల (ఎస్ఈబీసీ)లోని 51 వర్గాలను డినోటిఫైడ్, సంచార, అర్ధసంచార వర్గాలుగా (డిఎన్‌టిలు) గుర్తించింది. ఈ 51 కులాలను రాష్ట్రానికి డినోటిఫైడ్, సంచార, అర్ధసంచార వర్గాలుగా నోటిఫై చేయాలని ప్రభు త్వానికి సూచిం చింది. క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం, తెలంగాణ వెనుకబడిన తరగ తుల కమిషన్ సిఫార్సులను ఆమోదిస్తూ, డినోటిఫైడ్, సంచార, అర్ధసంచార వర్గాల జాబితాలోని 51 వర్గా లను తెలంగాణ రాష్ట్రానికి గుర్తిస్తున్నట్టు ప్రకటించింది. తదనుగుణంగా నోటిఫికేషన్‌ను తెలంగాణ గెజిట్‌లో ప్రచురించబడుతుందని ప్రకటించింది. 51 కులాల్లో బీసీ-ఏలో 49 కులాలు ఉండగా. బీసీ-ఈలో రెండు కులాలు ఉన్నాయి.

బాలసంతు, బహురూపి, బుడబుక్కల, శివక్షత్రియ, దాసరి, గడ వంశీయ, గంగిరెడ్లవారు, జంగం, జోగి, కాటిపాపల, మేదరి, మొండివారు, మొండిబండ, బండ, వంశరాజ్, పాముల, పార్థీ, పంబల, పెద్దమ్మవాడ్లు, దేవరవాడ్లు, ఎల్లమ్మ వాండ్లు, ముత్యాలమ్మవాండ్లు, దమ్మలి, దమ్మల, దమ్ముల, దామల, వీరభద్రీయ, వాల్మీకి బోయ, కంజర-బట్ట, రెడ్డిక, మొండిపట్ట, నోక్కర్, పరికి మొగ్గుల, యాత, చోపిమరి, కైకడీ, జోషినందివాల్స్, ఒడ్డి, ఒడ్డిలు, వడ్డేలు, వడ్డేర, వడ్డబోవి, వడియరాజ్, మందుల, కునపులి, పాల-ఎకారీ, ఎకిల, వ్యాకుల, ఎకిరి, నాయని వారు, పాలేగారు, తొలగరి, కావలి, రాజన్నల, రాజన్నలు, బుక్క అయ్యావార్స్, గోత్రాల, కాసికాపాడి, సిద్దుల, పూసల, అద్దపువారు, బాగోతుల, భాగవతుల, బైల్ కమ్మర, ఘిసాడి, గడియలోహార్, ఈనూతీ, ఏనేటివాళ్లు, గంజికూటి, గంజికూటీవీరు, గౌడజెట్టి, కాకిపడగల, పటంవారు, ఓడ్, ఒయడ్, శ్రీక్షత్రియ రామజోగి, రామజోగి, రామజోగుల, తీరచీరాల, తెల్ సోరి, బైకానీ, తోలుబొమ్మలాటవారు, బొప్పల, బీసీ-ఈ లోని ఫకీర్, ఫకీర్‌బుడ్‌బుడ్కి, ఘంటిఫకీర్, ఘంట ఫకీర్లు, తురక బుడబుడ్కి, దర్వేష్, ఫాకీర్, గుడ్డిఎలుగువాల్లు, ఎలుగు బంటువాల్లు, ముస్లమాన్ కీలు, గుర్రాల వాల్లు మొత్తం 51 కులాలను డీఎన్‌టీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No.02/2026-27/CE(GVMC)/SE-GWK/E.E-GWK, Dt:11-06-2026
No. of Works : 1 Nos
Value of Works : Rs.854.62 Lakhs
Down Load Starting Date : 12.06.2026 @ 02.00 P.M.,
Down Load Ending Date : 26.06.2026 @ 03.00 P.M.,
Note: Further details @ www.ape.procurement.gov.in
O/o CE (GVMC) or EE-Gwk (Contact No.98489 33235)
For Commissioner, (GVMC)

వార్త

శత్రువుని జయించినవాడు విజేత కాదు, శత్రుత్వాన్ని జయించినవాడే నిజమైన విజేత.

న- స్వామి వివేకానంద

# విస్తరిస్తున్న విద్యావ్యాపారం


ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి, పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. ప్రస్తుతం విద్య ఒక వ్యాపార రూపం దాల్చింది. విద్యనే కాదు విద్యార్థులతోసహా ఏకంగా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యావ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా రోజురోజుకు విస్తరించిపోతున్నది. ప్రైవేట్ రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈ వ్యాపారంలో గతంలో కాంట్రాక్టర్లు, వ్యాపారాలు చేసేవారితోపాటు అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ నాయకులు భాగస్వాములు అవుతున్నారు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా అమలు చేయగలిగిన సామర్థ్యం గల అధికారులున్నా రానురాను ప్రభుత్వ విద్య పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో నడిచేవి. వాటిలో వ్యాపార ధోరణులు కన్పించేవి కావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవాదృక్పథంతో అవి సేవలు అందించేవి. నిర్వాహకులుసామాజిక బాధ్యతగా భావించి ఆ బడులు నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రైవేట్ పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండా పోయింది.అందుకే చట్టాల అవసరం తలెత్తలేదు.ప్రభుత్వ రంగంలోని పాఠశాలల్లో కూడా విద్యాబోధన అంతో ఇంతో పటిష్టంగా నడిచేది. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదా, బిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆ వైపే మొగ్గుచూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతిలేని వారు మరో దారి లేనివారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారు. ప్రైవేట్ విద్యావ్యాపారం గ్రామాలకు విస్తరించింది. ఇక రానురాను ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. ఇటీవలకాలంలో యేడాదియేడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగంలో పెరిగిపోతున్నారు. ఈ యేడాది కూడా రాబోయేవిద్యాసంవత్సరంలో దాదాపు లక్షమందికి పైగా విద్యార్థులు తగ్గిపోయే ప్రమాదం ఉందని సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ తగ్గడం ఇప్పటికిప్పుడు మొదలు కాలేదు. గత ఐదారేళ్లగా పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. 2021-22 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ముప్పైలక్షల డెబ్బైఎనిమిది వేల మందికిపైగా ఉంటే ప్రైవేట్ బడుల్లో ఇరవైఎనిమిది లక్షల అరవైఏడువేల మంది వరకు ఉన్నారు. అయితే 2022-23 విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్లో విద్యార్థుల సంఖ్య తగ్గి, ప్రైవేట్ స్కూళ్లల్లో పెరిగిపోయింది. సర్కారు బడుల కంటే ప్రైవేట్ స్కూళ్లల్లో దాదాపు రెండు లక్షల మందికిపైగా అదనంగా అడ్మిషన్ తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ స్కూల్‌లో చేరేవారి సంఖ్య మరింతగా పడిపోయింది. సర్కారు బడుల్లో ఇరవైఆరు లక్షల ముప్పైఆరువేల ఆరువందల ముప్పైకి పరిమితం కాగా,ప్రైవేట్‌బడుల్లో ముప్పైనాలుగు లక్షలకుపైగా పెరిగిపోయింది. దాదాపు ప్రభుత్వ స్కూళ్ల కంటే ప్రైవేట్ స్కూళ్లల్లో ఏడు లక్షలకుపైగా ఎక్కువ ప్రవేశాలు లభించాయి. ఈ యేడాది పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. దాదాపు సర్కారు స్కూళ్లలో లక్షా ఇరవై వేల మంది తగ్గిపోతున్నట్లు చెప్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఈ పరిస్థితికి కారకులెవరు? కారణాలు ఏమిటి అనేది అటు అధికార వర్గాలకు కానీ, ఇటు పాలకులకు కానీ తెలియంది కాదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు,ప్రోత్సాహకాలు కాగితాల వరకు బాగానే ఉంటున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. బడి బాట, మధ్యాహ్నభోజన పథకం, ఉచిత పుస్తకాలు లాంటిఎన్నో ప్రోత్సాహకాలు ప్రకటించి ప్రయత్నాలు చేస్తున్నాఆశించిన మేరకు ఫలితాలు కన్పించడం లేదు. అన్నిటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. వీటన్నిటి మించి వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడంతో ప్రధానంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. స్వాతంత్య్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావొస్తున్నా అందరికీ విద్య అందించాలన్న లక్ష్యం కనుచూపుమేరలో కన్పించడం లేదు. ఆరేళ్ల నుంచి పద్నాలుగేళ్ల బాలబాలికలందరికీ ఉచిత విద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్య్రం రాగానే పెద్దలు నిర్ణయించారు. ఆ సంకల్పం కాగితాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు. కానీ లక్ష్యానికి చేరుకోలేకపోతున్నారు. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ రంగంలోని విద్యావ్యవస్థను ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం సమంజసంకాదు. ఇప్పటికైనా విద్యావ్యాపారాన్ని ఆపకపోతే భవిష్యత్తులో ఎలాంటి విపరీత ధోరణులు చోటు చేసుకుంటాయో ఊహిస్తేనే భయాందోళనలు కలుగుతున్నాయి. ప్రభుత్వ రంగంలో విద్యాప్రమాణాలు పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి.

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.



అరిస్టాటిల్

విగ్రహాన్ని దేవునిగా తలచి పూజించడం శ్రేష్ఠం. దేవుణ్ణి విగ్రహంగా భావించడం దోషం.



డబ్ల్యు. ఎమర్సన్

# ప్రజావాక్కు

### గ్రామీణంలో సాంకేతికత

ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు అత్యంత వేగంగా విస్తరిస్తూ, భవిష్యత్తు ఉపాధిప్రపంచంపై పెను ప్రభావం చూపుతోంది. విద్య, వైద్యం, బ్యాంకింగ్ వంటి రంగాల్లో డేటావిశ్లేషణ,పత్రాల నిర్వహణవంటి పనులను యంత్రాలు వేగంగా చేస్తున్నాయి. దీనివల్ల పునరావృత స్వభావం కలిగిన డేటాఎంట్రీ, కాల్‌సెంటర్ వంటి విభాగాల్లో ఉద్యోగ భద్రతపై ఆందోళనలువ్యక్తమవుతున్నాయి. యంత్రాలు మానవ శ్రమను భర్తీ చేస్తాయనే భయం ఉన్నప్పటికీ, ప్రతి సాంకేతిక విప్లవం లాగే ఇది కూడా కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తోంది.డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ భద్రత వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన వారికి డిమాండ్ పెరుగుతోంది. యంత్రాలు తర్కాన్ని అనుసరించగలవు కానీ, మానవీయ కోణం, సృజనాత్మకత నాయకత్వ లక్షణాలు అవసరమైన పనుల్లో మానవుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు.

- సి. రిత్విక్, నల్గొండజిల్లా

### అతివేగం అనర్థదాయకం

నేడు రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పెరుగుతున్న వాహనాలసంఖ్య, మితిమీరిన వేగం కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయం లోనిర్లక్ష్యం వహించడంవల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. గుంతలమయమైనరోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చు.

- పి. రామకృష్ణ, హైదరాబాద్

### చిరు వ్యాపారులను ఆదుకోవాలి

బ్రతుకుబండి పేరుతో జీవనం సాగించే చిరు వ్యాపారులు ఎందరో ఉన్నారు. కొందరు అధికారులు ఇలాంటి వ్యాపారులను లక్ష్యం చేసుకుని నాణ్యత పేరుతో, ధరల పేరుతోవ్యాపారం సజావుగాసాగకుండా తరచూ ఇబ్బంది పెడుతూబ్రతుకుబండిని సాగనియ్యకుండా చేస్తున్న ఘటన లెన్నో. స్వేచ్ఛగా బ్రతుకుతున్నా వాళ్లను బ్రతకనిద్దాం.

-ఎం.నాగరాజు, రంగారెడ్డిజిల్లా

### ఐరిష్ హాజరు విధానాన్ని రద్దు చేయాలి

ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు అమలు చేస్తున్న ఐరిష్ హాజరు విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరణ చేయాలని,విబి జి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, శ్రామికులు కోరుతున్నారు. ఉపాధి శ్రామికులలో ఆర్థిక వెనుకబాటు తనం, సామాజికంగా పనులు లేని కూలీలను గుర్తించి ఆ గ్రూపులకు పనులను కేటాయించాలన్నారు. అలాగే పనులలో వివక్షత చూపకుండా అన్ని వర్గాలకు ఒకే పనిని చూపాలి. రాజకీయ మద్దతు ఉన్న గ్రూపులకుఎక్కువ పనిదినాలు కేటాయించకుండా సామాజిక న్యాయం పాటించాలని వారు కోరుతున్నారు. అలాగే ఒక పూట పని విధానం అమలు చేయాలని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్, మంచినీరు సరఫరా చేయాలని, సమ్మర్ అలవెన్సులు పునరుద్ధరణ చేయాలని, పలుగు, పార పనిముట్లు ఇవ్వాలి.

- జి.సూర్యనారాయణ, భూపాలపల్లి జిల్లా

### మానవాళికి పెనుముప్పు మారిన ప్లాస్టిక్

ఆధునిక ప్రపంచంలో ప్లాస్టిక్ వినియోగం అనివార్యమైనప్పటికీ, అది 'సూక్ష్మ ప్లాస్టిక్'రూపంలో మానవాళికి పెనుముప్పుగా మారింది. ఐదు మిల్లీమీటర్ల కంటే తక్కువ పరిమాణం ఉండే ఈకణాలు గాలి,నీరు, ఆహారంద్వారా శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి.ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ఉత్పత్తి అవుతుండగా, అందులో గణనీయమైన భాగం వ్యర్థాలుగా మారిపర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్నాయి. ముఖ్యంగా భారతదేశంలో ప్లాస్టిక్ పునర్వినియోగం కేవలం 13 శాతంగానే ఉండటం ఆందోళనకరం. పెద్దప్లాస్టిక్ వస్తువులు ప్రకృతి ప్రభావంతో విచ్ఛిన్నమవ్వడం, కృత్రిమ వస్త్రాల వాడకం వంటి కారణాల వల్ల ఇవి వాతావరణంలో చేరుతున్నాయి. పరిశోధనల ప్రకారం, ఈ కణాలు మానవరక్తం,ఊపిరితిత్తులు,మెదడులోకూడా కనిపిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### శృతిమించుతున్న హిజ్రాలు

హిజ్రాల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించిపోతున్నాయి. రోడ్డుపై వీరిని చూడగానే బెంబేలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు డబ్బు కోసం వీరి వేధింపులు ఆగడం లేదు. ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శుభకార్యాల వద్దకువచ్చి అడిగినంత డబ్బు ఇవ్వకపోతే అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. అసభ్యకర ప్రవర్తన, భూతులు మాట్లాడుతూ వారిని కించపరుస్తున్నారు.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మోసాల సుడిగుండంలో బ్యాంకులు!

**ఇటీవల కాలంలో కూడా బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలు సాధారణ ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి. ఎన్ని చట్టాలున్నా, నిబంధనలను ఎంత కఠినతరం చేసినా, తనిఖీ వ్యవస్థలు వాటిని అమలు చేసి బ్యాంకుల్లోని ప్రజాసొమ్మును కాపాడేందుకు నెలనెలా వేలు, లక్షలాది రూపాయలు జీతభత్యాల రూపేణా వేతనాలు తీసుకుంటున్నా, అధికారగణం ఉన్నా దోపిడీ మాత్రం ఆగడం లేదు. చట్టాలన్నా, నిబంధనలన్నా జంకుబొంకు లేకుండాపోతున్నాయి. అంతేకాదు అటు దర్యాప్తు అధికారుల పట్ల కూడా పెద్దగా భయభక్తులు కన్పించడం లేదు. కర్ర లేని వారిని గొర్రె కూడా కరుస్తుందంటారు అలా ఉంది మన దర్యాప్తు అధికారుల పరిస్థితి.**

ఒకసారి మోసపోతే దగా చేసినవారి తప్పు. రెండోసారి దగాపడితే మోసపోయినవారిది కూడా తప్పంటారు పెద్దలు. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి వందలసార్లు మోసపోతూనే ఉన్నాం. అధికారంలో ఎవరున్నా, కారణాలు, కారకులు ఎవరైనా, ఈ దోపిడీ యధేచ్ఛగానే జరుగుతున్నది. ఎన్ని వేల కోట్ల రూపాయలు అక్రమార్కుల పాలయ్యాయో లెక్కలకు అందకపోవచ్చు. బ్యాంకుల్లో ఉన్న ప్రజాసొమ్మును భోంచేయడం, అందులో కొందరు విదేశాలకు పారిపోవడం పరిపాటిగా మారిపోతున్నది. వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ కానీ, అంతకు ముందు పారిశ్రామికవేత్త విజయమాల్యా కానీ బ్యాంకులను వేలాది కోట్ల రూపాయల మోసం చేసి ఇప్ప టికి ఒకటిన్నర దశాబ్దం దాటిపోయినా ఇప్పటివరకు వారిపై నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోవడం దురదృష్టకరం. వారే కాదు వారి సన్నిహితులు దేశ సరిహద్దులు దాటిపోయిన తర్వాత కానీ సంబంధిత యంత్రాంగం కళ్లు తెరవలేదు. ఇటీవల కాలంలో కూడా బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలు సాధారణ ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి. ఎన్ని చట్టాలున్నా, నిబంధనలను ఎంత కఠినతరం చేసినా, తనిఖీ వ్యవస్థలువాటిని అమలు చేసి బ్యాంకుల్లోని ప్రజాసొమ్మును కాపాడేందుకు నెలనెలా వేలు, లక్షలాది రూపాయలు జీతభత్యాల రూపేణా వేతనాలు తీసు కుంటున్నా, అధికారగణం ఉన్నా దోపిడీ మాత్రం ఆగడం లేదు. చట్టాలన్నా, నిబంధనలన్నా జంకు బొంకు లేకుండాపోతున్నాయి. అంతేకాదు అటు దర్యాప్తు అధికారుల పట్ల కూడా పెద్దగా భయభక్తులు కన్పించడం లేదు. కర్రలేని వారిని గొర్రె కూడా కరుస్తుందంటారు. అలా ఉంది మన దర్యాప్తు అధికారుల పరిస్థితి. వేల కోట్ల రూపా యలు దగా చేశారని ఆరోపణలు ఎదుర్కొంటూ విదేశాల్లో జల్సాగా జీవనం గడుపుతున్న బడా వ్యాపారి ఒకరు తాను ఏమీ తప్పు చేయలేదని, ఎలాంటి మోసానికి పాల్పడలేదని బహిరంగంగానే గత వారంలో వ్యాఖ్యానించారు. చేసివుంటే ఇప్పటివరకు తనపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారన్నట్లుగా మాట్లాడారు. తాను నిజంగా తప్పు చేసి ఉంటే అంతపెద్ద దేశ యంత్రాంగం నుండి తప్పించుకోవడం సాధ్యం కాదన్నారు. ఆయనే కాదు బ్యాంకులను దగాచేసిన వారెందరో అలానే మాట్లాడుతున్నారు. చట్టంలో కూడా కొన్ని లోపాలున్నాయనే వాదన కూడా నిజమే కావొచ్చు. మన రాజ్యాంగ నిర్మాతలు కుల, మత, వర్గ,లింగ భేదాలు లేకుండా అందరికీ సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు. అవి నిష్పక్షపాతంగాఅమలు చేస్తారని ఆశించారు. కానీ అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో, దక్షిణలకు ప్రలోభపడో చట్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారు. వందలాది కరుడుగట్టిన నేరస్తులు ప్రజలను వంచించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వైట్‌కాలర్ నేరస్తులు తప్పించుకోగలుగుతున్నారు. ఇక చట్టం అప్పటిపరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలకు కాలానుగుణంగా సవరించాలనే దర్యాప్తు అధికారుల వాదన కూడా సమంజసమే కావొచ్చు. కానీ ఉన్న నిబంధనలను, చట్టాలను ఏమేరకు నిష్పక్షపాతంగా అమలు చేస్తున్నారన్నది పరిశీలించాల్సిన విషయం. ధనిక, పేద అని తేడా లేకుండా ఉన్న చట్టాలను ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ప్రశ్న. నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తారు? వారిని ఏదో నేరంలో అదుపులోకి తీసుకున్నప్పుడు ఎలా ప్రవర్తిస్తారు? అలాగే ఘరానా పెద్దల విషయంలో ఎలాంటి ట్రీట్మెంట్ ఇస్తారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. అందుకే వైట్‌కాలర్ నేరాలు పెరిగిపోతున్నాయి. కోట్ల కొద్దీ దోచేస్తున్నారు. మద్యం వ్యాపారి విజయ్‌మాల్యా కేసునే తీసుకుందాం. ఆయన మోసం 2011లో ఆరంభమైంది. అయినా 2016 వరకు ఫిర్యాదు చేయడానికి కూడా బ్యాంకులు ముందుకు రాలేదు. ఆయన వెనుక ఉన్న రాజకీయ శక్తి అలాంటిది. భారతీయ బ్యాంకులకు ఆయన తొమ్మిదివేల కోట్లకుపైగా టోకరా వేశారని అభియోగం. 2016లో కొన్ని బ్యాంకులు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించాయి. విదేశాలకు వెళ్లకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరాయి. న్యాయస్థానం స్పందించేలోగా ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. 2017లో లండన్‌లో అరెస్టు అయిన వెంటనే బెయిల్ దొరికింది. భారత్‌కు తీసుకొచ్చేందుకు దర్యాప్తు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఇప్పుడు వడ్డీతో కలిపి దాదాపు ఆ అప్పు ఇరవైవేల కోట్లకుపైగా చేరి ఉండవచ్చు. ఆ సంగతి అటుంచితే కేసు దర్యాప్తునకు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో, ఎంత వ్యయప్రయాసలకు లోనవుతున్నారో లెక్కకు అందదు. ఇక సాఫ్ట్‌వేర్ కంపెనీ సలహాదారుగా పనిచేసిన ఒక ప్రముఖుడు ఆదాయపు పన్ను ఎగవేయడంలో బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్‌లో పెద్దఎత్తున లావాదేవీలు జరిపాడు. భారీ మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయుధాల వ్యాపారంలో అత్యంత వివాదాస్పదుడిగా పేరొందిన మరొక ప్రముఖుడి ఇంటిపై జరిపిన దాడుల్లో రక్షణ శాఖ కొనుగోలుకు సంబంధించిన అత్యంత రహస్య కీలక సమాచారం లభించింది. అధికారిక రహస్యాల చట్టాల కింద ఢిల్లీలోని న్యాయస్థానం ఆయనను నేరస్తుడిగా ప్రకటించింది. దర్యాప్తు అధికారులు అప్రమత్తం అయ్యేలోపు ఆయనా విదేశాలకు వెళ్లిపోయాడు. ఇలా ఎన్నో కేసులను ఉదహరించవచ్చు. ఇక బినామీ కంపెనీల పేరుతో ఖాతాలు తెరిచి బ్యాంకులను మోసం చేశాడన్న ఆరోపణలపై ఒక బ్యాంకు డైరెక్టర్‌నే అరెస్టు చేశారు. మరొక బ్యాంకు పూణె జోన్ మాజీ అధిపతి దాదాపు ఎనిమిది కోట్ల రూపాయలకుపైగా దగాకు సహకరించాడన్ని సిబిఐ గతంలో అరెస్టు చేసింది. ఈ బ్యాంకు, ఆ బ్యాంకు అని కాదు. అన్ని బ్యాంకులు మోసాలకు గురైపోతున్నాయి. గుజరాత్‌కు సంబంధించిన ఒక షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ ఇరవైరెండువేల కోట్ల రూపాయలకుపైగా బ్యాంకులకు ఎగనామం పెట్టింది. ఆ సంస్థ చేతిలో మోసపోయింది ఒకటో, రెండో కాదు. ఏకంగా ఇరవై ఎనిమిది బ్యాంకుల కనార్షియంకు కుచ్చుటోపీ పెట్టింది. ఈ దగా ఒకటి, రెండేళ్లు జరగలేదు. ఎన్నో ఏళ్లుగా కొనసాగినా సంస్థలకు బ్యాంకుల నుండి తీసుకున్న డబ్బు మళ్లీస్తున్నా పసిగట్టలేకపోయారంటే ఏమనుకోవాలి. ఇలా చెప్పుకుంటూపోతే గత రెండు,మూడు దశాబ్దాలుగా బ్యాంకులను మోసం చేసే ఘరానా పెద్దలు పెరిగిపోతున్నారు. ఇందులో కొన్ని సందర్భాల్లో ఆయా బ్యాంకులకు సంబంధించిన కొందరు అధికారులు కూడా వారితో చేతులు కలుపుతున్నారనేది కాదనలేని వాస్తవం. కేవలం రెండేళ్ల వ్యవధిలో ఐదువేల మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు రకరకాలు మోసాలు చేసినట్లు రిజర్వుబాంకు గతంలో గుర్తించింది. బ్యాంకుల్లో ఇంటి దొంగలను నియంత్రించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. బ్యాంకులకు వెళ్లి అప్పు కావాలంటే సామాన్యులను సవాలక్ష ప్రశ్నలు అడుగుతారు. నెలల తరబడి బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటారు. ఇచ్చే రుణానికి నాలుగు రెట్లు అదనంగా విలువ ఉన్న ఆస్తులను తనఖా పెట్టుకుంటారు. వాయిదాల ప్రకారం కిస్తీలు కట్టకపోతే ఎన్‌పిఎ అంటూ, ఆస్తుల రికవరీ పత్రికా ప్రకటన ఇచ్చి నానా యాగీ చేస్తారు. ఇటీవల కాలంలో అప్పుల వసూళ్లకు బ్యాంకు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుంటున్నాయి. కొన్ని బ్యాంకులు అయితే ఆ అప్పులను వసూలు చేయడంలో ప్రైవేట్ వ్యాపారులను మించిపోతున్నాయి. కేవలం పది, ఇరవై వేల రూపాయలు కిస్తీ కట్టలేక, బ్యాంకుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన అన్నదాతలు ఎందరో ఉన్నారు. అదే బ్యాంకు యాజమాన్యాలు పెద్దల విషయంలో ఇందుకు పూర్తివిరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయ పలుకుబడో లేక లక్ష్మీపుత్రులుగా మారితేనో తమను ఏమీ చేయలేరనే భావన రోజురోజుకు పెరిగిపోతు న్నది. అందుకే ఒకరిని మించి ఒకరు పోటీపడి ఇటు ప్రజ లను, అటు బ్యాంకులను మోసంచేసి కోట్లకు పడగలెత్తు తున్నారు. ఇలాంటి మోసం చేసేవారిపై ఉక్కుపాదం మోపాలి. అవసరమైతే చట్టానికి మరింత పదునుపెట్టాలి.

దామెర్ల సాయిబాబ

### ఒక్క మాట

# కార్మికుల భద్రతకు భరోసా ఏది?

ఈమధ్యే విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్ఎంఎస్)లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘోర దుర్ఘటనలో ఐదుగురు ఉద్యోగులతో పాటు ముగ్గురు కార్మికులు మృత్యువాత పడటం,మరో ఆరుగురు తీవ్రంగా కాలిన గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండటం, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటం అత్యంత బాధాకరం. ఈ ఘోర,పెను ప్రమాదం ఓ హృదయ విదారక ఘట్టంగా, ఎంతటి వారికైనా ఒక్క క్షణం గగుర్పాటుకు గురిచేసే ఈ విషాదకరమైన ఘటన ఎలా సంభవించింది అనే విషయానికి వస్తే 150టన్నుల ద్రవపు ఉక్కును మోసుకెళ్తున్న భారీ లాడేల్ నుంచి ద్రవపు ఉక్కు ఒక్కసారిగా విస్ఫోటకం చెంది పైకి ఎగిసి పడటం, తద్వారా అందులో ఉన్న సలసల కాగే ఉక్కు ద్రవం నేలపై చెల్లాచెదురుగా పడటంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అంతేకాదు లాడేల్ నుంచి ద్రవం తుళ్ళిన వేగానికి, ఉక్కు ద్రవం వేడికి అక్కడ ఉన్న భారీ క్రేన్ కూడా పూర్తిగా దగ్ధమై ఆ ప్రాంతమంతా క్షణాల్లో మంటలు వ్యాపించడంతో ప్లాంట్ ఒక్కసారిగా అగ్నిగుండంగా మారడాన్ని బట్టి ప్రమాదం అనేది ఏ స్థాయిలో ఎంతటి భారీ స్థాయిలో జరిగిందో మనం ఇట్టే ఊహించవచ్చు. అయితే దేశంలోని ఏ స్టీల్ ప్లాంట్‌లోనూ ఈ తరహా ప్రమాదం గతంలో సంభవించలేదని, లాడెల్ నుంచి ద్రవపు ఉక్కు లీకై మాత్రమే ప్రమాదాలు జరిగేవి, కానీ ఈసారి లాడెల్ నుంచి ద్రవపు ఉక్కు చిచ్చుబుడ్డిలా ఎగిసిపడి ఈ దారుణ దుర్ఘటనకు కారణ భూతమవ్వడం అత్యంత దురదృష్టకరమైన విషయం. గత రెండు నెలలుగా లాడెల్స్ నుంచి ద్రవపు ఉక్కు 27సార్లు లీక్‌కాగా పలుమార్లు కార్మికులు పెను ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. అయితే దేశంలోని స్టీల్ ప్లాంట్‌లలో లాడేల్‌లోని ఉక్కు ఎగిసిపడటం ఇదే ప్రథమమని కార్మిక సంఘాల ప్రతినిధులు చెబుతుండటం,పైగా ప్రాసెసింగ్ కోసం వాడే

బుగ్గన మధుసూదనరెడ్డి




రసాయనాలు నాణ్యత లేనివి కావడం వల్లే కెమికల్ రియాక్షన్ జరిగి ఈ తరహా దుర్ఘటన జరిగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో వీటివెనుక ఉన్న నిజనిజాలు నిర్ధారణ చేయాల్సిన గురుతర బాధ్యత స్టీల్ ప్లాంట్ యజమాన్యం వారిపై, అదేమాదిరి ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ఆ స్టీల్ ప్లాంట్ యజమాన్యం ఖచ్చితమైన చర్యలు తీసుకునేలా వారిపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాల్సిన కనీస బాధ్యత ప్రస్తుత కేంద్ర ఉక్కు శాఖపై ఎంతైనా వుంది. ఏదిఏమైన 20మంది ఉండాల్సిన పనిప్రదేశంలో కేవలం 12మందితో పని చేయించడం దారుణమని, పనికిరాని వ్యక్తులను డైరెక్టర్లుగా నియమించి భద్రతాప్రమాణాలు పాటించకుండా ఉత్పత్తి చేయడంవల్లే ఇలాంటి తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయని విశాఖస్టీల్ ప్లాంట్ యాజమాన్యంపై అత్యంత తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వీటన్నింటిని ఒకటికి రెండుసార్లు క్షుణంగా పరిశీలించి, పర్యవేక్షణ గావించి, తనిఖీ చేసి మరీ ఈపొరపాట్లు మరోసారి పునరావృతంకాకుండా చూసుకోవాల్సిన గురుతర బాధ్యత విశాఖ స్టీల్ ప్లాంట్ యజమాన్యం వారి భుజస్కందాలపై ఎంతైనా వుంది.ఏమైనా కార్మికుల భద్రతపై ఏమాత్రం దృష్టిసారించకుండా కేవలం ఉత్పత్తి మాత్రమే లక్ష్యంగా కార్మికులపై ఒత్తిడి పెంచడం మూలాన ఇలాంటి ప్రమాదాలు తరచుగా చోటు చేసుకుంటున్నాయని పలువురు కార్మిక అనుబంధ సంఘాల నాయకులు స్టీల్ ప్లాంట్ యజమాన్యంపై తీవ్ర విమర్శలు చేస్తూన్న నేపథ్యంలో వీటన్నింటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత,కర్తవ్యం స్టీల్ ప్లాంట్ యజమాన్యంపై ఎంతైనా వుంది.అన్నింటికి మించి ఇలాంటి పెద్ద పెద్ద స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలలో అయా యజమాన్యాలు అధిక లాభాలకు ఇచ్చేప్రాధాన్యత, కార్మిక భద్రతాప్రమాణాలకు ఇవ్వకుండా చేయడం మూలా నే ఇలాంటి గుండెల్ని పిండి చేసే ఘటనలు, కార్మికుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయే, దిగ్భ్రాంతికరమైన సంఘటనలు సంభవిస్తూన్నాయి అనేమాట అక్షరసత్యం.కార్మికుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతుండటం, పెద్దపెద్దసంస్థల యజమాన్యాలు మాత్రంకోట్లకు పడగలు ఎత్తుతుండటం ప్రస్తుత సమాజంలో జరుగుతున్న ఓ తతంగం,ఓ సాధారణ పరిణామం అనడంలో ఎలాంటి సందేహానికి తావులేదు.

# హారిజంటల్ రిజర్వేషన్ల అసలు తత్త్వం

డీఎస్సీ నియామకాల నేపథ్యంలో హారిజాంటల్ రిజర్వేషన్లపై ఉద్భవించిన వివాదం కేవలం కొన్ని ఉద్యోగాల కేటాయింపుల గురించినది కాదు. అది భారతదేశంలో రిజర్వేషన్ వ్యవస్థపై ఉన్న అవగాహన లోపాన్ని, సామాజిక న్యాయం గురించి మనం ఇంకా ఎంత పరిమితంగా ఆలోచిస్తున్నామో వెల్లడించింది. రిజర్వేషన్లు అంటే కేవలం శాతం లెక్కలు కాదని, ప్రాతినిధ్యం అనే ప్రజాస్వామ్య విలువను ప్రతిబింబించే వ్యవస్థ అని గుర్తుచేసింది. చాలా మందికి రిజర్వేషన్ అంటే కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు కేటాయించిన సామాజిక కోటాలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ, భారత రాజ్యాంగం ఆశించిన బహుముఖ సామాజిక న్యాయం అంతటితో ముగిసిపోదు. ఒకే సామాజిక వర్గానికి చెందిన మహిళ, వికలాంగుడు, మాజీ సైనికుడు లేదా క్రీడాకారుడు కూడా వ్యవస్థలో సమాన అవకాశాలు పొందాలనే ఉద్దేశంతో రూపొందించబడిన అత్యంత సంక్లిష్టమైన అంతర్గత రక్షణ వలయమే ఈ 'హారిజాంటల్ రిజర్వేషన్లు'. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(1), 16(4) పరిధిని విశ్లేషిస్తే సమానత్వానికి ఉన్న రెండు భిన్న కోణాలు స్పష్టమవుతాయి. చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించడం కోసం ప్రవేశపెట్టిన వర్టికల్ (సామాజిక) రిజర్వేషన్లు ఒక ఎత్తయితే, ఆయా వర్గాల లోపల మళ్లీ వెనుకబడిన ఉపవర్గాలకు రక్షణ కల్పించడం మరోఎత్తు. ఉదాహరణకు, ఒక నిర్దిష్ట సామాజిక వర్గంలో పురుషులతో పోలిస్తే మహిళలు, సాధారణ అభ్యర్థులతో పోలిస్తే దివ్యాంగులు మరింత వెనుకబడి ఉంటారు. కేవలం సామాజిక వర్గాల ఆధారంగానే సీట్లు కేటాయించుకుంటూపోతే, ఆయా వర్గాలలోని మహిళలకు, దివ్యాంగుల వంటి బలహీన ఉపవర్గాలకు అవకాశాలు దక్కకుండా పోతాయి. ఈ అంతర్గత అసమానతలను తొలగించేందుకే 'హారిజాంటల్ విధానం' రూపుదిద్దుకుంది. సూక్ష్మ సాంకేతిక వ్యత్యాసం అర్థం కాకపోవడం వల్లే నియామకాల ప్రతిసారీ వివాదాలు, కోర్టు కేసులు ముసురుకుంటున్నాయి. ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులుఅత్యంత స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించాయి. ముఖ్యంగా 'అనిల్ కుమార్ గుప్తా', 'రాజేష్ కుమార్ దరియా' కేసులలో సుప్రీంకోర్టు హారిజాంటల్ విధానాన్ని 'ఇంటర్లాకింగ్ రిజర్వేషన్'గా అభివర్ణించింది. న్యాయస్థానం నిర్దేశించిన సూత్రం ప్రకారం, ముందుగా ఓపెన్ మెరిట్, ఆ తర్వాత వర్టికల్

ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు




(సామాజిక) రిజర్వేషన్ల ప్రకారం ప్రతి కేటగిరీలో పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీచేయాలి. ఆ తర్వాతే, సదరు కేటగిరీలలో మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికుల నిర్దేశితకోటా భర్తీ అయిందో లేదో సరిచూసుకోవాలి. ఒకవేళ భర్తీ కాకపోతేనే చిట్టచివరి అభ్యర్థులను తొలగించి,ఆయా క్షితిజసమాంతర (హారిజాంటల్) అభ్యర్థులతో భర్తీచేయాలి. ఈ విధానం సామాజిక న్యాయంతో పాటు పరిపాలనా పారదర్శకతను కూడా నిర్ధారిస్తుంది. డీఎస్సీ వివాదం బహిర్గతం చేసిన వాస్తవం డీఎస్సీ నియామకాల సందర్భంగా వచ్చిన అపోహలు కేవలం పోస్టుల లెక్కలకు సంబంధించినది కాదు. అది ప్రజా విధానాలపై అవగాహన ఎంత అవసరమో గుర్తు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులు, రోస్టర్ విధానం, న్యాయస్థానాల తీర్పులు అన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ, అవి సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో చేరడం లేదు. ఫలితంగా నియామకాల ప్రక్రియ పూర్తయిన తర్వాతే సందోహాలు, ఆరోపణలు, అపోహాలు ఉత్పన్నమవుతున్నాయి. నియామక ప్రక్రియలో పారదర్శకత ఎంత ముఖ్యమో, దానిపై ప్రజలకు అవగాహన కల్పించడంకూడా అంతే ముఖ్యం. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థల్లో 'మెరిట్' అనే భావన కేవలం పరీక్షల్లో సాధించే మార్కులకే పరిమితం కాకూడదు. సామాజిక సమగ్రత, వైవిధ్యం కూడా మెరిట్‌లో భాగమేనని న్యాయవ్యవస్థ సైతం పునరుద్ఘాటించింది. హారిజాంటల్ రిజర్వేషన్లు ఈ మెరిట్‌ప్రాతినిధ్యాల మధ్య ఒక సంపూర్ణ సమతుల్యతను సాధిస్తాయి. ఒకవైపు పోటీని కొనసాగిస్తూనే, మరోవైపు మహిళలు, దివ్యాంగులు వంటి వర్గాలు అవకాశాల నుండి దూరం కాకుండా చూస్తాయి. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నియమావళి సాధారణ అభ్యర్థులకు అర్థమయ్యే సరళమైన భాషలో అందుబాటులో లేకపోవడం పెద్ద లోపం. ఇకపై ప్రతి ప్రభుత్వ నియామక నోటిఫికేషన్తో పాటు, హారిజాంటల్ రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారో స్పష్టమైన గ్రాఫికల్ చార్టులు, ఉదాహరణలతో కూడిన వివరణలను కూడా అధికారికంగా విడుదల చేయాలి. సామాజిక న్యాయం అనేది కేవలం కాగితాల మీది అంకెల శాతాలతో ముడిపడి ఉన్నది కాదు, అది సమాజంలోని ప్రతి ఉపవర్గానికి సంపూర్ణంగా అందినప్పుడే రాజ్యాంగ ఆశయం నెరవేరుతుంది. భారతదేశం వంటి వైవిధ్యభరిత సమాజంలో సామాజిక న్యాయం అనేది కేవలం శాతం కేటాయింపుల అంశం కాదు. సమాజంలోని ప్రతి వర్గం, ప్రతి ఉపవర్గం, ప్రతి వ్యక్తి అవకాశాల ప్రవాహంలో భాగస్వామి కావడం దాని అసలు లక్ష్యం. ఆ లక్ష్యాన్ని సాధించడంలో హారిజాంటల్ రిజర్వేషన్లు ఒక కీలక ప్రజాస్వామ్య సాధనం. అందువల్ల వాటిని వివాదాల కళ్లద్దాల ద్వారా కాకుండా, సమగ్ర ప్రాతినిధ్యం రాజ్యాంగ విలువల దృష్టితో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# కేన్సర్ మందులు, వ్యాక్సిన్‌లపై ధరలు 50శాతం పెంపు

- గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసిన ఎన్‌పిపిఎ
- అంతర్జాతీయ విపణిలో ధరలు పెరుగుదల



**న్యూఢిల్లీ, జూన్ 12:** క్యాన్సర్ మందులు, టెటనస్ సీరం, చిన్నపిల్లల వ్యాక్సిన్‌ల ధరలు 50 వరకు పెరగనున్నాయిపెరుగుతున్న ముడి పదార్థాల ధరలు, సరఫరా ఆందోళనలను కారణంగా చూపుతూ జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నియంత్రణ అథారిటీ; కీలక ఆంకాలజీ మందులు, ఇమ్యునోగ్లోబులిన్ ఇంజెక్షన్లు, వ్యాక్సిన్‌ల గరిష్ట ధరలను సవరించింది పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, సరఫరా అంతరాయాల నేపథ్యంలో రెండు కీలక క్యాన్సర్ మందులైన కార్బోప్లాటిన్, సిస్ప్లాటిన్‌ల లభ్యత కొనసాగేలా చూసేందుకు, వాటి గరిష్ట ధరలను ఒకేసారి 50శాతం పెంచడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కార్బోప్లాటిన్, సిస్ప్లాటిన్‌లు వివిధ రకాల క్యాన్సర్ల చికిత్స కోసం విస్తృతంగా ఉపయోగించే తొలిదశ ఆంకాలజీ ఔషధాలు. ఈ మందుల కొరత, సరఫరా అంతరాయాలపై ఆరోగ్య సంస్థలు, ఆంకాలజిస్టులు, తయారీదారులు తమ దృష్టిని ఆకర్షించారని ఎన్‌పిపిఎ తెలిపింది. మందుల కొరత, అధిక యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్ (ఎపిఐ) ధరలు, వాటి తయారీ వాణిజ్యపరమైన లాభదాయకతపై ఆందోళనలకు సంబంధించిన నివేదికలను సమీక్షి ంచిన తర్వాత ఈ చర్య తీసుకున్నట్లు జూన్ 11న జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌లో నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) పేర్కొంది. సవరించిన గరిష్ట ధరల ప్రకారం, వర్తించే జిఎస్‌టిని మినహాయించి, కార్బోప్లాటిన్ ఇంజెక్షన్ (10ఎంజి/ఎంఎల్) ధరను ప్రతి ఎంఎల్‌కి రూ.90.74గా, సిస్ప్లాటిన్ ఇంజెక్షన్ (1ఎంజి/ఎంఎల్) ధరను ప్రతి ఎంఎల్‌కి రూ.10.89గా నిర్ణయించారు. ఈ రెండు మందులలో ఉపయోగించే ఎపిఐల ధరలు ఇటీవలి సంవత్సరాలలో గణనీయంగా పెరిగాయని, ఇది వాటి ఉత్పత్తి, సరఫరా సాధ్యతను ప్రభావితం చేస్తోందని అథారిటీ పేర్కొంది. ఈ మందుల లభ్యతలో ఏ మాత్రం అంతరాయం ఏర్పడినా, అది క్యాన్సర్ చికిత్సకు ఆటంకం కలిగించి, రోగులను ఖరీదైన ప్రత్యామ్నాయాల వైపు మళ్లించేలా చేస్తుందని కూడా అది తెలిపింది. ముడి పదార్థాల ధరలలోని హెచ్చుతగ్గులను పరిగణనలోకి తీసుకుని, ఈ సవరించిన గరిష్ట ధరలను ఆరు నెలల తర్వాత లేదా అవసరమైతే అంతకంటే ముందుగానే సమీక్షి స్తారు.



# నేటి నుంచి ప్రధాని విదేశ పర్యటన

## - 18 వరకు ఫ్రాన్స్, స్లోవేకియాలో టూర్ - ఇరు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు - జి7 సదస్సుకు హాజరు.. ట్రంప్‌తో భేటీ?

**న్యూఢిల్లీ, జూన్ 12:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూన్ 13 నుంచి 18 వరకు ఫ్రాన్స్, స్లోవేకియాలలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, స్లోవేకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికోలతో ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. అలాగే ఫ్రాన్స్‌లో జరిగే జి7 సదస్సులో పాల్గొని, పారిస్‌లో జరిగే వివాటెక్ టెక్నాలజీ ఈవెంట్‌కు హాజరవుతారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం, ప్రధాని మోడీ తన పర్యటనను ఫ్రాన్స్‌లోని నైస్‌లో ప్రారంభిస్తారు. అక్కడ ఆయన జూన్ 14న అధ్యక్షుడు మాక్రాన్‌ను కలుస్తారు. భారత్-ఫ్రాన్స్ ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం కింద ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాల పూర్తి స్థాయిని ఈ ఇద్దరు నాయకులు సమీక్షించే అవకాశం ఉంది. భారత్, ఫ్రాన్స్, ఇతర దేశాలకు చెందిన స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్ ఫండ్‌లను ఒకచోట చేర్చే 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని కూడా ఈ ఇద్దరు నాయకులు సంయుక్తంగా ప్రారంభిస్తారు. భారత్-ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జూన్ 14 నుంచి 16 వరకు, ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ స్లోవేకియాలో అధికారిక పర్యటన చేపట్టనున్నారు. 1993లో స్లోవేకియాకు స్వాతంత్రం వచ్చిన తర్వాత, ఆ దేశంలో ఒక భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన సందర్భంగా, ప్రధాని మోడీ ఫికోతో చర్చలు జరిపి, స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినిని కలుస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఆటో మొబైల్ తయారీ, రైల్వే తయారీ వంటి రంగాలలో సహకారాన్ని విస్తరించడంపై ఈ చర్చలు దృష్టి సారించే అవకాశం ఉంది. ఆ తర్వాత ప్రధాని మోడీ, జూన్ 16, 17 తేదీలలో ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జరిగే జి7 సదస్సులో పాల్గొంటారు. అంతర్జాతీయ సహకారం, ఆర్థిక వృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వంటి అంశాలపై జి7 నాయకులు, భాగస్వామ్య దేశాలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ఆయన అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంది. ఈ సదస్సు సందర్భంగా, ప్రధాని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సహా పలువురు ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. తన పర్యటన చివరి దశలో, ప్రధాని మోడీ తదుపరి ద్వైపాక్షిక కార్యక్రమాల కోసం, యూరప్‌లోనే అతిపెద్ద టెక్నాలజీ, స్టార్టప్ ఈవెంట్ అయిన వివాటెక్ సమ్మిట్‌లో పాల్గొనడం కోసం జూన్ 18న ప్యారిస్‌కు వెళ్లనున్నారు. ఆయన ఫ్రాన్స్ రాజధానిలోని భారతీయ సమాజ సభ్యులతో కూడా సంభాషించే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా ఫ్రాన్స్, స్లోవేకియాలతో భారతదేశ సంబంధాలు మరింత బలపడతాయని, జి7 దేశాలతో సహకారం పటిష్టం అవుతుందని, ఆవిష్కరణ, డిజిటల్ టెక్నాలజీలు, వ్యవస్థాపకత రంగాలలో భాగస్వామ్యాలు ప్రోత్సహించబడతాయని ప్రభుత్వం తెలిపింది.

# రాజ్యసభకు 24 మంది ఎంపీలు ఏకగ్రీవం

**న్యూఢిల్లీ,జూన్ 12:** రాజ్యసభ 2026కు సంబంధించిన ఎన్నికలు తాజాగా జరిగాయి. మొత్తం 27 స్థానాలకు నోటిఫికేషన్ వెలువడి ఎన్నిక జరగగా అందులో 24 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలిచారు. గురువారం ఫలితాలు వెలువడ్డాయి. వీరిలో 19 మంది బీజేపీ (ఎన్‌డీయే) అభ్యర్థులుకాగా, మిగతా ఐదుగురు కాంగ్రెస్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మరోసారి ఎంపీగా గెలిచారు. కాంగ్రెస్ నుంచి మీనాక్షినటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత రాజ్యసభలో ఎన్‌డీయే స్థానాలు 3 పెరగగా, కాంగ్రెస్ ఒక సీటు పెంచుకుంది. ఇంతకుముందు ఈ స్థానాల్లో ఎన్‌డీయే 16 రాజ్యసభ సీట్లు కలిగి ఉండేది. ఇప్పుడు 3 సీట్లు పెరిగాయి. ఇంతకుముందు ఇదే స్థానాల్లో కాంగ్రెస్ 4 సీట్లు కలిగి ఉండేది. ఇప్పుడు అదనంగా మరో సీటు గెలుచుకుంది. ఈ ఎన్నికల ద్వారా ఏపీకి చెందిన వైసీపీ మూడు రాజ్యసభ స్థానాల్ని కోల్పోయింది. ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్ కూడా ఒక సీటును బీజేపీకి కోల్పోవాల్సి వచ్చింది. తాజా ఫలితాల్లో పార్టీ ప్రకారం గెలిచిన సీట్ల వివరాలివి. ఏపీ నుంచి ఎన్‌డీయే కూటమికి చెందిన పార్టీలు టీడీపీ, జనసేనలు 4 స్థానాలు దక్కించుకున్నాయి. ఇందులో మూడు సీట్లు టీడీపీకి, ఒక సీటు జనసేనకు దక్కాయి. భాష్యం రామకృష్ణ (టీడీపీ) చింతకాయల విజయ్ (టీడీపీ), సానా సతీష్ బాబు (టీడీపీ), లింగమనేని రమేష్ (జనసేన), గుజరాత్ నుంచి నాలుగు స్థానాలు బీజేపీకే దక్కాయి. రాజుభాయ్ శుక్లా, మన్షిన్ పర్మార్, ముకేష్‌భాయ్ రత్వా, జితేంద్ర కంజారియాలు బీజేపీ నుంచి గెలిచారు. కర్ణాటకలో ఒక స్థానం ఎన్‌డీయేకు, మూడు స్థానాలు కాంగ్రెస్ (ఇండియా బ్లాక్)కు దక్కాయి. అవి మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్), మన్సూర్ అలీఖాన్ (కాంగ్రెస్), పవన్ ఖేరా (బీజేపీ), ఎం నాగరాజా (బీజేపీ), మధ్యప్రదేశ్ నుంచి 3 సీట్లు ఎన్‌డీయే కూటమికి దక్కాయి. తరుణ్ చుగ్, రాజనీష్ అగర్వాల్, ముకేష్ కేవత్‌లు బీజేపీ నుంచి గెలిచారు. రాజస్తాన్‌లో రెండు సీట్లు ఎన్‌డీయేకు, ఒకటి కాంగ్రెస్‌కు దక్కాయి. సతీష్ పూనియా (బీజేపీ), అల్కా గుర్జార్ (బీజేపీ), నీరజ్ దంగి (కాంగ్రెస్) గెలుపొందారు. తమిళనాడులో ఒక స్తానాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. టీవీకే మద్దతుతో కాంగ్రెస్ గెలిచింది. తమిళనాడు నుంచి కాంగ్రెస్ తరపున ప్రవీణ్ చక్రవర్తి గెలిచారు. ఇక అరుణాచల్ ప్రదేశ్ నుంచి బీజేపీ తరపున తాయ్ తగాక్, మణిపూర్ నుంచి అధికారిమయూమ్ శార్దా దేవి (బీజేపీ), మేఘాలయ నుంచి జేమ్స్ కే సంగ్మా (ఎన్‌పీపీ), మహారాష్ట్ర నుంచి రాజేంద్ర జైన్ (ఎన్‌సీపీ), ఒడిశా నుంచి దేవాశిస్ సమంత్ రాయ్ (బీజేపీ) గెలిచారు.

# రష్యాచమురు కొనుగోలు చేయమని అమెరికానే చెప్పింది!

## ఫిన్‌ల్యాండ్ పర్యటనలో విదేశాంగమంత్రి జైశంకర్



**హెల్సింకి, జూన్ 12:** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శిస్తున్న పాశ్చాత్య దేశాలపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఘాటుగా స్పందించారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురు కొనుగోలు చేయాలని భారత్‌ను స్వయంగా అమెరి కానే కోరిందని వెల్ల డించారు. ప్రపంచ మార్కెట్లో ధరలు అదుపులో ఉండాలంటే రష్యా చమురు కొనాలని అప్పట్లో అగ్ర రాజ్యం సూచించిందని చెప్పారు. ఫిన్లాండ్ పర్యటనలో భాగంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై భారత్ మరీ సానుభూతి చూపుతోందని, ఎక్కువగా రష్యా చమురునే కొనుగోలు చేస్తోందని ఓ జర్నలిస్టు ప్రశ్నించచడంతో గట్టిగా బదులిచ్చారు. తాను చమురు కొనేటప్పుడు ధర, లభ్యత మాత్రమే చూస్తానని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత అమెరికా సహా పాశ్చాత్య దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాయి. దీంతో యూరప్ దేశాలు పశ్చిమాసియా దేశాల చమురును ఎక్కువగా కొను గోలు చేయడం ప్రారంభించాయి. అదే సమయంలో భారత్‌కు అందుబాటులో ఉన్న పెద్ద సరఫరాదారు రష్యానే అయిందని జైశంకర్ వివరించారు. పరిస్థితులే భారత్‌ను ఆ దిశగా నడిపించాయని చెప్పారు. రష్యా చమురు విషయంలో అమెరికా వైఖరిని కూడా ఆయన ప్రశ్నించారు. ఓవైపు రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై టారిఫ్‌లు విధించారని తర్వాత వాటినే ఎత్తివేశారని గుర్తుచేశారు. ఇందులో గొప్ప సూత్రాలు ఏమీ లేవని, దీనికి నైతికత ముసుగు వేయడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. గత ఏడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం భారత వస్తువులపై 50 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. ఇందులో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తోందంటూ విధించిన 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. అయితే ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రపంచ ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి పెరగడంతో ఆ ఆంక్షలను అమెరికా సడలించింది.

యూరప్ దేశాలపై కూడా జైశంకర్ విమర్శలు గుప్పిం చారు. భారత్‌పై దాడులకు ఉప యోగించే ఆయుధాలను యూరప్ దేశాలు ఎన్నో ఏళ్లుగా విక్రయిస్తున్నా యని చెప్పారు. భారత ఆయుధాలతో యూరప్‌లోని ఏ దేశంపైనా దాడులు జరగలేదని స్పష్టం చేశారు.

# టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కేసు నమోదు



**కోల్‌కత్తా,జూన్ 12:** టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. దక్షిణ కోల్‌కతాలోని నేతాజి నగర్ పోలీస్ స్టేషన్‌లో కోల్‌కతాకు చెందిన ఒక వ్యక్తి మమతపై ఫిర్యాదు చేశాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మమత గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకవర్గానికి వ్యతిరేకంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని ఆమెపై నమోదైన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మీరు క్షేమంగా ఉన్నారని, లేకుంటే ఒక వర్గం చేతిలో అణిచివేతకు గురయ్యే వారు అంటూ అప్పట్లో మమత వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఆమె వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు, భయం పెంపొందించేలా, ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా మమత వ్యవహరించారని ఫిర్యాదులో వివరించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. మే 20న ఈ ఫిర్యాదు దాఖలైంది. శుక్రవారం ఈ ఫిర్యాదుపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మమతకు తాజా రాజకీయ పరిణామాలు ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. పార్టీకి చెందిన మెజారిటీ నేతలు టీఎంసీని వీడుతున్నారు. ఎంపీలు రెబల్స్‌గా ఏర్పడి బీజేపీకి మద్దతు ప్రకటించారు. తమను ప్రత్యేక వర్గంగా చూడాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. మరోవైపు ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లో ఇప్పుడు టీఎంసీ భవితవ్యంతోపాటు మమత రాజకీయ భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారింది.

# దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి 30 యేళ్ల జైలు



**సియోల్, జూన్ 12:** దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. కాగా 2024 అక్టోబరులో ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపినందుకు ఆయనకు మరో 30 యేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు దక్షిణ కొరియాలోని కోర్టు తీర్పు వెలువరించింది. కిమ్ సేనను రెచ్చగొట్టేందుకే ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెంట్‌ను తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు ఆయన విధించిన 'మార్షల్ లా' విఫలమవడంతో ఓ సాకు సృష్టించుకోవడానికి ఈ చర్యలకు పాల్పడినట్లు వెల్లడించింది.

# ఆ పది శాతం సుంకాలకు ఫెడరల్ కోర్టు ఓకే

**వాషింగ్టన్, జనవరి 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. ప్రపంచవ్యాప్తంగా దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ విధించిన 10 శాతం గ్లోబల్ సుంకాలను వాషింగ్టన్‌లోని ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు సమర్థించింది. ఆ సుంకాల వసూలును కొనసాగించవచ్చని కీలక తీర్పునిచ్చింది. గతేడాది భారత్ సహా అన్ని దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాటిని ఈ యేడాది ప్రారంభంలో అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆ వెంటనే ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ 122ను ఉపయోగించి జూలై 24 వరకు అమలులో ఉండేలా 10 శాతం తాత్కాలిక సుంకాలను ట్రంప్ విధించారు. రెండు వ్యాపార సంస్థలు ఇటీవల దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా..

అక్కడ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం సుంకాలను నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టు స్పష్టం చేసింది. ట్రంప్ యంత్రాంగం దీనిపై అప్పీల్ చేయగా.. వారికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. కాగా.. ఈ కేసుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# సంక్షిప్త వార్తలు

## కోమాలో ఉన్న థాయ్ యువరాణి కన్నుమూత



**బ్యాంకాక్, జూన్ 12:** మూడేళ్లుగా కోమాలో ఉన్న థాయ్‌ల్యాండ్ యువరాణి బజ్రకితియాబా కన్నుమూశారు. ఆమె వయసు 47 ఏళ్లు. డిసెంబర్ 2022లో ఆమె స్పృహ కోల్పోయారు. గుండె పనితీరు రెగ్యులర్‌గా లేని కారణంగా ఆమె గుండె కండరాలకు మైక్రోప్లాస్మా ఇన్‌ఫెక్షన్ అయ్యింది. థాయ్‌ల్యాండ్ రాచకుటుంబం యువరాణి మృతి పట్ల తీవ్ర సంతాపం ప్రకటించింది. రాజు వజిరలాంగ్‌కార్న్ పెద్ద కుమార్తె ఆమె. ఆ రాజుకు ఏడు మంది పిల్లలు ఉన్నారు. 1978లో డిసెంబర్ 7వ తేదీన తొలి భార్యకు ఆమె జన్మించారు. వైద్య బృందం ఆ యువరాణికి ఇంటెన్సివ్ కేర్ చికిత్స అందించింది. కానీ ఆమె క్రమంగా బలహీనమైనట్లు గుర్తించారు. చూలలోంగ్‌కార్న్ ఆస్పత్రిలో ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదరింపు

**లక్నో,జూన్ 12:** ఇండిగో విమానానికి శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చింది. లక్నో నుంచి ఢిల్లీ బయల్దేరాల్సిన విమానానికి బాంబు బెదిరింపు వచ్చిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ కావడానికి కొద్ది నిమిషాల ముందు బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న భద్రతాదళాలు వేగంగా స్పందించాయి. విమానాన్ని నిలిపివేశారు. విమానంలోని ప్రయాణికుల్ని, సిబ్బందిని దింపివేశారు. దూరంగా నిలిపి తనిఖీలు చేపడుతున్నారు. సీఐఎస్‌ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)తోపాటు స్థానిక పోలీసులు ఈ సెక్యూరిటీ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్నారు.

## టాటాలను మళ్లీ తీసుకొస్తాం.. సిఎం సువేందు అధికారి



**కోల్‌కత్తా,జూన్ 12:** పశ్చిమ బెంగాల్‌లో పారిశ్రామిక పెట్టుబడులను పెంపొందించే దిశగా నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి అడుగులువేస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం రాష్ట్రం నుంచి తరలివెళ్లిన టాటా గ్రూప్‌ను మళ్లీ వెనక్కి తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కోల్‌కత్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "టాటాలను మేము తిరిగి బెంగాల్‌కు తీసుకు వస్తాం" అని ప్రకటించారు. సుమారు 18 ఏళ్ల క్రితం సింగూ ర్‌లో టాటా నానో కార్ల ఫ్యాక్టరీ ఏర్పాటుపై తలెత్తిన వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

## బంగ్లాలో శ్రీరాముడి విగ్రహ నిర్మాణపనులు నిలిపివేత



**ఢాకా,జూన్ 12:** బంగ్లాదేశ్‌లో నిర్మాణంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద శ్రీరాముడి విగ్రహ పనులను అక్కడి అధికారులు నిలిపివేశారు. గైబాంధా జిల్లాలోని పలాష్‌బారి ప్రాంతంలోని శ్రీశ్రీ రాధా గోవింద, కాళీ ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. స్థానిక ఇస్లామిక్ సంస్థలు, మత ఛాందసవాద గ్రూపుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ నిర్ణయం బంగ్లాదేశ్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా చర్చనీయాంశమైంది.

## 160 యేళ్ల బంగ్లాను నివాసంగా ఎంపికచేసుకున్న సిఎం డికె



**బెంగళూరు,జూన్ 12:** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన అధికారిక నివాసం విషయంలో సంప్రదాయానికి భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా ముఖ్యమంత్రుల కోసం కేటాయించే కృష్ణ, కావేరి, అనుగ్రహ వంటి అధికారిక బంగ్లాలకు బదులుగా, 160 ఏళ్ల సుదీర్ఘ చారిత్రక నేపథ్యం కలిగిన కుమారకృప బంగ్లాను తన నివాసంగా, కార్యాలయంగా ఆయన ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కావేరి బంగ్లాలోనే నివాసం ఉంటుండటంతో, ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డీకే శివకుమార్ ఈ ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్నారు.

# ఒమన్ తీరంలో మరో భారతీయ నౌకపై అమెరికా దాడి!

**మస్కట్,జూన్ 12:** ఒమన్ తీరంలో భారతీయ నావికులు ఉన్న వాణిజ్య నౌకలపై వరుస దాడులు కొనసాగుతుండటంతో అమెరికా తీరు పట్ల భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. గత 48 గంటల్లో రెండోసారి ఢిల్లీలోని అమెరికా సీనియర్ దౌత్యాధికారిని విదేశాంగ శాఖ పిలిపించి అధికారికంగా నిరసన తెలిపింది. ముందురోజు జరిగిన ఘటనలో 20 మంది భారతీయ సిబ్బంది ఉన్న ఓ వాణిజ్య నౌక దాడికి గురికావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా అధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి భారత విదేశాంగ శాఖ తమ ఆందోళనలను నేరుగా తెలియజేసింది. గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒమన్ తీర ప్రాంతంలో నాలుగు రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న మూడు వాణిజ్య నౌకలను అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకుందని భారత ప్రభుత్వం వెల్లడించింది. భారత నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. సెట్టెబెల్లో నౌకపై దాడి జరిగిన వెంటనే అమెరికా అధికారులకు గట్టి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. ఇలాంటి దాడులు వెంటనే ఆగాలని, సమస్యల పరిష్కారానికి యుద్ధం కంటే చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ స్పష్టం చేసిందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని భారత్ కోరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అన్ని పక్షాలు సంభాషణల బాట పట్టాలని ఢిల్లీ పిలుపునిచ్చింది.

# ఖొమేనీ అంత్యక్రియలు మరోసారి వాయిదా



**టెహ్రాన్,జూన్ 12:** ఇరాన్ సుప్రీం లీడర్ దివంగత అయ తుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు మరోసారి వాయిదా పడ్డాయి. అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఖమేనీ అంత్యక్రియలను జూన్ చివరి వరకు లేదా జూలై ఆరంభం వరకు వాయిదా వేస్తున్నట్లు టెహ్రాన్ మేయర్ ప్రకటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున ఈ అంత్యక్రియలను జూన్ 26 జూలై 5 మధ్య కాలానికి వాయిదా వేస్తున్నట్లు టెహ్రాన్ మేయర్ అలీరెజా జకాని ప్రకటించారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రం ప్రారంభంలో అంటే జూన్ ఆరంభంలో ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ భావించింది. అయితే, కర్బలా యుద్ధంలో (క్రీ.శ. 680) అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం భక్తులు జరిపే వార్షిక సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు వీలుగా మొహర్రం తర్వాతే అంత్యక్రియల నిర్వహించాలని నిర్ణయించినట్లు మేయర్ అలీరెజా వెల్లడించారు.

# రాజీపడిన ప్రధాని - భరతమాత ముద్దుబిడ్డలను రక్షించలేరు

## నావికుల మృతికి మోడీపై రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, జూన్ 12:** వాణిజ్య నౌకపై అమెరికా సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. "రాజీపడిన ప్రధాని" భరతమాత ముద్దుబిడ్డలను రక్షించలేరని, ఎందుకంటే వారి ప్రాణాలు తీసిన వారిని ఆగ్రహానికి గురిచేసే ధైర్యం లేదా శక్తి ఆయనకు లేదని రాహుల్ అన్నారు. 'ఎక్స్' వేదికగా ఈ మేరకు పోస్ట్ చేశారు. ఈ విషయంపై ప్రధాని మోడీ మౌనాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. "మూడు రోజుల్లో అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై జరిగిన అమెరికా దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించారు. కానీ మన 'రాజీపడిన ప్రధాని' మాత్రం... ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని చంపినప్పుడు, ప్రధాని తప్పక స్పందించాలి. కానీ ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేరు. వచ్చే వారం జరగబోయే జి7 సమావేశంలో, మన నావికుల హత్య జరిగిన కొద్ది రోజులకే, మోడీ జీ నవ్వుతూ, ఆలింగనం చేసుకుంటూ, ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ ఆ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్క మాట కూడా మాట్లాడరు" అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. "రాజీపడిన ప్రధాని భరతమాత ముద్దుబిడ్డలను రక్షించలేరు, ఎందు కంటే ఆ బిడ్డల ప్రాణాలు తీసిన వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ ఆయనకు లేవు" అని గాంధీ పేర్కొన్నారు. ఒమన్ గల్ఫ్ లో ప్రయాణిస్తున్న ఎంటీ సెట్టెబెల్లో అనే వాణిజ్య నౌకపై అమెరికా సైన్యం జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. కానీ దీనిపై ప్రధాని మోడీ ఇప్పటి వరకు ఏం మాట్లాడలేదు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇసి-బిజెపి జుగల్‌బందీతోనే సీటు చోరీ.

ప్రధాని మోడీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షీ నటరాజన్

# ఇరాన్‌తో ఒప్పందం కోసం 'యురేనియం'పై మెట్టు దిగిన ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 12:** ఇరాన్‌తో డీల్ దాదాపు కొలిక్కి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. గతంలో కూడా ఆయన పలుమార్లు ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ.. ఈసారి మాత్రం ఒప్పందం ఖరారయ్యే సంకేతాలే కన్పిస్తున్నాయి. ఇందు కోసం ట్రంప్ ఓ మెట్టు దిగి మరీ ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా సంస్థ సంచలన కథనం వెల్లడించింది. ఇరాన్‌లో శుద్ధి చేసిన యురేనియం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ దేశం చేతుల్లో ఉండొద్దని ట్రంప్ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దాన్ని అమెరికాకు అప్పగించాలని లేదంటే నాశనం చేయాలని ఆయన అంతకుముందు చెప్పారు. అయితే, తాజా చర్చల్లో దీనిపై ట్రంప్ కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్‌లోనే ఉంచేందుకు ఆయన అంగీకరించినట్లు సమాచారం. అయితే, అది ఐరాస ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలోనే ఉండాలని మెలిక పెట్టారట. ఇక, అణు కార్యక్రమాలపై టెహ్రాన్ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా.. అది అమెరికాతో రెండో డీల్ కుదిరిన తర్వాతేనని ట్రంప్ షరతు విధించినట్లు తెలుస్తోంది. తాజా అవగాహన ఒప్పందంలో భాగంగా 30 రోజుల్లోపు హార్మూజ్ జలసంధిని ఎలాంటి టోల్ రుసుములు లేకుండా నౌకల రవాణాకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా.. అమెరికా ఈ జలమార్గంలో నిర్బంధాన్ని ఎత్తివేయనుంది. ఇక, హార్మూజ్‌ను తెరిచిన తర్వాత 60 రోజులపాటు ఇరాన్‌కు అగ్రరాజ్యం ఆంక్షల మినహాయింపు కల్పించనుందని తెలుస్తోంది.

# ముగిసిన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ

## 12,758 చోట్ల గ్రామ సభలు, 3,175 వార్డు సభలు విజయవంతం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయ ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 12:** తెలంగాణలో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రభుత్వ కార్యాచరణ విజయ వంతంగా అమలైంది. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు అన్ని విభాగాలు.. వివిధ థీమ్‌లతో చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో పరిపాలనను ప్రజల దగ్గరకు తీసుకెళ్లేలా నిర్వహించిన కార్యక్రమాలన్నీ విజయ వంతమయ్యాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యా లయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదలైంది. గ్రామ స్థాయిలో 12,760 గ్రామ పంచాయతీల్లో 12,758 చోట్ల గ్రామ సభలు, 3,288 మున్సిపల్ వార్డుల్లో 3,175 వార్డు సభలు జరిగాయి. మొత్తం 15,76,219 మంది పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,10,414 మంది, జిల్లా స్థాయిలో 32 జిల్లాల్లో 37,294 మంది పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో 32,451 మంది లబ్ధిదారులకు ఆస్తుల మంజూరు జరిగింది. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కా రంలో భాగంగా 12,700 గ్రామ పంచాయతీలు, 135 పట్టణ స్థానిక సంస్థల్లో కార్యక్రమాలు జరి గాయి. 21 లక్షల మంది ఇందులో భాగస్వాము లయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,06,598 పెండింగ్ ప్రభుత్వ ఫైళ్లను పరిష్కరించారు. 4551 టన్నుల ఘన వ్యర్థాలను సేకరించి క్లీనింగ్ నిర్వహించారు. 12,303 ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఆరోగ్య వారంలో ప్రజారోగ్యం, వ్యాధి నిరోధక అవగాహన, మాతా శిశు ఆరోగ్యం, హెచ్‌ఐవీ నివారణ, ఆయుష్, డ్రగ్స్ నియంత్రణ అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు జరి గాయి. నిమ్స్‌లో రూ.30 కోట్ల లినాక్ సదుపాయం, ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య సంస్థలో రూ.24 కోట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బ్లాక్ ప్రారంభమైంది. నాగర్‌కర్నూల్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్, తెల్కపల్లి పిహెచ్‌సీ వంటి వైద్య మౌలిక సదుపాయాలు కల్పించారు. 755 వైద్య సిబ్బందికి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. రోడ్డు భద్రత–అరైవ్ అలైవ్ కార్యక్రమంలో 4,512 గ్రామ రహదారి భద్రత కమిటీలు ఏర్పాటు చేశారు. 1,39,729 మంది అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 393 ప్రమాదకర జంక్షన్లు, 548 బ్లాక్‌స్పాట్లు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టారు. 519 కంటి పరీక్షా శిబిరాల్లో 16,079 డ్రైవర్లను పరీక్షిం చగా 4,863 మందికి దృష్టి సమస్యలు గుర్తించారు. గోల్డెన్ అవర్, హెల్మెట్, సీట్‌బెల్ట్, మద్యం సేవించి డ్రైవింగ్ నివారణపై విస్తృత ప్రచారం జరిగింది. సంక్షేమ వారంలో 1,574 సంక్షేమ వసతి గృహాల్లో తనిఖీలు జరిగాయి. హాస్టళ్లలో వసతులు, పరిశుభ్రత, భద్రతపై సమీక్షిం చారు. 9,275 నిరుద్యోగ యువతను నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు అనుసంధానించారు. 159 సమ్మర్ క్యాంపుల ద్వారా 24,415 విద్యార్థులకు క్రీడలు, యోగా, కళలు, డిజిటల్ లిటరసీ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. బడి బాట కార్య క్రమం ద్వారా బడి బయట పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమాలు జరిగాయి. చైల్డ్ సేఫ్టీ, సే నో టు డ్రగ్స్ వారంలో షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ, భరోసా కేంద్రాల ద్వారా 1,702 అవగాహన సదస్సులు నిర్వహించారు. 1,55,600 మందికి పైగా ఇందులో పాలు పంచుకున్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, సైబర్ భద్రత, డ్రగ్స్ దుష్ప్రభావాలు, 100, 112, 1098, 181, 1930 హెల్ప్ లైన్లపై అవగాహన కల్పించారు. 10-18 ఏళ్ల పిల్లలకు స్థానిక సమస్యలపై మాట్లాడే అవకాశం కల్పించే బాల్ పంచాయత్ కార్య క్రమం ప్రారంభించారు. రైతు వారంలో వ్యవసాయం, ఉద్యానవనం, మార్కెటింగ్, సహకార, బ్యాంకులు, పశుసంవర్థక, మత్స్య, సాగునీటి శాఖలు కలిసి కార్యక్రమాలు చేపట్టాయి. మట్టి ఆరోగ్యం, సహజ వ్యవసాయం, పంటల వైవిధ్యం, డ్రోన్ వినియోగం, సోలార్ పంపులు, ఆయిల్‌పామ్, ఎఫ్‌పీఓలు, రుణ మేళాలపై రైతులకు అవగాహన కల్పించారు. 95 నియోజకవర్గాల్లో 76,024 మంది రైతులకు మైక్రో ఇరిగేషన్ సబ్సిడీలపై వివరించారు. 32,818 మంది రైతులు రుణ మేళాల్లో పాల్గొన్నారు. హన్మకొండలో మెగా రైతు మేళా జరిగింది. టీజీ ఆర్గానిక్స్ యాప్, నిగ్రాని సమితులు, కోఆపరేటివ్ క్లబ్‌లు ప్రారంభమయ్యాయి. యువజన–క్రీడల వారంలో ఫిట్‌నెస్, నాయకత్వం, ఉపాధి, సాంస్కృతిక చైతన్యంపై రాష్ట్రవ్యాప్తంగా కార్య క్రమాలు జరిగాయి. 5కే మారథాన్, యోగా, జుంబా సెషన్లు, యూత్ పార్లమెంట్‌లు, పర్యాటక క్లబ్‌లు, పరిశుభ్రత డ్రైవ్‌లు, జాబ్ మేళాలు నిర్వహించారు. ఉపాధి పొందిన యువతకు నియామక పత్రాలు, క్రీడా విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. మహిళా వారంలో మహిళా సాధికారత, పోషణ, మాతా శిశు ఆరోగ్యం, జీవనోపాధి, ఎస్‌హెచ్‌జీల బలోపేతానికి పలు కార్యక్రమాలు చేపట్టారు. రూ. 6 కోట్లతో నిర్మించిన 50 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభ మయ్యాయి. 27 అంగన్‌వాడీ భవనాలు, 7,292 గ్రామాల్లో స్త్రీ శక్తి భవనాలు, 131 ఫుడ్ గ్రెయిన్ గోదాములు, 577 లైవ్లీ హుడ్ వర్క్ షెడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు జరిగాయి.



# ఖజానా ఆదాయం పెంచాలి

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

### ల్యాండ్ పూలింగ్‌పై ప్రత్యేక దృష్టి

### డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి, ఆదాయ వనరుల పెంపునకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సూచిం చారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం విక్రమార్క అధ్యక్షతన దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి సభ్యులుగా కలిగిన రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో సమీక్షించింది. రాష్ట్రంలో భూముల మోనిటైజేషన్, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ వేగవంతం, హైదరాబాద్ నగర అభివృద్ధి సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూసంపదను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి (మోనిటైజేషన్) అధికారులు సిద్ధం చేసిన సమగ్ర ప్రణాళికపై ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. హైదరాబాద్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టును వేగవంతం చేయడంపై సబ్ కమిటీ ప్రత్యేకంగా చర్చించింది. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన పన్ను ఆదాయాన్ని గరిష్టంగా రాబట్టేందుకు కమర్షియల్ ట్యాక్సెస్ శాఖ అమలు తీరును, ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. జాతీయ స్థాయిలో కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ ఫిట్‌మెంట్ కమిటీలో తెలంగాణకు ఖచ్చితంగా ప్రాతినిధ్యం దక్కేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలను మరింత సమర్థవంతంగా కాపాడుకోవచ్చున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లలో ఉత్తరప్రదేశ్, హర్యానాల తర్వాత తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని, గత ఆరు నెలల్లో తీసుకున్న పటిష్ట చర్యల వల్ల జీఎస్టీ రిటర్న్ ఫైలింగ్ పెరిగిందని వెల్లడించారు. అలాగే రాష్ట్ర ఆదాయంలో కీలకమైన ఎక్సైజ్ శాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని సూచిం చారు. ఇందుకోసం తక్షణమే ఒక స్పష్టమైన, పక్కా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. అలాగే అసైన్డ్ భూములపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా ఉన్న ప్రభుత్వ భూ సంపదను గుర్తించేందుకు తక్షణమే జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఉప్పల్ భగాయత్ ప్రాజెక్ట్ విజయవంతం కాగా, మోకిలా, బుద్వేల్‌లలోనూ మంచి ఫలితాలు వచ్చాయని, ప్రస్తుతం మరో మూడు కొత్త ప్రాజెక్టులు పరిశీలనలో ఉన్నా యన్నారు. పారదర్శక విధానాలను అవలంబిస్తూ, నగర పరిధిలో మరిన్ని ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టడానికి గల అవకాశాలను తక్షణమే గుర్తిం చాలని స్పష్టం చేశారు. హెచ్‌ఐఎల్‌టి కింద జారీ చేయాల్సిన నోటిఫికేషన్లకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పూర్తి స్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజల్లో, పారిశ్రామిక వర్గాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

# వ్యవసాయ కార్పొరేషన్ల ప్రక్షాళన

## ఒకే గొడుగు కిందకు తెచ్చే ఆలోచన

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ కార్పొరేషన్ల అన్నింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే వ్యవసాయ శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఈ జాబితాలో ఆగ్రోస్, హాకా, హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడ్ కార్పొ రేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్ ఉన్నట్టుగా సమాచారం. కాగా వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై రాష్ట్ర సర్కార్ తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. కొన్ని కార్పొరేషన్లతో రాష్ట్ర ఖజానాకు నయా పైసా లాభం లేదని, దే సమయంలో రైతులకు కూడా పెద్దగా ఉపయోగపడినా దాఖలాలు లేవనే అభిప్రాయంలో ఉంది. మరీ ముఖ్యంగా ఆగ్రోస్, హాకా, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్ల పనితీరుపై ప్రభుత్వం సంతృప్తికరంగా లేదు. ఈ సంస్థలు అవినీతికి అడ్డాలుగా మారుతున్నాయనే అభిప్రాయమూ ప్రభుత్వంలో ఉన్నట్టు సమాచారం. దీంతోనే ఆయా సంస్థలను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతోంది. ఆయా సంస్థల లాభనష్టాలు, వాటి లావాదేవీల నిర్వహణ తదితర వాటిని పరిశీలిస్తోంది. ఒకవేళ వీటిని మూసివేస్తే వాటి పరిధిలో చేపట్టే పనులను ఏ కార్పొరేషన్లకు అప్పగించాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. మరోపక్క ఈ ఆ ఆరు కార్పొరేషన్లు ఒక్కోటి ఒక్కో చట్టం ప్రకారం ఏర్పడ్డాయి. దీనికి తోడు ఇప్పటికే వీటిలో కొన్నింటికి చైర్మన్లను కూడా నియమించారు. ఈ నేపథ్యంలో వీటి మూసివేత అంత సులువు కాదనే పలువురు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడైంది. వ్యసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై వ్యవసాయ శాఖ మంత్రి తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. కొన్ని కార్పొరేషన్లతో ప్రభుత్వానికి నయా పైసా లాభం లేదనే అభిప్రాయం ఆయనలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఆయన తొలి నుంచి వ్యవసాయ శాఖ పరిధిలో ఇన్ని కార్పొరేషన్లు అవసరమా అంటూ ప్రతి సమావేశంలోనూ బహిరంగంగానే ప్రశ్నిస్తూ వస్తున్నారు. ఒకే రకమైన పనిని వివిధ కార్పొరేషన్లు చేయడంపైనా ఆయన అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. దీనికి తగినట్లుగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఏ కార్పొరేషన్ కూడా సరిగ్గా పని చేయడం లేదని గుర్తించారు. మరీ ముఖ్యంగా ఆగ్రోస్, హాకా, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్‌పై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. పనితీరు మార్చుకోవాలని ఆయా సంస్థలకు మంత్రి పలుమార్లు హెచ్చరించారని, అయినా సదరు సంస్థలు మారకపోవడంతో మంత్రి ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. ఈ సంస్థలు అవినీతికి అడ్డాలుగా మారుతున్నాయనే అభిప్రాయమూ ప్రభుత్వంలో ఉన్నట్టు తెలిసింది. దీంతోనే ఆయా సంస్థలను ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

# ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

## పాఠశాల విద్యా అడిషనల్ డైరెక్టర్‌కు ఎఐఎస్‌ఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశా లల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను అరికట్టాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొచ్చి అమలు చేయాలని పాఠశాల విద్యా అడిషనల్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డిని సంఘం నేతలు శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణి కంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 15 నుండి పాఠ శాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠ శాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం అమలులో ఇబ్బం దులు లేకుండా చూడాలన్నారు. అనుమతులేని పాఠశాలలను గుర్తించి వాటి పేర్లు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

# సిఐడిలో ఎఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్ ప్రారంభం



సిఐడిలో ఎఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డిజిపి ఆనంద్. చిత్రంలో సిఐడి డిజి చారుసిన్హా తదితరులు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్ర సిఐడిలో కొత్తగా ఎఐ ఆధారిత అధునాతన కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్‌ను డిజిపి ఆనంద్ శుక్రవారం ప్రారంభించారు. సిఐడి కార్యాల యంలో ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆనంద్ మాట్లాడుతూ టెక్నాలజి అభివృద్ధి చెందుతు న్న తరుణంలో నేరాల స్వరూపం కూడా వేగంగా మారుతు న్నందున పోలీసు శాఖ ఆ దిశగా మరింత అభివృద్ధి చెందా ల్సిన అవసరం వుందని అన్నారు. నేర నియం త్రణ, విచారణ, సైబర్ నేరాల ఛేదన, డేటా విశ్లేషణ వంటి అంశాలలో టెక్నాలజీ కీలకంగా వుం టుందని అన్నారు. ఈ నేపథ్యంలో సిఐడిలో కొత్తగా ఏర్పాటైన ఎఐ ఆధారిత స్మార్ట్ క్రైం ఆనాలిటిక్స్, డేటా మేనేజ్ మెంట్, స్మార్ట్ కాన్ఫరెన్స్ సదుపాయా లతో వున్న అధునాతన ల్యాబ్ నేర పరిశోధనలో కొత్త ఒరవ డికి నాంది పలుకుతుందని డిజిజి అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర పోలీసు శాఖ టెక్నాలజిని వాడ డంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఈ క్రమంలో అనేక ఆవి ష్కరణలు అందుబాటులో వచ్చాయని ఆయన తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ ఫోరెన్సిక్ విచారణ, డేటా ఆధారిత పోలీసింగ్, క్రైం అనాలిటిక్స్ విభాగాల్లో రాష్ట్ర పోలీసు శాఖ ఎంతో పురోగతిని సాధి ంచిందని డిజిపి తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు పోలీసు శాఖ ఎల్లవేళలా ముందుంటుందని ఆయన తెలిపారు. ఇటీ వల ఏర్పాటు చేసిన టి. స్పార్క్‌తో పాటు కొత్త సాంకేతిక ఆవిష్కరణలు పోలీసులకు ఎంతో మేలు చేశాయని డిజిపి వెల్లడించారు. సిఐడిలో కొ త్తగా ఏర్పాటు చేసిన ఎఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్‌లో అనేక సదుపాయాలు వున్నాయని, దీని ఎదురుగా నిలబడి మాట్లాడే వ్యక్తి ఆడియో, వీడియోను అన్ని కోణాల్లో రికార్డు చేస్తుందని ఆయన అన్నారు. దీంతో పాటు షీ సైబర్ ల్యాబ్ మహిళా బాధితులకు మేలు చేస్తుంద ని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐడి డిజి చారుసిన్హా, డిఐజిలు నారాయణ్ నాయక్, నవీన్ కుమార్, పరిమళా హన్నా నూతన్, ఎస్పీలు ప్రసా ద్, మద్దిపాటి శ్రీనివాస్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాధనం దోచుకోవడం మీ నైజం

## ఫామ్‌హౌస్‌లు కట్టుకొని పేదల సంక్షేమాన్ని విస్మరించారు

## హరీశ్‌రావు ఆరోపణలు అవాస్తవం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు సదుపాయాల కల్పన కోసం చేపట్టిన కొనుగోలు ప్రక్రియపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత హరీశ్ రావు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ దురుద్దే శంతో కూడుకున్నవని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. హరీష్ రావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి విలేక రుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ టెండర్ విలువనే రూ.687.78 కోట్లని మరి రూ.2,000 కోట్ల కుంభకోణం అనే అంకె ఎక్కడి నుంచి వచ్చిందో హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం రాజ కీయ దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. ఆధారాలు ఉంటే విచారణ సంస్థలకు ఇవ్వాల న్నారు. టెండర్ ప్రక్రియ పూర్తిగా ఇ-ప్రొక్యూ ర్‌మెంట్ పోర్టల్ ద్వారా జాతీయ స్థాయి పోటీ టెండర్ల ద్వారా నిర్వహించబడిందని, దేశవ్యాప్తంగా 27 బిడ్లు వచ్చాయని, టెక్నికల్ అర్హతలు, ఫైనాన్షియల్ బిడ్ల పరిశీలన అనంతరం ఎల్1 విధానంలో టెండర్లు ఖరారు చేశామని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. ఏ ఒక్క సంస్థకూ నామినేషన్ పద్ధతిలో పని ఇవ్వలేదన్నారు. గుజరాత్ కాంట్రాక్టర్ కథలు పూర్తిగా కల్పితమని, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ సహా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంస్థలు పోటీపడి టెండర్లు దక్కించుకున్నాయన్నారు. టెండర్ దక్కించుకున్న వాటిలో గుజరాత్ కంపెనీ లేదన్నారు. హైకోర్టు సైతం కేంద్రీకృత కొనుగోలు విధానంపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదనానరు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లిడ్‌క్యాప్‌కు కేవలం రూ.40.21 లక్షల విలువైన పనులే ఇచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండేళ్లలో రూ 51 కోట్ల రూపా యల వర్క్ ఆర్డర్‌ను లిడ్‌క్యాప్‌కిచ్చామన్నారు. నోటుబుక్‌ల సరఫరాను తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు అప్పగించామన్నారు. 14 వేల మంది మహిళా టైలర్లకు యూనిఫాం కుట్టు పనులు కల్పించి ఉపాధి అవకాశాలు కల్పిం చామని, 27 లక్షల మంది విద్యార్థులకు తొలిసారి సమగ్ర సదుపాయాలు కల్పిస్తున్నామని మంత్రులు తెలిపారు. పదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ఎన్ని కొత్త హాస్టళ్లు నిర్మించారని, డైట్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని మంత్రి బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజా రుద్దీన్ మాట్లాడుతూ.. రూ.687.78 కోట్ల టెండ ర్‌ను రూ.2,000 కోట్ల కుంభకోణంగా చిత్రీక రించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్న మన్నారు. కేంద్రీకృత కొనుగోలు విధానం వల్ల నాణ్యత, పారదర్శకత, సమయానికి సరఫరా సాధ్యమవుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుందన్నారు. హరీష్ రావు వద్ద ఆధారాలు ఉంటే బయట పెట్టాలని మంత్రి అజారుద్దీన్ సవాల్ విసిరారు.



# సర్‌పై ఓటర్లలో చైతన్యం కలిగించండి

## ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణతో ఎవరు కూడా తమ ఓటుహక్కు కోల్పోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దీనికి కాంగ్రెస్ కార్యకర్తలు కూడా చొరవ తీసుకోవాలని ఎఐసిసి ప్రధాన కార్య దర్శి ప్రియాంకగాంధీ అన్నారు. ఢిల్లీలో శుక్రవారం ఎఐసిసి ప్రధాన కార్య దర్శి ప్రియాంకగాంధీతో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశ మయ్యారు. రాష్ట్ర రాజకీయాలు, తాజా పరిస్థితులపై ఆ ఇద్దరు చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా బిఎల్‌ఎలను నియామకం చేసి వారికి సర్‌పై పూర్తి అవగాహన ఏర్పడేలా శిక్షణ ఇస్తున్నామని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

# నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ ప్రసంగం అద్భుతం

## క్రిమినల్ కేసులు లేకపోయినా తిరస్కరణ

## అప్రజాస్వామికం : ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** కులాల గోడలను బద్దలు కొట్టాలంటే విద్య వికాసమే చాలా కీలకమని అందుకోసం తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రతి నియోజక వర్గంలో నిర్మాణం చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో మాట్లాడిన తీరు అభినందనీయమని ఎంపి మల్లు రవి ఒక ప్రకనటలో హర్షం వ్యక్తంచేశారు. విద్యతోనే సామాజిక చైతన్యం వస్తుందని సామాజిక న్యాయం జరగాలంటే విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని సిఎం దేశానికి దిశా నిర్దేశం చేయడం స్వాగతించాల్సిన అంశమని తెలిపారు.తెలంగాణ లో చేపట్టిన సామాజిక కుల సర్వే లో విద్యతోనే వికాసమని తెలినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్ సమావేశంలో మాట్లాడారు, ఇది ఒక సామాజిక విప్లవానికి పునాదిగా చూడాలి, దేశం మొత్తం కులాల గోడలు బద్దలు కొట్టాలంటే విద్య వికాసం అవసరం అని చెప్పడం చాలా గొప్ప విషయమని వివరించారు.

# నిఘా నీడలో గిరిజన గురుకులాలు

## రాష్ట్రవ్యాప్తంగా 1,960 సిసి కెమెరాల ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకులు నిఘా నీడలో పనిచేయనున్నాయి. ఫుడ్ పాయిజన్ నుండి విద్యార్థుల భద్రత వరకూ సర్కార్ వాటి పనితీరును పర్యవేక్షించేందుకు అన్ని గురుకులాల్లో అధునాతన సిసి కెమెరాలను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు సురక్షి1తమైన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 155 గిరిజన సంక్షేమ గురుకులాలు ఉండగా, వీటిల్లో 1,960 సిసి కెమెరాలను ఏర్పాటు చేసింది. క్యాంపస్‌లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రతి కదలికనూ నిశితంగా గమనించేందుకు ఈ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. సంక్షేమ గురుకులాల ప్రవేశ ద్వారాలు, హాస్టల్ గదుల కారిడార్లు, డైనింగ్ హాల్స్, ప్లే గ్రౌండ్స్ వంటి ప్రాంతాలన్నీ ఇప్పుడు నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయి. ఒక వేళా సిబ్బంది సమయపాలన పాటించకపోయినా, అపరిశుభ్రత వాతావరణం తదితర అన్ని అంశాలు వెంటనే హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించడంతో పాటు, వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. వంటగదిలోని పరిస్థితులను పరిశీలిస్తూ అపరిశుభ్రంగా ఉన్నట్లయితే వెంటనే సదరు ప్రిన్సిపల్‌కు సమాచారం అందిస్తారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో క్యాంపస్లలో క్రమశిక్షణ మరింత మెరుగుపడుతుందని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు తమ పిల్లలు క్షేమంగా ఉన్నారనే నమ్మకం తల్లిదండ్రుల్లో కలుగుతోంది. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు లేదా విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించాల్సి వచ్చినప్పుడు, ఈ కెమెరాల ద్వారా అధికారులు సకాలంలో స్పందించి, తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భద్రతకు భరోసా లభించడం వల్ల విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా కేవలం చదువుపైనే దృష్టి పెట్టే అవకాశం ఏర్పడింది. అధునాతన సాంకేతికతను జోడించి, గురుకులాల్లో విద్యా ప్రమాణాలతో పాటు భద్రతను సైతం పెంచే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



# ప్రైవేటు కేసు సాకుతో నామిషన్ తిరస్కరణ

## ప్రజాస్వామిక హక్కు కాలరాయడమే

## ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ప్రైవేట్ కేసు సాకుతో నామినేషన్ తిరస్కరించడం పౌరుల హక్కులను కాలరాయడమేననీ, బిజెపి బిఆర్‌ఎస్ ముందస్తు ప్లాన్‌లో భాగంగానే ఇదంత చేశారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదే శాల మేరకు, మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన్ నామి నేషన్ తిరస్కరణకు నిరసనగా మహిళా కాంగ్రెస్ నాయకులు శుక్ర వారం గాంధీభవన్‌లో సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బిజెపి దేశంలో ఓటు చోరీతో పాటు, సీటు చోరీకి పడుతోందనీ ఆరోపించారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో గెలవలేక ఎన్నికల విధానా లను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడ్డాయని ఆరోపించారు. ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ మాట్లా డుతూ మహిళా సాధికారత పేరుతో 'బేటీ బచావో – బేటీ పడావో' నినా దాలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, ఆచరణలో మాత్రం మహిళల పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి బలమైన ఆధారాలు లేని పాత కేసును సాకుగా చూపించి రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు.

# తొలకరిని చూసి నాట్లు వేయొద్దు

## మూడు వర్షాలు పడిన తర్వాతే సాగు

## రైతులను అప్రమత్తం చేసిన ఉద్యాన శాఖ

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈ వానకాలం వర్షాభావ పరిస్థితులు ఉంటాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన శాఖలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే రైతులు ఇప్పటికే విత్తనాలు, యూరియా అందుబాటులో ఉంచి వరుణుడి కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమంది రైతులు తొలకరి జల్లులకే పత్తి విత్తనాలు వేస్తున్నారు. అయితే తొలకరి జల్లులను చూసి పంటలు వేయద్దని రెండు, మూడు వర్షాలు పడిన తరువాతే సాగు చేయాలని ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో నీటి వినియోగం తక్కువ ఉన్న పంటలు సాగు చేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడి సాధించి వచ్చని చెబుతున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతం మాత్రమే ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో వర్షపాతంలో అసమానంగా, హెచ్చుతగ్గులు ఉండే చాన్స్ ఉంది. తెలంగాణ మధ్య జిల్లాల్లో సాధారణం లేదా ఎక్కువ వర్షపాతం.. ఉత్తర, దక్షిణ జిల్లాలలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం కనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో రైతులు సాగు నష్టాలను తగ్గించుకోవడానికి, పంటల సాగు కొనసాగించడానికి ప్రత్యామ్నాయ పంట నిర్వహణ వ్యూహాలు అత్యవసరమని ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

ఇదే సమయంలో రైతులు 60 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే నేలలో విత్తనం వేయాలని పలు సూచనలు చేశారు. నీటి సంరక్షణ కోసం ఎత్తైన బెడ్లు, మల్చింగ్, పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్, ఫర్టిగేషన్ పద్ధతులు ఉపయోగించి వృధాను అరికట్టడంతో పాటు, నీటి వినియోగ సామర్థ్యం పెంచాలన్నారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో స్వల్ప కాలిక రకాలు నీటి ఎద్దడిని తట్టుకునే కూరగాయలు సాగు చేసుకోవాలని చెప్పారు. టమోటా (అర్క వికాస్, అర్క రక్షక్), వంకాయ (శ్యామల, భాగ్యమతి), మిర్చి (తేజ, ఎల్సీఏ 334), బెండకాయ (అర్క అనామికా, లలిమా), మునగ (పీకేఎం1, పీకేఎం 2), క్లస్టర్ బీన్ (పూసా నవభార్), బొబ్బర్లు (అర్క గరిమా), పందిరి కూరగాయల్లో (కాకర, బీర, సొర, దోస), పాలకూర (ఆల్ గ్రీన్, అర్క అనుపమా) వంటి రకాల పంటలు అనుకూలమని వివరించారు. పశువుల ఎరువు, వెర్మికంపోస్ట్, వేప చెక్కలు వంటి సేంద్రియ ఎరువులు వాడి నేల తేమను నిల్వ చేయాలని, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా పురుగులు, శిలీంద్రాలను నియంత్రించాలని తెలిపారు. సాధ్యమైన ప్రతి చోట ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. అలాగే ఆయిల్ పామ్ పంటల్లో మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, మేలైన నీటి యాజమాన్యం పద్ధతులు అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. మిర్చి, పసుపు, ధనియాలు వంటి పంటల్లో నీటి ఎద్దడిని తట్టుకునే రకాల వాడాలని తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యా లయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డి సూచించారు.

## ఖర్చులు పెరుగుతున్నాయ్.. హైదరాబాద్ మారేందుకు అనుమతివ్వండి

### ముంబయి కోర్టులో వరవరరావు పిటిషన్



**ముంబయి, జూన్ 12:** భీమా కోరేగావ్‌ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడైన ప్రముఖ విప్లవ కవి, 85 ఏళ్ల వరవరరావు దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. తన నివాసాన్ని ముంబై నుంచి హైదరాబాద్‌కు మార్చుకునేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశిస్తూ న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అజయ్ గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ముంబైలో నివాసం ఉండటం ఆర్థికంగా పెనుభారంగా మారిందని, వృద్ధాప్యంలో ఇక్కడి జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నానని వరవరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన నెలవారీ పింఛను సుమారు రూ. 50 వేలు ఉండగా, ముంబైలో జీవన వ్యయం రూ. 77,000 దాటుతోందని, ఇది తనకు భారంగా మారిందని ఆయన వివరించారు. భీమా కోరేగావ్ కేసులో బెయిల్ పొందిన వరవరరావు, కోర్టు అనుమతి లేకుండా గ్రేటర్ ముంబై పరిధిని దాటి వెళ్లరాదన్న షరతుపై ప్రస్తుతం అక్కడే నివసిస్తున్నారు. ఇదే అభ్యర్థనతో ఆయన గతంలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది మార్చి 16న ఆ పిటిషన్ తిరస్కరణకు గురైంది. సుప్రీంకోర్టు విధించిన బెయిల్ షరతులను సవరించే అధికారం తమకు లేదని ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది.

## రేవంత్‌రెడ్డికే ఫ్యూచర్ లేదు.. ఇంకా ఫ్యూచర్ సిటీ ఏమిటి?

### ఎవరితోనూ పొత్తులుండవ్.. పోటీ బిజెపితోనే : కెటిఆర్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, బజూన్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు.



మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారని, రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' (పార్టీ ద్రోహులు) ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్‌అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏమిటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఏమిటని ప్రశ్నించారు. గతంలో 50 ఏళ్ల పాలించిన కాంగ్రెస్ పార్టీ నగరాన్ని అద్దంలా అప్పగిస్తే మేం చెడగొట్టామా? అని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ హయాంలో నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డిపి) చేపట్టి మెరుగు చేస్తే రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశారు. నీళ్లు నిలవకపోతే క్రెడిట్ తీసుకుంటారు. నిలిస్తే బిఆర్ఎస్‌ది బాధ్యత అంటారా? అని ప్రశ్నించారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు.

# అఖండ కాంగ్రెస్‌గా మారేందుకు అనుకూలిస్తున్న పరిణామాలు

### టిఎంసితోపాటు, శరద్‌పవార్ ఎన్సీపి కూడా వస్తోందని ప్రచారం

**న్యూఢిల్లీ, జూన్ 12:** దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలించేటట్లు కనిపిస్తున్నాయి. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓటమి, టీఎంసీలో అంతర్గత సంక్షోభాలను కాంగ్రెస్ సొమ్ము చేసుకుంటోంది. మమతా పార్టీ రెండు ముక్కలుగా చీలింది. ఎమ్మెల్యేలు, ఎంపీల్లో స్పష్టమైన విభజన కనిపిస్తోంది. మమత కేవలం తక్కువ మంది మద్దతు కలిగి ఉంది. ఈ నేపథ్యంలో ఆమె తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తుందనే వార్తలు వస్తున్నాయి. మమతా బెనర్జీ లాగే ఎన్సీపీ(శరద్ పవార్) కూడా తన పార్టీని కాంగ్రెస్‌లోనే విలీనం చేసే అవకాశాలు ఉన్నాయంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మమతా బెనర్జీ, శరద్ పవార్ ఇద్దరూ కూడా కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లి సొంతగా పార్టీలు పెట్టుకున్న వారే. ఇప్పుడు తమ మాతృపార్టీలోనే తమ పార్టీలను విలీనం చేస్తారనే ప్రచారం నడుస్తోంది. ఇదే నిజమైతే అఖండ కాంగ్రెస్ సాధ్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ విలీనం వార్తల్ని టీఎంసీ, కాంగ్రెస్ తోసిపుచ్చాయి. అయినప్పటికీ ప్రచారం మాత్రం ఆగడం లేదు. ఇప్పటికే కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాలు ఈ వార్తల్ని ఖండించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీశాయి. ఒకే భావజాలం కలిగిన పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం కావడానికి సిద్ధమవుతున్నాయని, శరద్ పవార్, మమతా బెనర్జీ కూడా కాంగ్రెస్‌లో విలీనం గురించి ఆలోచిస్తున్నారని నానా పటోలే వ్యాఖ్యానించారు.

ఇది కేవలం పొత్తు మాత్రమే కాదని, పూర్తిస్థాయి విలీనం కావొచ్చని అన్నారు. శరద్ పవార్ విలీనానికి సంబంధించిన ప్రతిపాదనల్ని కాంగ్రెస్‌కు పంపారని, కొన్ని కారణాల వల్ల అది ఆలస్యమైందని చెప్పారు. దేశంలో ఓట్ల చీలిక అడ్డుకోవాలంటే లౌకిక, ప్రజాస్వామ్య భావజాలం కలిగిన శక్తుల్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఇటీవల శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. కాంగ్రెస్ నుంచి విడిపోయిన పార్టీలు తిరిగి కాంగ్రెస్‌లో విలీనం కావాలని, ఆ ప్రక్రియకు శరద్ పవార్ నాయకత్వం వహించాలని సూచించారు. ఈ వ్యాఖ్యల్ని శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే ఖండించకుండా ముందుగా వర్షం పడనివ్వండి గొడుగు తీసుకోవాలా, రెయిన్ కోట్ వేసుకోవాలా అనేది చూద్దాం అంటూ ఆసక్తికర వ్యాక్యలు చేశారు. రాజస్థాన్ మాజీ సీఎం, కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలన్నీ కూడా తిరిగి కాంగ్రెస్‌లో చేరాలని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అన్ని ప్రతిపక్ష పార్టీలు అంగీకరిస్తే దేశ రాజకీయాల్లో కీలక మార్పు వస్తుందని అన్నారు.



రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీ, సోనియా గాంధీ మమతా బెనర్జీల మధ్య వరస భేటీల తర్వాత ఈ విలీనం వార్తలు బయటకు వచ్చాయి. ఈ వార్తలపై కాంగ్రెస్ అంతర్గత వర్గాలు మాట్లాడుతూ విలీన ప్రతిపాదన కాంగ్రెస్ నుంచి కాకుండా టీఎంసీ, ఇతర పార్టీల నుంచే రావాలని, కాంగ్రెస్ ఎలాంటి ఒత్తిడి చేయడని చెబుతున్నాయి.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో డ్రగ్స్ ఫ్యాక్టరీ గుట్టురట్టు

### రూ. 50 లక్షల విలువైన మెఫెడ్రోన్, యంత్రాలు స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలో అత్యంత రహస్యంగా సాగుతున్న డ్రగ్స్ తయారీ కేంద్రంపై శుక్రవారం తెలంగాణ నార్కోటిక్స్ పోలీస్ విభాగం ఖిఈగల్ ఫోర్స్ఖి మెరుపు దాడి చేసింది. దశాబ్దాలుగా పోలీసుల కళ్లుగప్పి, అంతర్జాతీయ ముఠాతో కలిసి డ్రగ్స్ సామ్రాజ్యాన్ని ఏలుతున్న ఒక మోస్ట్ వాంటెడ్ నేరస్థుడిని, అతడి అనుచరుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ. 50 లక్షల విలువైన 750 గ్రాముల మెఫెడ్రోన్ డ్రగ్‌తో పాటు, తయారీకి ఉపయోగించే మరో రూ. 50 లక్షల విలువైన యంత్రాలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు, ఎల్బీనగర్ క్లూస్ టీంతో కలిసి ఈగల్ ఫోర్స్ బృందాలు పక్కా సమాచారంతో ఈ దాడి నిర్వహించాయి. సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన ప్రధాన నిందితుడు కీసరి మత్స్యగిరి (38), యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన నిమ్మల నరేశ్ (38) కలిసి ఐ20 కారులో డ్రగ్స్ తరలిస్తుండగా, బాటసింగారం రోడ్డులోని శివాజీ మహారాజ్ విగ్రహం సమీపంలో పట్టుకున్నారు. పాత నేరస్తుడు: ప్రధాన నిందితుడు కీసరి మత్స్యగిరి 2015కు ముందు అబ్దుల్లాపూర్ మెట్‌లోని ఒక రసాయన పరిశ్రమలో కెమిస్ట్‌గా పనిచేశాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో గుజరాత్‌కు చెందిన విజయ్, సంతోష్ సింగ్ మురాలతో చేతులు కలిపి మెఫెడ్రోన్ తయారీలో శిక్షణ పొందాడు. 201617 మధ్యకాలంలో హైదరాబాద్, బరోడాల్లో పలు బంగారు దుకాణాల దోపిడీల్లో కూడా పాల్గొన్నాడు. 2019లో చంద్రశేఖర్ అనే వ్యక్తిని 6 గంటల పాటు చిత్రహింసలు పెట్టి హత్య చేసి, మృతదేహాన్ని కీసరలో పాతిపెట్టిన కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. కరోనా సమయంలో నష్టాలు రావడంతో మళ్లీ డ్రగ్స్ తయారీ వైపు మళ్లాడు. 2022లో రాంపల్లి, చెంగిచెర్లలో ల్యాబ్‌లు పెట్టి పోలీసులకు పట్టుబడి, పీడీ యాక్ట్ కింద జైలుకెళ్లి వచ్చాడు. బయటకు వచ్చిన తర్వాత మత్స్యగిరి తన పాత నేర ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, నరేశ్‌తో కలిసి అబ్దుల్లాపూర్ మెట్ మామిడి తోటలో రేకుల షెడ్డు వేసి, వాచ్‌మెన్‌కు నెలకు రూ. 10 వేలు ఆశ చూపి మళ్లీ మెఫెడ్రోన్ తయారు చేయడం మొదలుపెట్టాడు.

**ఈగల్ ఫోర్స్ విజ్ఞప్తి**

డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఈగల్ ఫోర్స్ అధికారులు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు యువతపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. మాదకద్రవ్యాల తయారీ, విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1908 కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని, తగిన బహుమతి కూడా అందజేస్తామని స్పష్టం చేశారు.

## భారత్ నౌకలపై దాడులు ఇరాన్ పనే..

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 12:** హర్మూజ్ జలసంధి నుంచి బయలుదేరుతున్న భారత నౌకలపై జరిగిన డ్రోన్ దాడిని అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. ఇరాన్ ఈ దాడులకు పాల్పడుతూ తమను బాధ్యులనుచేస్తోందని ఆరోపించారు. ఈ ఘటన పూర్తిగా ఆమోదయోగ్యం కదని అభివర్ణించిన ట్రంప్, దీనికి బాధ్యులైన వారు వెంటనే తమ వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. శాంతిచర్చలు సానుకూలం అవుతున్నదశలో ఇలాంటి దాడులు తగవని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో ట్రంప్ స్పందిస్తూ, హర్మూజ్ జలసంధి నుంచి బయలుదేరుతున్న భారత నౌకలపై నిన్న రాత్రి జరిగిన డ్రోన్ దాడి పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. వారు వెంటనే తమ వ్యవహారశైలిని సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలను ఆయన వెల్లడించలేదు. అలాగే ఏ నౌకలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారన్న విషయాన్ని కూడా స్పష్టం చేయలేదు. ఇదిలా ఉండగా, ఇటీవల అమెరికా సైనిక చర్యల నేపథ్యంలో భారతీయ సిబ్బంది ఉన్న మూడు చమురు ట్యాంకర్లు దాడులకు గురయ్యాయి. ఈనెల 8న 24 మంది భారతీయ నావికులతో ప్రయాణిస్తున్న మారివెక్స్ ట్యాంకర్‌ను అమెరికా బలగాలు నిర్వీర్యం చేశాయి. ఆ నౌకలోని సిబ్బందంతా సురక్షితంగా బమటకకు వచ్చారు. తర్వాత ఈనెల 10న 24 మంది భారతీయ నావికులతో ప్రయాణిస్తున్న సెట్టెబెల్లో ట్యాంకర్‌పై అమెరికా దాడి జరగగా, ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. మరోవైపు, 20 మంది భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న జల్వీర్ నౌక కూడా గురువారం దాడికి గురైనట్లు సమాచారం. ఈ ఘటనలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.



ఓమన్ తీర ప్రాంతంలో భారతీయ నావికులు ఉన్న వాణిజ్య నౌకలపై జరిగిన దాడుల నేపథ్యంలో, అమెరికా రాయబార కార్యాలయ బాధ్యుడు జాసన్ మీక్స్‌ను భారత విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. పౌర నౌకాయానంపై ప్రాణాంతక శక్తి వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో, వాణిజ్య నౌకలపై ప్రాణాంతక దాడుల విషయంలో తమ తీవ్ర ఆందోళనను అమెరికా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొంది

## పంటల విలువ పెరిగితేనే రాష్ట్రంలో సాగుకు భవిష్యత్

### వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త :** పంటల విలువ పెరిగితేనే రాష్ట్రంలో వ్యవసాయానికి భవిష్యత్ ఉంటుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. తెలంగాణలో రోబోటిక్స్, డ్రోన్లు, ప్రెసిషన్ అగ్రికల్చర్ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ 62వ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతూ ఇకపై కేవలం ఉత్పత్తి పెంపుపై కాకుండా పంటలకు విలువ పెంచడం, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులపై దృష్టి సారించాలని సూచించారు.

రైతు ఆదాయం పెరగాలంటే విలువ, మార్కెట్ ఆధారిత వ్యవసాయం వైపు అడుగులు వేయాలని చెప్పారు. అలాగే భవిష్యత్తులో కార్బన్ క్రెడిట్స్, బయో ఎకానమీ, క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చర్ వంటి రంగాలు రైతులకు కొత్త ఆదాయ వనరులుగా మారనున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణ కూడా రైతుకు ఆదాయ వనరుగా మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. తెలంగాణ వ్యవసాయం ఉత్పత్తి కేంద్రిత వ్యవసాయం నుంచి విలువ ఆధారిత, సాంకేతిక ఆధారిత, మార్కెట్ ఆధారిత వ్యవసాయంగా రూపాంతరం చెందాలని పేర్కొన్నారు. వేలాది మంది వ్యవసాయ పట్టభద్రులు, పరిశోధకులను తయారు చేసి వ్యవసాయ రంగానికి విశేష సేవలందించిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, వైస్ ఛాన్సలర్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయ విసి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల కుమార్తెతో కలిసి భవనం పైనుంచి దూకి తల్లి ఆత్మహత్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 12:** మహిళ ఆరు నెలల చిన్నారితో కలిసి ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరంలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మప్రకారం.. ఈషా సాహు(37) అనే మహిళ ఆరు నెలల కుమార్తెను తీసుకుని అపార్ట్ మెంట్ ఆరో అంతస్తు నుంచి కిందకి దూకింది. దీంతో మహిళ సంఘటన స్థలంలోనే మృతి చెందింది. చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు ప్రారంభించారు. రెండో బిడ్డకు జన్మించిన తర్వాత ఈషా తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు పోలీసులు గుర్తించారు.

## స్కూల్ యూనిఫామ్ రంగు మార్పు

### ఇకపై లేత నీలం, నేవీబ్లూ రంగులతో యూనిఫామ్

### ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు



**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితం పంపిణీ చేస్తున్న యూనిఫామ్ దుస్తుల రంగును మార్చింది. మారిన స్కూల్ యూనిఫామ్‌లు 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు చేయనున్నారు. పాఠశాల యూనిఫాం రంగుల పథకాన్ని సవరించినట్లు సెర్ప్ సీఈవోకి పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ లేఖ రాశారు. మారిన యూనిపామ్ ..అబ్బాయిల చొక్కా, అమ్మాయిల టాప్ లేత నీలం(లైట్ బ్లూ) రంగులో ఉండాలని, అబ్బాయిలు, అమ్మాయిలు ఇద్దరి యూనిఫాం కింది భాగాలు, అలాగే అమ్మాయిల కోటు ముదురు నీలం(నేవీ బ్లూ) రంగులో ఉండాలని సూచించారు. యూనిఫాం డిజైన్‌ను, నమూనా సెర్ప్ సీఈవోకి పంపిస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుండి సవరించిన యూనిఫాం రంగుల పథకాన్ని అమలు చేయాలని సూచించారు.

## ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

### ఆ తరువాతనే గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి

### ఆర్టీసీ సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ఆర్‌టీసీలోని అన్ని సంఘాలు సింగిల్ డిమాండ్‌గా ఆర్‌టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆ తరువాతనే ఆర్‌టీసీలో గుర్తింపు ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. శుక్రవారం ఆర్‌టీసీ జేఏసీ అత్యవసర సమావేశం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. కార్మిక సంఘాలకు ముందు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ముందుగా విలీనమే చేయాలని ఆర్‌టీసీ ఎండికి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి కన్వీనర్లు మౌలానా, కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, యాదగిరి అన్నారు. గతంలో ముఖ్యమంత్రి మే 1న స్వయంగా మాట్లాడుతూ ముందు విలీనం కావాలా? లేక ఎన్నికలు కావాలా? ఏది ముందు కావాలో కార్మిక సంఘాలు వ్రాసి ఇవ్వాలని ఆదేశించారని గుర్తు చేశారు. సీఎం సూచన మేరకు ఎలక్షన్ కంటే ముందు విలీనం చేయాలని కోరుతూ వినతిపత్రం అన్ని సంఘాలు ఇచ్చినందున సీఎం స్వయంగా జోక్యం చేసుకొని అన్ని కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

# 2047కు స్వర్ణాంధ్ర సాధన

### ఎమ్మెల్యేలు ప్రజా సేవకులే.. పెత్తందారులు కాదు

### ఎవరు తప్పు చేసినా వదలను..

### ప్రధాని మోడీ, పవన్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం

### రెండేళ్ల విజయోత్సవ సభలో ఎపి సిఎం చంద్రబాబు



శుక్రవారం తిరుపతిలో జరిగిన రెండేళ్ల విజయోత్సవ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎపి సిఎం చంద్రబాబు, కూటమి నేతలు

**తిరుపతి,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా ప్రతినిధులు పెత్తందార్లుగా కాకుండా ప్రజా సేవకులుగా మెలగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సరిగ్గా రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభు త్వం ఏర్పాటైందని, ప్రధాని మోదీ, జనసేనాని పవన్ కల్యా ణ్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపా డుదామని ఇచ్చిన పిలుపునకు రాష్ట్ర ప్రజలు మద్దతు పలి కారన్నారు. 57శాతం ఓట్ షేర్‌తో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని సిఎం అన్నారు. 164 సీట్లతో ఎన్‌డిఎకు అధికారాన్ని అందించారని, 2024 ఫలితాలను గెలుపుగా కాదు రాష్ట్రపుఃనర్నిర్మాణానికి అప్పజెప్పిన బాధ్యతగా భావించి సేవ చేస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం తిరు పతి రూరల్ చంద్రగిరి నియోజకవర్గం దామినేడులో రెండేళ్ల పాలనపై జరిగిన విజయోత్స వ సభకు సీఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, అనిత, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, పార్థసారధి ఇతర మంత్రులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ 2019-24 మధ్య కాలంలో రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారని, అన్నీ తాకట్టుపెట్టి అప్పులపాల్జేశారని అన్నారు. అలాంటి సమయంలో రాష్ట్రప్రజలు మంచి కోసం ఎన్‌డిఏ కూటమి పార్టీల అవసరాన్ని గుర్తించి ఓటేశారన్నారు. రెండేళ్ళలో ప్రజల నమ్మకాన్ని పొందామని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామన్నారు. గడచిన రెండేళ్ళలో ఎంతో చేశామని, మరింతగా అభివృద్ధి చేస్తామ న్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తోందని, కేంద్ర సాయాన్ని, ప్రధాని మోదీ చేయూతను మరువలేమాన్నారు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గెలుపుగా గాకుండా బాధ్యతగా భావి స్తూ పాలన మొదలు పెట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల్లో నమ్మకం కలిగింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన కొనసాగిస్తామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలపైనా అప్రమత్తంగా ఉండాలని సీఎం హెచ్చరించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టే సమయానికి అన్ని రంగాల్లో సంక్షోభంవ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, 2019లో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం 10 లక్షల కోట్ల అప్పుతో ముగిసిందన్నారు. కేంద్ర పథకాలను, సాగునీటి పథకాలను నిర్వీర్యం చేశారని, పెట్టుబడి దారులను, పారిశ్రామికవేత్తలను వెంటాడి వేటాడి తరిమేశారన్నారు. యువత భవిష్యత్తును దెబ్బ తీశారని, ప్రశ్నించిన ప్రజలను వేధించారని గుర్తుచేశారు. తనపై ఎఫ్ఐఆర్ కూడా లేకుండా తనను అక్రమంగా జైల్లో పెట్టారని, పవన్ కల్యాణ్ ను ఇబ్బందులు పెట్టారన్నారు. రాష్ట్ర దుస్థితిని చూసి భయపడకుండా ఏడు శ్వేత పత్రాలు విడుదల చేసి ప్రజలకు వాస్తవ విషయాలు తెలియచేశామన్నారు. ప్రజలు చూపిన విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్ గెలిచిందన్నారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలు విజ్ఞత చూపారని, ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామన్నారు. ఎన్డీఏ ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

2019-24 మధ్య కాలంలో ఐదేళ్ల పాటు ఏపీ అవకాశాల్ని పోగొట్టుకుందని, విధ్వంసాన్ని సరి చేసేందుకు ఒక్కో అడుగూ కలసి ముందుకు వేస్తున్నామన్నారు. ప్రజల సేవకు పునరంకితం కావడానికే ఈ విజయోత్స వ సభను నిర్వహించుకుంటున్నామని బాబు తెలి పారు. విమర్శలకు ఆధారాలతో సహా సమాధానం చెప్పే గుండె ధైర్యం ఎన్డీఏ ప్రభుత్వానికి ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలన ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చినట్టే పాలన అందిస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ తో పాటు మేనిఫెస్టోలో హామీల అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని సాధించామని, ఎన్టీఆర్ భరోసా ద్వారా 65 వేల కోట్ల రూపాయలు పెన్షన్లు, తల్లికి వందనం ద్వారా చిన్నారులకు చదువు చెప్పిస్తున్నామన్నారు. స్త్రీశక్తి ద్వారా ఇప్పటి వరకు 71 కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించామన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో కలిసి 20 వేలు రూపాయలు ప్రతీ రైతుకూ అందించామని, 24 గంటల్లోనే ధాన్యం కొనుగోళ్ల డబ్బులు చెల్లిస్తున్నామని బాబు వెల్లడించారు. గీత కార్మికులు, వడ్డెర్లు, అర్చకులు, ఇమామ్ లు, మోజన్లు ఇలా అందరినీ గుర్తుపెట్టుకుని మరీ సంక్షేమం అందిస్తున్నామని, ఎస్సీ,ఎస్టీ, బీసీల సహా అందరికీ సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. పీ4 ద్వారా సమాజంలో జీవన ప్రమాణాలు పెంపొందింప జేస్తున్నామని, విద్య వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ సంజీవని ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది టీచర్ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్లను కూడా నియమించడం జరిగిందన్నారు. ఉద్యోగులకు 23 నెలల్లో 21 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించామన్నారు. అప్పులు చేసే వ్యక్తికి, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టిన వ్యక్తికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదని పరోక్షంగా విమర్శించారు. యావత్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన వ్యక్తికి రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత ఉందా..? మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలు ఆట ఆడిన వ్యక్తులకు ప్రజల గురించి మాట్లాడే అర్హత లేదని బాబు పేర్కొన్నారు.

వందరోజుల్లోనే హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తెచ్చానని, కల్యాణి డ్యామ్ కూడా పూర్తి చేసి శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వద్దకు నీళ్లు తీసుకువస్తామని చంద్రబాబు తెలిపారు. గత పాలకులు తిరుమల ప్రసాదాన్ని కల్తీ చేసి అపవిత్రం చేశారని, కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల అపచారం చేసి మన అందరి మనోభావాలను దెబ్బతీసేలా గొడ్డలి పార్టీ ప్రవర్తించిం దన్నారు. తిరుమల జోలికి బ్రిటీషర్లు కూడా వెళ్లలేదు. కానీ గొడ్డలి పార్టీ ఆ దుర్మార్గం చేసిందన్నారు. ప్రజలకు న్యాయం చేయాలన్నదే జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు.

# భారత్, ఐర్లాండ్ టి20 సిరీస్‌పై అనిశ్చితి





**న్యూఢిల్లీ:** బెల్ ఫాస్ట్‌లో కొనసాగుతున్న హింసాత్మక అల్లర్ల కారణంగా భారత్ ఐర్లాండ్ టి20 సిరీస్‌పై అనిశ్చితి నెలకొంది. ఆటగాళ్ల భద్రతపై బిసిసిఐ ఆందోళన వ్యక్తం చేస్తుండగా, వేదిక మార్పు లేదా సిరీస్ వాయిదా అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయి. భారత జట్టు రాబోయే రోజుల్లో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య ఈ నెల 27, 29 తేదీల్లో బెల్‌ఫాస్ట్ వేదికగానే ఈ రెండు టి20 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి షెడ్యూల్ ఖరారైంది. అయితే ఐర్లాండ్‌లో చెలరేగిన హింసాత్మక అల్లర్లు ఇప్పుడు బిసిసిఐని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. నార్తర్న్ ఐర్లాండ్ రాజధాని నగరమైన బెల్‌ఫాస్ట్‌లో గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నగరంలో జరిగిన ఒక ఘోర హత్యాయత్నం ఉదంతం ఈ అల్లర్లకు కారణమైంది. ప్రస్తుతం అక్కడ శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. సరిగ్గా ఇదే నగరంలో టీమిండియా మ్యాచ్‌లు జరగాల్సి ఉండటంతో బిసిసిఐ పెద్దలు అలర్ట్ అయ్యారు. ఈ ఆందోళనకర పరిస్థితులపై బిసిసిఐ ఇప్పటికే స్పందించింది. పరిస్థితులను చాలా నిశితంగా గమనిస్తున్నామని, తమ ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్, అధికారుల భద్రతే తమకు అన్నింటికంటే ముఖ్యమని స్పష్టం చేసింది. ఒకవేళ బెల్‌ఫాస్ట్‌లో మ్యాచ్‌లు నిర్వహించడం సాధ్యం కాకపోతే, వేదికలను మార్చే అంశాన్ని

## వేదిక మార్పు లేదా సిరీస్ వాయిదా

పరిశీలించాలని ఐర్లాండ్ క్రికెట్ బోర్డుకు సూచించింది. వేదికల మార్పునకు సంబంధించి ఐర్లాండ్ బోర్డు నుంచి ఎలాంటి ప్రతిపాదన వచ్చినా తాము సానుకూలంగా స్పందిస్తామని, కానీ ప్లేయర్ల భద్రత విషయంలో మాత్రం ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని లీగల్స్ పరంగా క్లారిటీ ఇచ్చింది. మరోవైపు ఐర్లాండ్ క్రికెట్ బోర్డు కూడా అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై స్థానిక ప్రభుత్వంతో కలిసి సమీక్షిస్తోంది. రాబోయే రెండు మూడు రోజుల్లో పరిస్థితులు అదుపులోకి రాకపోతే మ్యాచ్‌లను మరో నగరానికి మార్చడం లేదా సిరీస్‌ను తాత్కాలికంగా వాయిదా వేయడం మినహా మరో మార్గం కనిపించడం లేదు. దీంతో ఈ ప్రతిష్టాత్మక సిరీస్ జరుగుతుందా లేదా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.



## ఫిఫా ప్రపంచ కప్‌లో.. చెక్ రిపబ్లిక్‌పై దక్షిణ కొరియా సంచలన విజయం

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచకప్ గ్రూప్ దశలో దక్షిణ కొరియా అద్భుత ఆటతీరుతో చెక్ రిపబ్లిక్ పై 2-1 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ మొదట్లో వెనుకబడినప్పటికీ మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకున్న కొరియా చివరకు విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దీనితో కొరియా 16 ఏళ్ల తర్వాత ఫిఫా ప్రపంచ కప్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. మ్యాచ్ మొదలైనప్పటి నుంచే ఇరు జట్లు అటాకింగ్ కంటే డిఫన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాయి. చెక్ రిపబ్లిక్ డిఫ్ఫెండింగ్ పటిష్టంగా ఉండడంతో కొరియాకు గోల్స్ అవకాశాలు పెద్దగా లభించకపోవడంతో తొలి అర్ధభాగం ఎలాంటి గోల్ నమోదుకాలేదు. రెండో అర్ధభాగంలో మ్యాచ్ పూర్తిగా మారిపోయింది. 59వ నిమిషంలో చెక్ రిపబ్లిక్ కార్నర్ కిక్‌ను సద్వినియోగం చేసుకుని తొలి గోల్‌గా మలిచింది. లాడిస్లావ్ క్రేజ్చి అద్భుత హెడ్డర్తో జట్టుకు ఆధిక్యం అందించాడు. అయితే గోల్ వెనుకబడిన తర్వాత కొరియాకు చెందిన హ్వాంగ్ ఇన్‌బియోమ్ మరింత దూకుడుగా ఆడుతూ చెక్ రిపబ్లిక్ డిఫెన్స్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ వ్యూహాత్మక మార్పుతో కొరియా పుంజుకుంది. దీనితో 67వ నిమిషంలో బాక్స్ అంచున జరిగిన పాస్‌లతో ఏర్పడిన అవకాశాన్ని హ్వాంగ్ ఇన్‌బియోమ్ గోల్‌గా మలిచి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత 80వ నిమిషంలో మ్యాచ్ నిర్ణయాత్మక మలుపు తిరిగింది. దక్షిణ కొరియా ఓ హ్యోన్‌గ్యులో షాట్తో గోల్ సాధించి జట్టుకు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత చెక్ రిపబ్లిక్ సమీకరణ గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేసినా, కొరియా వ్యూహాత్మక మార్పులు విజయానికి ప్రధానంగా నిలిచాయి.

## అంటాల్యా ప్రపంచ కప్‌లో.. పతకం లేకుండా
## భారత్ ఆర్చర్ల నిష్క్రమణ




**న్యూఢిల్లీ:** భారత కాంపౌండ్ ఆర్చర్లు ఒక్క పతకం కూడా లేకుండానే అంటాల్యా ప్రపంచ కప్-2026ని ముగించారు. టర్కీలో శుక్రవారం జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు ఒక్క పతకం కూడా గెలవలేక తమ పేలవ ప్రదర్శనను కొనసాగించారు.

పోటీలో ఉన్న చివరి నలుగురు వెన్నం జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్, టి. గణేష్ మణిరత్నం, కుశాల్ దలాల్ అందరూ తమతమ వ్యక్తిగత ఈవెంట్లలో రౌండ్ ఆఫ్ 32లోనే నిష్క్రమించారు. అనుభవజ్ఞురాలైన జ్యోతి, డెన్మార్క్‌కు చెందిన సీనియర్ క్రీడాకారిణి తాన్యా గెల్లెన్‌థియన్ చేతిలో 144-146 తేడాతో ఓడిపోయి అరుదైన తొలి రౌండ్ల నుంచే నిష్క్రమించగా, పర్నీత్ స్పెయిన్‌కు చెందిన అలెక్సా ఒలివారెస్ చేతిలో 145-147 తేడాతో ఓటమి పాలైంది. అరంగేట్రం చేసిన టి. గణేష్, ఆస్ట్రియాకు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ నికో వీనర్ చేతిలో 143 -147 తేడాతో ఓడిపోగా, కుశాల్, ఉత్సాహంగా పోరాడినప్పటికీ, టర్కీకి చెందిన ఎమిర్హాన్ హేనీతో జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో 148-149 తేడాతో ఓటమి పాలయ్యాడు. అలాగే పురుషుల రికర్వ్ వ్యక్తిగత ఈవెంట్‌లో ఇటలీకి చెందిన మాసిమిలియానో మాండియాను 6-2 తేడాతో ఓడించిన ధీరజ్ బొమ్మదేవర సెమీఫైనల్‌కు చేరిన ఏకైక భారతీయ ఆర్చర్‌గా నిలిచాడు. మహిళల రికర్వ్ విభాగంలో దీపికా కుమారి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినా, రౌండ్ ఆఫ్ 16లో స్పెయిన్‌కు చెందిన ఎలియా కనాలిస్ చేతిలో 2-6 తేడాతో ఓడిపోయింది. మరోవైపు, ఆసియా క్రీడలకు అర్హత సాధించిన అంకితా భకత్, కుంకుమ్ మొహోద్, కీర్తి శర్మలు రౌండ్ ఆఫ్ 32లో నిష్క్రమించారు.



## తొలి టి20లో.. వెస్టిండీస్ విజయం
### 7 వికెట్ల తేడాతో శ్రీలంక ఓటమి

**న్యూఢిల్లీ:** మూడు టీ20లో భాగంగా మొదటి మ్యాచ్ చివరి ఓవర్‌లో రోవ్‌మన్ పావెల్ కొట్టిన సిక్స్ కారణంగా వెస్టిండీస్ శ్రీలంకపై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి ఆరు ఓవర్లలో 66 పరుగులు చేసినప్పటికీ, 147/9 లక్ష్య ఛేదనలో చివరిలో నెమ్మదించిన రన్ రేట్‌తో వెస్టిండీస్ మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చింది. 20 బంతుల్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా, అది తొమ్మిది బంతుల్లో బంతికి ఒక పరుగు అవసరమయ్యే స్థాయికి తగ్గింది. చివరకు, నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఆతిథ్య జట్టు 149/3 స్కోరుతో ఉండగా, పావెల్ విజయాన్ని ఖాయం చేశాడు. కెప్టెన్, ఓపెనర్ షాయ్ హోప్ అజేయంగా 65 పరుగులు చేసి కరేబియన్ జట్టుకు నాయకత్వం వహించాడు. శ్రీలంక టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తర్వాత, కమీందు మెండిస్ 51 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ మరియు ఓపెనర్ కుసల్ మెండిస్ 36 పరుగులు జోడించాడు. జాసన్ హోల్డర్, షమార్ జోసెఫ్ చెరో మూడు వికెట్లతో వెస్టిండీస్ బౌలర్లకు నాయకత్వం వహించారు. చివరి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయిన తర్వాత, తడి నేలల్లో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను శ్రీలంక 1-0తో గెలుచుకుంది. తొలి మ్యాచ్‌లో శ్రీలంక 41 పరుగుల తేడాతో విజయం సాధించింది.



## ఆస్ట్రేలియన్ ఓపెన్.. సెమీస్‌కు సింధు
### తన్వి ఓటమి


**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత్ షటర్లు పివి సింధు సెమీఫైనల్స్‌కు చేరగా, తన్వి శర్మ ప్రస్థానం ముగిసింది. సిడ్నీలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో శుక్రవారం మహిళల సింగిల్స్‌లో సింధు రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత క్వార్టర్ ఫైనల్స్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, చైనీస్ తైపీకి చెందిన చెన్ సు యును కేవలం 27 నిమిషాల్లో 21-6, 21-9 తేడాతో ఓడించింది. మూడో సీడ్ అయిన ఆమె, రెండు గేమ్‌లలోనూ ఆధిపత్యం చెలాయించి, చివరి నాలుగు స్థానాల్లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. సెమీఫైనల్ పోరులో సింధు జపాన్‌కు చెందిన టాప్ సీడ్ అకానె యమగుచితో తలపడనుంది. మరోపక్క ఇదే రోజు జరిగిన మరో మ్యాచ్‌లో టీనేజ్ సంచలనం తన్వి శర్మ యమగుచి చేతిలో ఓటమి పాలవ్వడంతో టోర్నమెంట్‌లో ఆమె అద్భుతమైన ప్రస్థానానికి తెరపడింది. ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ విజయాలు నమోదు చేసిన తన్వి 32 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 3 జపనీస్ క్రీడాకారిణి చేతిలో 21-14, 21-14 తేడాతో ఓడిపోయింది. దీంతో మహిళల సింగిల్స్ పోటీలో భారతదేశపు ఆశలు ఇప్పుడు పూర్తిగా సింధుపైనే ఆధారపడి ఉన్నాయి.

# స్టాక్ మార్కెట్లలో జోష్

### తొమ్మిది లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద
### లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబై, జూన్ 12:** అమెరికా- ఇరాన్ మధ్య డీల ఖరారవుతుందన్న అంచనాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. సుమారుగా రూ.9.7 లక్షలకోట్లు ఇన్వెస్టర్ల సంపద పెరిగినట్లు అంచనా. అన్ని ప్రధాన రంగాల సూచీలు లాభాల్లో ముగియగా, ప్రైవేట్ బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ షేర్లు మార్కెట్లకు బలాన్నిచ్చాయి. సెన్సెక్స్ 1,695.40 పాయింట్లు పెరిగి 75,527.95 వద్ద ముగిసింది. నిఫ్టీ50 461.30 పాయింట్లు పెరిగి 23,622.90 వద్ద స్థిరపడింది. లార్సెన్ అండ్ టుబ్రో 4.87 , హెచ్డీఎఫ్సీ బ్యాంక్ 3.67 , రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.64 షేర్లు నిఫ్టీకి మద్దతుచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 2.37 శాతం పెరగగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 2.60 శాతం లాభపడింది. బీఎస్ఈలో 3,222 షేర్లు పెరగగా, 1,046 షేర్లు మాత్రమే నష్టపోయాయి. 171 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడులు 6.897 నుంచి 6.870 కు తగ్గింది. రూపాయి డాలర్తో పోలిస్తే బలపడి 95.19 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ 1.05 పెరిగి రూ.1,50,499కు చేరింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ రాబడులు 4.452 కు తగ్గింది. బ్రెంట్ ముడిచమురు ధర 3.62 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 87.11 డాలర్లకు చేరింది. ఇరాన్‌డీల్‌పై ట్రంప్‌ప్రకటనతో ఆసియా, యూరప్ మార్కెట్లు కూడా లాభాల్లో ముగిశాయి. వాల్ స్ట్రీట్ ఫ్యూచర్స్ కూడా బలంగా ట్రేడ్ అయ్యాయి. ఎస్ పీ 500సూచీ 1.75 లాభపడితే నాస్డాక్ 2.54లాభాల్లో ముగిసింది. డౌ జోన్స్ పారిశ్రామిక సగటు 29 పాయింట్లు పెరిగింది. హెక్సాగాన్ న్యూట్రిషన్ షేరు బీఎస్ఈలో రూ.45 ఇష్యూ ధరపై 11.98 శాతం ప్రీమియంతో రూ.50.39 వద్ద ముగిసింది. లిస్టింగ్ రోజునే పెట్టుబడిదారులకు మంచి లాభాలు అందించింది. నెస్లే ఇండియా మ్యాగీకి ఫుడ్ సేఫ్టీ అథారిటీ నోటీసు జారీ చేసినట్లు వార్తలు రావడంతో షేరు 3.23 పడిపోయింది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ జూలై 1 నుంచి కార్లు, ఎస్యూవీల ధరలను 1.5 వరకు పెంచనున్నట్లు ప్రకటించడంతో షేరు 4.02 ఎగిసింది. యంత్ ఇన్ఫ్రాటెక్ దక్షిణ తూర్పు మధ్య రైల్వే నుంచి రూ.16.54 కోట్ల ఆర్డర్ దక్కడంతో షేరు 17.24 జంప్ చేసింది. జీఎన్జీ ఎలక్ట్రానిక్స్ ప్రమోటర్ వాటాల విక్రయం ద్వారా కనీస నిబంధనలు పాటించడంతో షేరు 3.44 పెరిగింది. పీసీబీఎల్ కెమికల్ గుజరాత్లోని ముంద్రా ప్లాంట్లో కొత్త స్పెషాలిటీ ఉత్పత్తి లైన్ ప్రారంభించడంతో షేరు 4.43 లాభపడింది. హిటాచి ఎనర్జీ ఇండియా వడోదర సమీపంలోని కర్జన్లో భారీ పవర్ ట్రాన్స్ఫార్మర్ ఫ్యాక్టరీ కోసం రూ.2,000 కోట్ల పెట్టుబడి ప్రకటించడంతో షేరు 3.31 పెరిగింది. రత్నవీర్ ప్రెసిషన్ ఇంజినీరింగ్ రూ.330 కోట్ల రైట్స్ ఇష్యూ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలపడంతో షేరు 2.33 లాభపడింది. ఏవీజీ లాజిస్టిక్స్ హల్దీరామ్ నాగ్పూర్ నుంచి దీర్ఘకాలిక రవాణా ఒప్పందం దక్కడంతో షేరు 6.05 పెరిగింది.



## రేజర్‌పే రూ.5,700 కోట్ల ఐపిఒకు సిద్ధం
### వారం రోజుల్లో గోప్య డీఆర్‌హెచ్‌పీ దాఖలు

**బెంగళూరు,జూన్ 12:** డిజిటల్ చెల్లింపుల ఫిన్‌టెక్‌సంస్థ రేజర్‌పే ఐపిఒ జారీద్వారా సుమారు 600 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700కోట్లు సమీకరించే లక్ష్యంతో రహస్య డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ డిఆర్‌హెచ్‌పిని వచ్చే వారం రోజుల్లో దాఖలు చేయనున్నట్లు సమాచారం.ఈ ఐపీఓలో 300 మిలియన్ డాలర్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు, మరో 300 మిలియన్ డాలర్ల మేర ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉంటుంది. ప్రస్తుత పెట్టుబడిదారులు తమ వాటాల్లో కొంత భాగాన్ని విక్రయించే అవకాశం పొందనున్నారు. రేజర్‌పే ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా 5 నుంచి 6 బిలియన్ డాలర్ల విలువను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరాంతానికి ముందే దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ పూర్తి చేయాలని సంస్థ యోచిస్తున్నట్లు వర్గాలు వెల్లడించాయి. ఐపీఓ నిర్వహణ కోసం యాక్సిస్ క్యాపిటల్, సిటీగ్రూప్, గోల్డ్‌మాన్ శాక్స్, జేపీ మోర్గాన్ మరియు మహీంద్రా క్యాపిటల్‌లను ప్రధాన బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా నియమించింది. భారత్‌లో లిస్టింగ్‌కు మార్గం సుగమందేశీయ మార్కెట్‌లో లిస్టింగ్‌కు అనువుగా ఉండేందుకు రేజర్‌పే 2025 మేలో కీలక నిర్ణయం తీసుకుంది.

అమెరికాలో ఉన్న సంస్థ ప్రధాన కార్యాలయం మరియు కార్పొరేట్ డొమిసైల్‌ను తిరిగి భారత్‌కు మార్చుతూ రివర్స్ ఫ్లిప్ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో భారత స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్‌కు అవసరమైన నియంత్రణ అనుమతుల మార్గం సుగమమైంది. అంతకుముందు ఈ ఏడాది ఏప్రిల్‌లో తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణకు కంపెనీ వాటాదారుల ఆమోదం కూడా పొందింది.

రేజర్‌పేలో పీక్ ఎక్స్‌వీ పార్ట్నర్స్, జీఐసీ, టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, వై కాంబినేటర్, సేల్స్‌ఫోర్స్ వెంచర్స్, లైట్స్‌పీడ్ వెంచర్ పార్ట్నర్స్ వంటి ప్రముఖ అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. భారత ఫిన్‌టెక్ రంగంలో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ఐపీఓలలో రేజర్‌పే పబ్లిక్ ఇష్యూ ఒకటిగా నిలుస్తోంది.

## లక్షకోట్ల డాలర్ల తొలి బిలియనీర్‌గా ఎలాన్ మస్క్




**న్యూయార్క్,జూన్ 12:** ప్రపంచ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరో అరుదైన రికార్డు సృష్టించారు. 1 ట్రిలియన్ డాలర్లకు పైగా వ్యక్తిగత సంపద కలిగిన తొలి వ్యక్తిగా నిలిచారు. స్పేస్ ఎక్స్ ఐపీఓ విజయవంతం కావడంతో మస్క్ సంపద భారీగా పెరిగింది. ప్రస్తుతం ఆయన నికర ఆస్తుల విలువ 1.1 ట్రిలియన్ డాలర్లను (రూ.94.6 లక్షల కోట్లు) దాట నున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. స్పేస్‌ఎక్స్ షేర్లు మార్కెట్లోకి రావడంతో మస్క్ సంపదలో ఒక్కసారిగా భారీ పెరుగుదల నమోదైంది. ఐపీఓకు ముందు ఆయన సంపద సుమారు 780 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఇప్పుడు స్పేస్ ఎక్స్‌లోని వాటా విలువ ఒక్కటే 866 బిలియన్ డాలర్లకు చేరినట్లు తెలుస్తోంది. టెస్లా, ఇతర కంపెనీల్లోని వాటాలను కలుపు కొంటే మొత్తం సంపద 1.1 ట్రిలియన్ డాలర్లను దాటుతోంది. స్పేస్‌ఎక్స్ ఐపీఓకు ముందు కూడా మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు. ఆయన సంపద దాదాపు 971 బిలియన్ డాలర్లుగా ఉండేది. రెండో స్థానంలో ఉన్న గూగుల్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్ సంపద సుమారు 304 బిలియన్ డాలర్లు మాత్రమే మస్క్ సంపద ఇప్పుడు కొన్ని దేశాల మొత్తం ఆర్థిక వ్యవస్థలనే దాటిపోవడం విశేషం. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం తైవాన్ జీడీపీ విలువ 976.7 బిలియన్ డాలర్లు. ప్రస్తుతం భారత జీడీపీ సుమారు 4.15 ట్రిలియన్ డాలర్లని అంచనా. మన దేశ జిడిపిలో దాదాపు నాలుగో వంతుకు సమానమైన సంపద ఒక్క మస్క్ వద్దే ఉంది. టెస్లా ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలకు కొత్త దిశ చూపించారు. స్పేస్‌ఎక్స్‌తో అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. న్యూరాలింక్, బోరింగ్ కంపెనీ వంటి సంస్థలను కూడా స్థాపించారు. 2022లో ట్విట్టర్‌ను కొనుగోలు చేసి దానికి ఎక్స్‌గా పేరు మార్చిన సంగతి తెలిసిందే. మస్క్ కంపెనీలకు పెట్టుబడిదారులు ఇస్తున్న ప్రత్యేక విలువను మార్కెట్ విశ్లేషకులు ఎలాన్ ప్రీమియంగా అభివర్ణిస్తున్నారు.

## 114.58 బిలియన్ డాలర్లకు ఆర్బీఐ పసిడి నిల్వలు

**ముంబై, జూన్ 12:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న బంగారు నిల్వల విలువ జూన్ 5తో ముగిసిన వారానికి 1.98 బిలియన్ డాలర్లు పెరిగి 114.58బిలియన్ డాలర్లకు చేరింది.విదేశీ మారక నిల్వలు మొత్తం 711 మిలియన్ డాలర్లు తగ్గి 681.61 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫారెక్స్ నిల్వల్లో అత్యధిక వాటా కలిగిన విదేశీ కరెన్సీ ఆస్తులు వారాంతంలో 2.70 బిలియన్ డాలర్లు తగ్గి 543.44బిలియన్ డాలర్లకు చేరాయి. ఎఫ్‌సీఏలను అమెరికన్ డాలర్ విలువలో లెక్కిస్తారు. ఇందులో యూరో, పౌండ్ స్టెర్లింగ్, యెన్ వంటి ఇతర విదేశీ కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే మార్పుల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుంది. గత వారంలో భారత విదేశీ మారక నిల్వలు సుమారు 938 మిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. రూపాయిపై అధిక ఒత్తిడి లేదా విదేశీ మారక మార్కెట్లో తీవ్ర అస్థిరత నెలకొన్నప్పుడు ఆర్బీఐ తన విదేశీ మారక నిల్వలను వినియోగించి జోక్యం చేసుకుంటుంది. అమెరికన్ డాలర్ నిల్వలను మరింత బలోపేతం చేయడంతో పాటు రూపాయి పుంజుకునేందుకు సహాయపడే లక్ష్యంతో ఎఫ్‌సీఎన్ఆర్‌బీ డిపాజిట్ల హెడ్జింగ్ వ్యయాన్ని తామే భరిస్తామని ఆర్బీఐ ఇటీవల ప్రకటించింది. ఆర్బీఐ చేపట్టిన చర్యల ప్రభావంతో భారత రూపాయి ప్రస్తుతం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 95 స్థాయి వద్ద ట్రేడవుతోంది. ఈ ఏడాది ప్రారంభంలో ఇది 97 స్థాయికి పడిపోయిన సంగతి తెలిసిందే. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం, రానున్న రోజుల్లో రూపాయి 94.70 నుంచి 95.60 మధ్య శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది.

## 3.93%కి మేనెల రిటైల్ ద్రవ్యోల్బణం
### ఆహార ఉత్పత్తుల ధరలు పెరుగుదలే ప్రధాన కారణం



**న్యూఢిల్లీ,జూన్ 12:** దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మే నెలలో 3.48 శాతంనుంచి 3.93 శాతానికి పెరిగింది. ఆహార వస్తువుల ధరలు పెరగడం వల్లే ఈ పెరుగుదల చోటుచేసుకున్నట్లు కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ మోస్పి శుక్రవారం డేటా విడుదలచేసింది.మే నెలలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, సీఎన్జీ ధరలు పలుమార్లు సవరించబడటంతో ఇంధన వ్యయాలు కూడా పెరిగాయి. మార్కెట్ అంచనా వేసిన 4.02 శాతం కంటే ద్రవ్యోల్బణం కొద్దిగా తక్కువగా నమోదవడం విధాన నిర్ణేతలకు కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు.ప్రస్తుతం నమోదైన 3.93 శాతం ద్రవ్యోల్బణం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) మధ్యకాలిక లక్ష్యమైన 4 శాతానికి కాస్త దిగువన ఉంది. మేలో ఆహార ద్రవ్యోల్బణం 4.20శాతం నుంచి 4.78 శాతానికి చేరుకుంది. ఆహార మరియు పానీయాల విభాగంలో ద్రవ్యో ల్బణం 4.0శాతం నుంచి 4.6 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్లో 3.74 శాతంనుంచి మేలో 4.25 శాతానికి పెరి గింది. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.16 శాతం నుంచి 3.53 శాతానికి పెరిగింది. కోర్ ద్రవ్యోల్బణం కూడా పెరుగుదల నమోదు చేసింది. ఏప్రిల్లో 3.4 శాతంగా ఉన్న కీలక ద్రవ్యో ల్బణం మేలో 3.8 శాతానికి చేరింది. రెస్టారెంట్లు మరియు వసతి సేవల విభాగంలో ద్రవ్యోల్బణం 5.8 శాతంగా నమోదయింది. పాన్, పొగాకు మరియు మత్తు పదార్థాల విభాగంలో ద్రవ్యోల్బణం 4.83 శాతంగా నమోదైంది. దుస్తులు, పాదరక్షలు 2.80 నుంచి 2.98 గృహ నిర్మాణం, యుటిలిటీ సేవలు 1.71 నుంచి 1.73 శాతం, ఆరోగ్య సేవల విభాగంలో 1.64 శాతంనుంచి 1.49శాతానికి తగ్గింది.ఇతర విభాగాల్లో విద్యా సేవల ద్రవ్యోల్బణం 2.99 శాతంగా, వినోదం, క్రీడలు, సంస్కృతి విభాగంలో 1.98 శాతంగా, గృహోపకరణాలు మరియు ఫర్నిషింగ్ విభాగంలో 1.90 శాతంగా నమోదయ్యాయి.

## ధరలు పెంచిన టాటా మోటార్స్

**ముంబయి,జూన్ 12:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తన ప్రయాణికుల వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. జులై 1 నుంచి కొత్తధరలు అమల్లోకి రానున్నాయి. గరిష్ఠంగా 1.5శాతం వరకు ధరల్ని పెంచుతోంది. ఈ పెంపు ఐసీఈ మోడళ్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలకూ వర్తిస్తుంది. పెరుగుతున్న ముడి పదార్థాల వ్యయం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా పెరుగుతున్న ప్పటికీ వాటిలో సింహ భాగాన్ని తామే భరిస్తు న్నామని, కొంత భారాన్ని వినియోగదారులపై మోపక తప్పడం లేదని కంపెనీ పేర్కొంది. ధరల పెంపు అన్ని మోడళ్లపై ఒకేలా ఉండదని తెలిపింది. వాహనం, వేరియంట్‌ను బట్టి మారుతుందని స్పష్టం చేసింది. ఇటీవల ఆటోమొబైల్ రంగంలో ధరల పెంపులు సాధారణంగా మారాయి. గత నెలలో హ్యుందాయ్ కూడా తన వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచింది. ముడి పదార్థాల ధరలు, కమొడిటీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడమే కారణమని తెలిపింది. మారుతి సుజుకి జూన్ నుంచి వివిధ మోడళ్లపై రూ.30 వేల వరకు ధరలు పెంచగా మహీంద్రాకూడా ఈ ఏడాది ప్రారం భంలోనే తన ఎస్‌యూవీలు, కమర్షియల్ వాహనాల ధరలను సవరించింది. దీంతో కంపెనీ షేర్లు కూడా మార్కెట్లో స్వల్ప లాభాలతో ట్రేడ్ అయ్యాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.